అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 25-12-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 306 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను

మంత్రి వర్గం నుంచి తొలగించాలి

జమిలి జిమ్మిక్కులతో ప్రజాస్వామ్యానికి విఘాతం : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు


పార్టీ రాష్ట్ర 4వ మహాసభల లోగో, కరపత్రం ఆవిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఇటీవల ముగిసిన పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మీద అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. అంబేద్కర్‌ను అభిమానించే వారిని ఎగతాళి చేస్తూ, అంబేద్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందనీ, ఆ జపం ఏదో దేవుడ్ని తలుచుకుంటే స్వర్గమన్నా వచ్చేదంటూ అత్యంత అవమానకర వ్యాఖ్యలు చేశారని చెప్పారు. దీన్ని సీపీఐ(ఎం) సహా దేశం యావత్తు ఖండించి, దేశావ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అయినా అమిత్‌షా, ప్రధాని మోడీ ఏమీ పట్టనట్టే ఉన్నారనీ, పైపెచ్చు ప్రధాని మోడీ... అమిత్‌షా వ్యాఖ్యల్ని సమర్థిస్తూ మాట్లాడుతున్నారని చెప్పారు. మంగళవారంనాడిక్కడి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎమ్‌బీ భవన్‌లో సంగారెడ్డి పట్టణంలో జరగనున్న 4వ రాష్ట్ర మహాసభల లోగో, కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, టీ జ్యోతితో కలిసి ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు.

రాజ్యాంగం గురించి పార్లమెంటులో చర్చ జరుగుతుండగా, ఆ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానించడమంటే, ఆ రాజ్యాంగాన్ని అవమానించడం, పరోక్షంగా రాజ్యాంగాన్ని తిరస్కరించడమే అవుతుందని అన్నారు. మోడీ సర్కార్ ఓవైపు రాజ్యాంగం గురించి నిత్యం జపం చేస్తూ, మరోవైపు అదే రాజ్యాంగానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే వామ పక్ష పార్టీలు డిసెంబర్ 22న సమావేశమై అమిత్‌షా వ్యాఖ్యల పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తూ, నిరసన కార్యక్రమాలు చేయాలని నిర్ణయించాయని తెలిపారు. దానిలో భాగంగా ఈనెల 30వ ... 12లో

సొమ్ముకడిది... సోకొకడిది



బడా బాబుల పాలవుతున్న ప్రజాధనం

బ్యాంకుల్లో పెరిగిపోతున్న మొండి బకాయిలు

వాటి రద్దుతో లాభపడుతోంది కార్పొరేట్ శక్తులే

'దివాలా' పేరుతో బ్యాంకులకు టోకరా

మోసగాళ్లందరూ పాలకుల సన్నిహితులే

ప్రధాని నరేంద్ర మోడీ తొలి పది సంవత్సరాల పాలనలో దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థ అక్షరాలా రూ.16.11 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసింది. ఎన్డీఏ ప్రభుత్వం రద్దు చేసిన ఈ రుణాలు అప్పుల ఊబిలో కూరుకుపోయిన అన్నదాతలవి కావు. బడా కార్పొరేట్ శక్తులు, మోసగాళ్లవి. వీరిలో అనేక మంది మోడీకి సన్నిహితులని తెలుస్తోంది. మోడీ ప్రభుత్వం రద్దు చేసిన రూ.16.11 లక్షల కోట్ల రుణాలతో ఆ పది సంవత్సరాల కాలంలో బడ్జెట్లలో విద్యకు కేటాయించిన మొత్తాన్ని పోల్చి చూస్తే అందులో 40 శాతం కంటే తక్కువగానే ఉంది. ఆరోగ్య రంగానికి జరిపిన కేటాయింపులైతే రుణ మాఫీ మొత్తంలో సగమే. ఈ నేపథ్యంలో దేశంలోని బ్యాంకులు అందించిన రుణాలు, వాటిలో పారు బకాయిలపై కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి, ప్రసారభారతి మాజీ సీఈఓ, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ మాజీ సభ్యుడు జవహర్ సిర్కార్ 'ది వైర్' పోర్టల్‌కు అందించిన విశ్లేషణాత్మక కథనం....

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వ కార్పొరేట్ రుణమాఫీల కారణంగా నష్టపోయింది ఎవరు? ప్రభుత్వం కాదు ప్రజలే. ఎందుకంటే అది ప్రజాధనం కాబట్టి. నష్టపోయింది మనమే లేదా బ్యాంకులు. బ్యాంక్ వినియోగదారులు, డిపాజిట్‌దారులు అయిన సామాన్య ప్రజలే ఎక్కువగా నష్టపోయారు. ఆ విషయం మనకు తెలియడం లేదు. కనీసం మనకు సమాచారం కూడా ఇవ్వరు. మరి నష్టపోయిన ఈ సొమ్మును బ్యాంకులు ఎలా రాబట్టుకుంటున్నాయి? అవి అందించే ప్రతి చిన్న సేవకూ అధికంగా యూజర్ చార్జీలు వడ్డిస్తున్నాయి. ఈ చార్జీలపై కొన్నిసార్లు సమాచారం ఇస్తున్నాయి. మరికొన్ని సందర్భాలలో అదీ లేదు. రుణాలు తీసుకునే వారి నుండి వసూలు చేస్తున్న వడ్డీ రేటు పెరిగిపోతోంది. కార్పొరేట్ శక్తులు, పారిశ్రామికవేత్తలకు రుణాలు ఇచ్చి మునిగిపోతున్నామని తెలిసి కూడా బ్యాంకులు మళ్లీ మళ్లీ వారికే అప్పులు మంజూరు చేస్తున్నాయి.

రుణాలలో పారు బకాయిలు

గత పది సంవత్సరాల కాలంలో ప్రధాని మోడీ 1,600 చట్టాలను మందబలంతో రద్దు చేశారు. అది కూడా నిమిషాల వ్యవధిలోనే జరిగిపోయింది. కానీ బ్యాంక్ రుణాల రద్దుకు వీలు కల్పిస్తున్న నిబంధనలను మాత్రం సవరించలేదు. పునఃపరిశీలించనూ లేదు. ఇప్పుడు బ్యాంకింగ్ చట్టాలకు సవరణలు చేస్తున్నప్పటికీ ఈ అంశాలను వాటిలో ప్రస్తావించలేదు. రుణాలు మాఫీ చేయడం ద్వారా పాలకులు బ్యాంకుల ఆర్థిక స్థితిగతులను దెబ్బతీస్తున్నారు.

మన దేశంలో మొండి బాకీలు

మన దేశంలో మొండి బాకీల పరిస్థితి ఏమిటి? 2005-2022 మధ్య కాలానికి సంబంధించి ఐఎంఎఫ్ ఓ అధ్యయనం జరిపింది. ఇందులో మోడీ అధికారంలో ఉన్న 2014-2022 మధ్యకాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే భారతీయ బ్యాంకులు ఇచ్చిన మొత్తం రుణాలలో పారు బకాయిల వాటా ఏకంగా 7.85 శాతం ఉంది. ఇది సాక్షాత్తూ ఆర్థిక శాఖ సహాయ మంత్రి ఇచ్చిన సమాచారమే. డిపాజిటర్లు అయిన పేద, మధ్య తరగతి ప్రజలను మోసం చేసి సంపన్నులైన స్నేహితులకు లబ్ధి చేకూర్చేందుకే ఇష్టారీతిన రుణమాఫీలు చేశారు. మోడీ తొలి ... 11లో

కార్పొరేట్ వాటాయే అధికం

గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు ఇచ్చిన రుణాలు రూ.171 లక్షల కోట్లు. అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్లను కలిపి చూసినా ఇది ఎక్కువే. బంగ్లాదేశ్, మాల్దీవులలో అవినీతి పాలకుల కారణంగా బ్యాంక్ రుణాలలో పారు బకాయిల వాటా ప్రమాదకరంగా 9 శాతానికి చేరింది. మన దేశంలో పాలక పక్షానికి కొమ్ముకాస్తున్న మీడియా మాత్రం పెరుగుతున్న పారు బకాయిల ప్రమాదాన్ని గుర్తించడమే లేదు. రుణ మాఫీలో కార్పొరేట్ రంగం వాటా ఎంత అని ప్రశ్నిస్తే ఆర్థిక మంత్రి ఇచ్చిన సమాధానం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఇప్పటి వరకూ మాఫీ అయిన రూ.16.11 లక్షల కోట్ల రుణాలలో కార్పొరేట్ రంగం వాటా రూ.9.25 లక్షల కోట్లు. రుణాలు సులభంగా పొందేందుకు ఈ రంగానికి సహకరిస్తున్న రాజకీయ నాయకులు, బ్యాంక్ అధికారులకు రివార్డులు ఇవ్వాల్సిందే కదా. ఈ భారీ దోపిడీ గత దశాబ్ద కాలంలో దేశంలో రాజకీయ వ్యవస్థ బలపడడానికి ఉపకరించింది.

డైవర్ట్ పాలిటిక్స్ వద్దు

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలును సమీక్షించాలి

- సంధ్య థియేటర్ దుర్ఘటనలో పరిహారం పెంచాలి
- అల్లు అర్జున్ వ్యవహారంలో పోలీసుల పాత్రపైనా విచారణ జరపాలి: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా పండుగలు చేసుకున్నారనీ, అదే సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలయ్యాయో సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఐదేండ్ల వాగ్దానాలన్నీ ఒకే ఏడాదిలో పూర్తిచేయాలని ... 2లో

ఉత్సాహభరితంగా మహాసభల ఏర్పాట్లు

ప్రజల నుంచి అపూర్వ ఆదరణ

ఆహ్వానసంఘం అధ్యక్షులు చుక్క రాములు

"సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల ఏర్పా ట్లలో నిమగ్నమై ఉన్నాం. సీపీఐ(ఎం) కార్మిక వర్గ పార్టీ. శ్రామికుల పక్షాన పోరాడుతుంది. కష్టజీవుల పక్షాన కార్యకర్తలు ఇంటింటికీ దళాలుగా వెళ్లి, సీపీఐ(ఎం) నిబద్ధతను వివరిస్తూ, విరాళాలు సేకరి స్తున్నారు. కార్మికవర్గం నుంచి మంచి స్పందన వస్తుంది. నాల్గవ రాష్ట్ర మహాసభల్ని కార్మికవర్గం, కష్టజీవుల సహకారంతో సంగారెడ్డి పట్టణంలో నిర్వహిస్తు న్నాం. ఏర్పాట్లు చాలా ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. 700 మంది ప్రతినిధుల తోపాటు ఇతరులకు కూడా మొత్తం ... 12లో

మత అల్లర్లకు బీజేపీ సర్కార్ ప్రోత్సాహం

- కార్పొరేట్ల స్వార్థం కోసమే మణిపూర్‌లో అల్లర్లు
- ఖనిజ సంపదను దోచే కుట్ర
- తెలంగాణ ఉద్యమంపై సమగ్ర పుస్తకం రావాలి: "నట్, బోల్ట్స్ ఆఫ్ వార్ అండ్ పీస్" పుస్తకావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- ఇజ్రాయిల్‌కు డ్రోన్ల సరఫరాను అడ్డుకోవాలి : సీఎంకు సీపీఐ(ఎం) నేత జూలకంటి వినతి
- హాజరైన ఎంపీ మల్లు రవి, కూనంనేని, బోయినపల్లి తదితరులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"బీజేపీ ప్రభుత్వం మత అల్లర్లను ప్రోత్సహిస్తోంది. కార్పొరేట్ల ధనదాహం కోసమే మణిపూర్‌లో అల్లర్లను సృష్టిస్తోంది. అక్కడున్న అపార ఖనిజ సంపదను దోచుకునేందుకు రెండు గిరిజన తెగల మధ్య మారణకాండను ప్రోత్సహిస్తోంది. భారత బలగాలు మణిపూర్‌లో శాంతిని నెలకొల్పలేవా? కేంద్రం తలచుకుంటే శాంతి భద్రతలను నెలకొల్పలేదా? దేశంలో నెలకొన్న భయానక వాతావరణంపై చర్చ జరగాల్సిన అవసరం ఉంది. అప్పుడే దేశంలో ... 2లో

నాలుగు గంటలు.. 50కిపైగా ప్రశ్నలు

తొక్కిసలాట ఘటనలో కీలకాంశాలపై చిక్కడపల్లి పోలీసుల విచారణ

అల్లు అర్జున్ స్టేట్‌మెంట్ రికార్డ్



నవతెలంగాణ - ముషీరాబాద్

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి సినీనటుడు అల్లుఅర్జున్‌ను హైదరాబాద్ చిక్కడపల్లి పోలీసులు కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా సుదీర్ఘంగా విచారించారు. మంగళవారం ఉదయం 11.05 గంటలకు అల్లు అర్జున్ తన తండ్రి, నిర్మాత అల్లు అరవింద్‌తో కలిసి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి, బన్నీ వాసు వీరితో ఉన్నారు. ఈ మేరకు సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, సీఐ రాజునాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక గదిలో అల్లు అర్జున్‌ను విచారించారు. దాదాపు నాలుగు గంటల పాటు సాగిన విచారణలో పలు కీలక విషయాలను పోలీసులు రాబట్టినట్టు తెలుస్తోంది. 50కిపైగా ప్రశ్నలను అల్లు అర్జున్ ముందుంచి ఆయన స్టేట్మెంట్‌ను పోలీసులు రికార్డు చేసినట్టు తెలిసింది. అర్థమయ్యేలా సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయాలని పోలీసులు భావించినట్టు సమాచారం.

డిసెంబర్ 4న ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' బెనిఫిట్ షో చూసేందుకు భారీగా అభిమానులు రావడంతో జరిగిన తొక్కిస లాటలో రేవతి అనే మహిళ మృతి చెందగా ఆమె కుమారుడు శ్రీతేజ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ ఘటనకు కారణమైన దాదాపు 18 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. అందులో భాగంగా అల్లు అర్జున్ పై బీఎన్ఎస్ 118 (1), బీఎన్ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కోర్టులో హాజరు పరచగా హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ అనంతరం పోలీసులు అల్లు అర్జున్‌ను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్ కు రావాల్సిందిగా నోటీసులు జారీ చేయగా మంగళవారం ఆయన పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు. మొదటగా అల్లుఅర్జున్‌ను ఆ రోజు సంధ్య థియేటర్‌కు వచ్చేటప్పుడు ఎవరి అనుమతి ... 11లో



పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు

క్రిస్మస్ శుభాకాంక్షలు

- చీఫ్ జనరల్ మేనేజర్

కేసీఆర్, హరీశ్ నోటీసులపై స్టే

భూపాలపల్లి కోర్టు ఆర్డర్ అమలును నిలిపివేసిన హైకోర్టు

నవతెలంగాణ -హైదరాబాద్

జయశంకర్ భూపాలపల్లిలోని మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోవడానికి అక్రమాలే కారణమనే కేసులో కింది కోర్టు ఇచ్చిన నోటీసుల అమలును హైకోర్టు నిలిపేసింది. కింది కోర్టులో కేసును కొట్టేయాలంటూ బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు ఈ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి మొదటి తరగతి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో ఎస్. రాజలింగమూర్తి గతేడాది నవంబర్ 7న వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. ఈ మేరకు గత జనవరి 12న ఇచ్చిన ఉత్తర్వులను సమీక్ష చేయాలంటూ రాజలింగమూర్తి భూపాలపల్లిలోని సెషన్స్ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసులో కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు నాటి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రజత్ కుమార్, సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్, ఇంజినీర్ ఇన్ చీఫ్ హరిరామ్, ... 11లో



తలతాకట్టు పెట్టైనా...

పేదల సొంతింటి కల నిజం చేస్తాం : పొంగులేటి

మొదటి దశలో 4.5 లక్షల ఇండ్లు

కొత్త ఏడాదిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం షురూ

33 జిల్లాలకు ప్రాజెక్ట్ డైరెక్టర్ల నియామకం

యాప్ ద్వారా 32 లక్షల దరఖాస్తులు పరిశీలన

ఫిర్యాదుల కోసం త్వరలో టోల్ ఫ్రీ నెంబర్, వెబ్‌సైట్ : గృహనిర్మాణ శాఖ మంత్రి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తలతాకట్టు పెట్టైనా సరే పేదల సొంతింటికల నిజం చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మొదటి దశలో 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా వచ్చే నాలుగేండ్లలో 20లక్షల ఇండ్లను నిర్మిస్తామని వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పర్యవేక్షించేందుకుగానూ రాష్ట్రంలోని 33 జిల్లాలకు 33 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్థాయి కలిగిన ప్రాజెక్టు డైరెక్టర్లను నియమించామని చెప్పారు. ఏటా నాలుగున్నర లక్షల చొప్పున వచ్చే ... 11లో

'మ్యాచింగ్ గ్రాంట్ల'కు కటకట

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల కుప్ప నేటి కాంగ్రెస్ సర్కారుకు గుదిబండలా మారింది. అది ఎంతలా అంటే ... రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులను సైతం తెచ్చుకోలేనంతగా మారింది. వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాల (సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్) నిర్వహణ కోసం రాష్ట్రాలు తమ తమ వాటాలను (మ్యాచింగ్ గ్రాంట్లు) విడుదల చేస్తే, కేంద్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేస్తుంది. కానీ ఇప్పుడు ఆర్థిక పరిస్థితి సహకరించకపోవటంతో తెలంగాణ ప్రభుత్వం ఆయా మ్యాచింగ్ గ్రాంట్లను విడుదల చేయలేక తన నిస్సహాయతను వ్యక్తం చేస్తోంది. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకూ వివిధ మ్యాచింగ్ గ్రాంట్ల కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ సుమారు రూ.1000 నుంచి రూ.1,200 కోట్ల వరకూ విడుదల చేయాల్సి ఉంది. వీటిని గురువారం (ఈనెల 26)లోగా విడుదల చేయాలంటూ కేంద్రం గతంలో డెడ్‌లైన్ విధించింది. ఆలోగా విడుదల చేయకపోతే తాము ఇవ్వాల్సిన రూ.5 వేల కోట్లను ఇవ్వబోమంటూ హెచ్చరించింది. కానీ ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేయలేదు. దీంతో ఆ రూ.5 వేల కోట్లను మనం నష్టపోతామా? అనే ఆందోళన ఆర్థికశాఖ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

మ్యాచింగ్ గ్రాంట్ల విషయంలో తమకు ఇచ్చిన గడువును పొడిగించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేంద్రానికి విజ్ఞప్తి చేస్తూ లేఖ రాసింది. కానీ కేంద్రం అందుకు తిరస్కరించింది. 'ఈ విషయంలో తెలంగాణ ఒక్కదానికే మినహాయింపునిస్తే, ఇతర రాష్ట్రాల నుంచి ఇబ్బందులు ఎదురవుతాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టాల్సిన బడ్జెట్‌కు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభమైన నేపథ్యంలో వివిధ రాష్ట్రాలకు గ్రాంట్లు, ఇతర సహాయాల లెక్కలను వెంటనే తేల్చాలి. ఈ క్రమంలో మీ వాటాను విడుదల చేస్తారో లేదో చెప్పండి. అంతేతప్ప గడువును పొడిగించలేం...' అంటూ కేంద్రం సమాధాన మిచ్చినట్టు తెలిసింది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లను విడుదల చేస్తుందా? లేదా? అనేది చూడాలి.

బీఆర్ఎస్ నుంచే ప్రారంభం...

మ్యాచింగ్ గ్రాంట్లకు సంబంధించి గత బీఆర్ఎస్ సర్కార్ సైతం అప్పట్లో మీనమేషాలు లెక్కించింది. కేంద్రం విధించిన డెడ్‌లైన్లు దగ్గర పడుతున్నా పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించింది. తద్వారా కేంద్రం ఇచ్చే నిధులను చేజార్చుకుంది. తాము కేసీఆర్ మాదిరిగా బేషజాలకు పోకుండా కేంద్రం నిధులను సద్వినియోగం చేసుకుంటామని సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలుమార్లు ప్రకటించిన దరిమిలా... రాబోయే రెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

డైవర్ట్ పాలిటిక్స్ వద్దు



(మొదటిపేజీ తరువాయి)

తాము అనట్లేదనీ, కనీసం ఐదోవంతు అయినా అమలు చేశారా లేదా అనేది చూడాలన్నారు. రైతు భరోసా, నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు ఇవ్వడం, మహిళలకు రూ.2,500 ఇస్తామనే వాగ్దానాలు ఏవీ ప్రారంభం కాలేదన్నారు. రైతు రుణమాఫీ కూడా రూ.20వేల కోట్లు మాత్రమే పూర్తిచేశారనీ, మరో రూ.11వేల కోట్లు బ్యాంకర్లకు చెల్లించాల్సి ఉందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినా, బస్సుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. భవిష్యత్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాలపై దృష్టి కేంద్రీకరించి పరిపాలన చేయాల్సి ఉంటుందని సూచించారు. ఎన్నికల హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కోసం హైడ్రా, మూసీ ప్రాజెక్ట్ వంటి అంశాలను తెరపైకి తెస్తున్నారనీ, వీటిపై సమగ్రంగా చర్చించాలని చెప్పారు. డైవర్ట్ పాలిటిక్స్ మంచిది కాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏడవ గ్యారెంటీగా చెప్పిన ప్రజాస్వామ్య పరిరక్షణ కాగితాలకే పరిమితమైందనీ, ఇప్పటికీ సీఎం పర్యటనల్లో సీపీఎం కార్యకర్తల అరెస్టులు తప్పట్లేదని అన్నారు. సమస్యలపై అఖిలపక్షంతో లేదా బాధితులతో చర్చలు జరగట్లేదని ఆక్షేపించారు. అసెంబ్లీ సమావేశాల్లో ధరణి పోర్టల్‌ను భూ భారతిగా మార్చారనీ, దాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే గతంలో ధరణిలో కౌలు రైతుల్ని గుర్తించబోమని అప్పటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలోనే బహిరంగంగా ప్రకటించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూమాతలో అనుభవదారుడి కాలమ్ పెట్టారనీ, కానీ అనుభవదారుడికీ, కౌలురైతుకి తేడా ఉందని వివరించారు. కౌలు రైతులకు కొన్ని హక్కులు ఉన్నాయనీ, అవి వర్తించేలా భూ భారతిలో మార్పులు చేయాలని సూచించారు. అల్లు అర్జున్ కేసు విషయంలో థియేటర్‌లో దురదృష్టకర సంఘటన జరిగిందనీ, దానికి విచారం వ్యక్తం చేస్తున్నామన్నారు. బాధిత కుటుంబానికి సంతాపం, సానుభూతి తెలుపుతున్నామనీ, పార్టీ ప్రతినిధులు ఆస్పత్రికి వెళ్లి బాలుడిని పరామర్శించారని చెప్పారు. అల్లు అర్జున్ విషయంలో చట్టం తనపని తాను చేసుకుపోవడంలో అభ్యంతరం లేదనీ, తప్పని తేలితే చర్యలు తీసుకోవచ్చన్నారు. సామాన్యులు, సెలబ్రిటీలకు చట్టం వేర్వేరు కాదని స్పష్టం చేశారు. థియేటర్‌లో మహిళ చనిపోయిందని చెప్పేందుకు వెళ్లిన డీఎస్పీని కూడా అల్లు అర్జున్‌ను కలవనివ్వలేదని పోలీసులు చెప్తున్నారనీ, ఈ పద్ధతిలో అర్జున్ వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. అదే సమయంలో పోలీసులు కొన్ని వివరణలు ఇవ్వాలని కోరారు. పర్మిషన్ కోసం థియేటర్ యాజమాన్యం పోలీసుల కు దరఖాస్తు చేసుకుంటే, తామివ్వలేదని పోలీసులు చెప్పారనీ, మరి ఇంటలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఓ సెలబ్రిటీ అనుమతి కోరిన తర్వాత, దాన్ని తిరస్కరించాక, అతని కదలికల్ని గమనించాల్సిన బాధ్యత వారికి లేదా? అని అడిగారు. ఇంటిదగ్గరి నుంచి అర్జున్ థియేటర్‌కు బయల్దేరి వచ్చే వరకు నిఘా వ్యవస్థ ఏం చేస్తుందని నిలదీశారు. "జనం పోగవుతారని తెలీదా ...ఇంటినుంచి బయల్దేరినప్పుడు పోలీసులు అక్కడే ఆపేయొచ్చు కదా... ఎందుకు రానిచ్చారు? సీఎం వస్తున్నారని తెలిస్తే, ముందురోజు రాత్రే మా పార్టీ కార్యకర్తల్ని అరెస్టు చేస్తున్నారు.

అలాంటి జాగ్రత్తలు ఈ ఘటనలో ఎందుకు తీసుకోలేకపోయారు? దీనికి పోలీసులు బాధ్యత వహించాలి" అని అన్నారు.

పరిహారం పెంచాలి

"సంధ్య థియేటర్‌లో జరిగిన ప్రమాదంలో మరణించిన మహిళ కుటుంబానికి అల్లు అర్జున్ రూ.25 లక్షలు, నిర్మాణ సంస్థ మరో రూ.50 లక్షలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించాయి. ఇది సహాయంగా లేదు. ముష్టిగా ఉంది. వారి రోజువారీ కలెక్షన్లు వందలు, వేల కోట్లు అని చెప్తున్నారు. కార్మిక సంఘాలుగా ఎక్కడైనా చిన్న పరిశ్రమలో ప్రమాదం జరిగితే బాధిత కుటుంబాలకు భారీ పరిహారం ఇవ్వాలని కోరతాం. అలాంటిది ఇది ఏ రకంగానూ న్యాయం కాదు. సహయం చేయలేని స్థితిలో వారేం లేరు. మానవత్వం లేనివారూ కాదు. వారి శక్తికి తగినట్టు భారీగా సహాయాన్ని అందించాలి. రూ.5 కోట్ల పరిహారం ఇవ్వాలి".

25 నుంచి రాష్ట్ర మహాసభలు

పార్టీ రాష్ట్ర మహాసభలు మూడేండ్లకోసారి జరుగుతాయనీ, గ్రామసభల నుంచి మండల, జిల్లా స్థాయి వరకు మహాసభలు పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్ర మహాసభలు జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో జరుగుతున్నాయన్నారు. దీనిలో కేంద్ర పార్టీ నుంచి ప్రకాష్‌కరత్, రాఘవులు, విజయరాఘవన్ హాజరవుతున్నారనీ, రాష్ట్రవ్యాప్తంగా 700 మంది ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. 25న జరిగే బహిరంగ సభకు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై, జయప్రదం చేయాలని కోరారు.

అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

- 27న రాష్ట్ర వ్యాప్త నిరసనలు : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీఐటీయు రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా మండల, జిల్లా పారిశ్రామిక కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేయాలనీ, ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాలన్నీ పాల్గొని జయప్రదం చేయాలని మంగళవారం నిర్వహించిన సంఘం ఆఫీసు బేరర్స్ సమావేశంలో తీర్మానించారు. 76 ఏండ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సందర్భంలో రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. తక్షణం అమిత్ షా క్షమాపణలు చెప్పడంతో పాటు తన పదవి నుండి వైదొలగాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ పేరు ఉచ్చరించడమే నేరమన్నట్టుగా అసహనం ప్రదర్శించడం బీజేపీ, ఆర్ఎస్ఎస్ తన వక్రబుద్ధిని చూపించిందని గుర్తు చేశారు. మనువాద ధోరణిని బయట పెట్టుకున్నదని తెలిపారు. అవకాశం వచ్చినప్పుడల్లా అంబేద్కర్‌పైనా, రాజ్యాంగంపైనా బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ, కె ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు వచ్చి ..

- అశోక్‌నగర్‌లోని హాస్టల్‌లో యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-ముషీరాబాద్



పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మహిళా అభ్యర్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన హైదరాబాద్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా సోమారం గ్రామానికి చెందిన రేణుక (24) హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు హాస్టల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటోంది. ఇటీవల కుటుంబ సభ్యులు ఆమెకు వివాహం చేయాలని నిశ్చయించారు. ఈ మేరకు ఒక యువకుడితో ఎంగేజ్మెంట్ చేశారు. 2025 ఫిబ్రవరి 7న పెండ్లి ముహూర్తం కూడా ఖరారు చేసినట్టు సమాచారం. పెండ్లి చేసుకునే వరకు హైదరాబాద్‌లోనే ఉండి చదువుకుంటానని అశోక్‌నగర్ హాస్టల్‌లో ఉంటోంది. అయితే పెండ్లి చేసుకోవడం ఇష్టం లేక తీవ్ర మనస్థాపం చెంది సోమవారం రాత్రి హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. పక్కరూమ్‌లో ఉన్న స్నేహితురాలు గమనించి హాస్టల్ సిబ్బందికి సమాచారం అందించింది. కొన ఊపిరితో ఉన్న రేణుకను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. పెండ్లి పీటలు ఎక్కాల్సిన కూతురు విగతజీవిగా మారడంతో యువతి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆత్మహత్యకు పెండ్లి ఇష్టం లేకపోవడమే కారణమా మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యలో సమానత్వం రావాలి

- ప్రభుత్వ రంగంతోనే నాణ్యమైన ఉచిత విద్య సాధ్యం
- ప్రభుత్వ విద్యాభివృద్ధే లక్ష్యంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆరో మహాసభలు : మహాసభల ఆహ్వాన సంఘం చైర్మెన్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి



విద్యారంగంలో సామాజిక ఆర్థిక అంతరాలు తొలగిపోయి సమానత్వం రావాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్య, వైజ్ఞానిక మహాసభల ఆహ్వాన సంఘం చైర్మెన్, ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఆరవ మహాసభలు నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో ఈనెల 28, 29, 30 తేదీల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం నల్లగొండ జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటిరోజు వేలాదిమంది ఉపాధ్యాయులతో బహిరంగ సభ, 29, 30న ప్రతినిధుల సభ జరగనుందన్నారు. ఈ మహాసభల్లో. ప్రభుత్వ విద్యారంగాన్ని ఎలా అభివృద్ధి చేయాలి? ప్రజలు ఏమి ఆశిస్తున్నారు. ఉపాధ్యాయ వర్గంగా ప్రభుత్వ రంగంలో ఏ పాత్ర పోషించాలి? ప్రభుత్వ రంగ విద్యా విధానాన్ని బలోపేతం చేయడం, ఉపాధ్యాయుల ఉపాధ్యాయేతర సిబ్బంది సమస్యల పరిష్కారం, రానున్న మూడు సంవత్సరాల్లో విద్యారంగ అభివృద్ధి కోసం చేయాల్సిన అంశాలపై చర్చించి తీర్మానాలు చేసి ప్రభుత్వానికి అందజేయ నున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పదేండ్ల కాలంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యానికి గురి చేశారన్నారు. విద్యారంగం అంటే ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ గిరిజన సంక్షేమ పాఠశాలలు ఉంటాయి. వీటిని పట్టించుకోకుండా గత ప్రభుత్వం 650 గురుకులాలు పెట్టి అంతా గురుకుల విద్యతోనే సాధ్యమవుతుందని భ్రమలు ప్రజల్లో కల్పించిందని చెప్పారు. పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపరచడం కానీ, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం కానీ గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. నూతన ప్రభుత్వం 22 వేల పోస్టులకు పదోన్నతులు కల్పించిందన్నారు. 35 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు కల్పించిందన్నారు. పాఠశాలల్లో ఉచిత విద్యుత్‌ను ప్రవేశపెట్టి కంప్యూటర్ల ద్వారా, ప్రొజెక్టర్‌ల ద్వారా విద్యను బోధించేందుకు అవకాశం కల్పించారన్నారు. నేడు సమాజంలో ఆర్థిక అసమానతలకు అంతులేకుండా పోయిందన్నారు. సామాజిక అంతరాలు తగ్గిపోయి లేనివాడు, ఉన్నవాడు, ఒకే పాఠశాలలో చదివినప్పుడు అంతరాలు తొలగిపోతాయని అన్నారు. ప్రభుత్వ విద్యా రంగంలోనే నాణ్యమైన ఉచిత విద్య సాధ్యం అన్నారు. ప్రయివేట్ రంగం అంటే కర్మాగార కేంద్రమన్నారు. ప్రయివేట్ యూనివర్సిటీలలో సైతం అసమానతలు ఏర్పడి విద్యారంగంలో అంతరాలు పెరిగిపోతున్నాయని చెప్పారు. అసమానతలు కొనసాగితే ఆర్థిక సామాజిక అంతరాలు ఏర్పడితే విద్యలో సమానత్వం సాధించలేమన్నారు. దేశంలోని కేరళ, ఢిల్లీ రాష్ట్రాల్లో ప్రభుత్వ విద్య నాణ్యత కలిగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం కో కన్వీనర్ ఎడ్ల సైదులు, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి. నాగమణి , నల్లగొండ జిల్లా అధ్యక్షులు బక్కా శ్రీనివాస్ చారి, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, ఉపాధ్యక్షులు బి. అరుణ, నర్రా శేఖర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జి అరుణ, జిల్లా కార్యదర్శులు రమాదేవి, నలపరాజు వెంకన్న, పగిళ్ళ సైదులు, కొమర్రాజు సైదులు, వేదశ్రీ, ఆడిట్ కమిటీ కన్వీనర్ మురళయ్య , సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశిధర్, మైనార్టీ రెసిడెన్షియల్ రాష్ట్ర ఉపాధ్యక్షలు పయ్యావుల భరత్, సైదులు, జ్యోతి బాబు, సురేందర్ రెడ్డి, పగిడిపాట నరసింహా, రమణ, రాజేష్, సంతోష పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆన్‌డ్యూటీ సౌకర్యం : రాజశేఖర్‌రెడ్డి

ఈ సభలకు ప్రభుత్వం ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించిందని, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని సభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి కోరారు.

భూ నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలి



- ఆర్డీవో కార్యాలయం ఎదుట ట్రిబుల్ ఆర్ నిర్వాసితుల నిరసన

నవతెలంగాణ- గజ్వేల్

ట్రిబుల్ ఆర్ రోడ్డుకు భూములు ఇవ్వాలంటే బహిరంగ మార్కెట్లో ఉన్న భూముల ధరలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ట్రిబుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న నిర్వాసితులు మంగళవారం నిరసన తెలిపారు. మర్కుక్ మండలం చేబర్తి, పాతూరు, పాములపర్తి, జగదేవపూర్ మండలం లింగారెడ్డిపల్లి, వర్గల్ మండలం సాములపల్లి తదితర గ్రామాల చెందిన భూనిర్వాసితులు ఆర్‌డీఓ కార్యాలయం ముందు నిరసన తెలిపారు.

ఇప్పటికే మల్లన్న సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల కాలువలకు భూములు ఇచ్చి సర్వం కోల్పోయినట్టు వారు ఆవేదన చెందారు. తిరిగి ట్రిబుల్‌ఆర్ రోడ్డుకు భూములు ఇవ్వాలంటే తాము బతికేది ఎలా అని ప్రశ్నించారు. భూములు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని, వాటికి ప్రభుత్వం బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలు చెల్లించి తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా నిర్వాసితులను ఇబ్బందులు గురిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్ల విలువ చేసే భూములను ప్రాజెక్టులకు, కాలువలకు, రోడ్లకు ప్రభుత్వాలు తీసుకుంటున్నాయని, పరిహారం మాత్రం ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కాంట్రాక్టర్‌కు కోట్లాది రూపాయలు కట్ట పెడుతున్న ప్రభుత్వాలు భూమి పోతున్న నిర్వాసితులకు డబ్బులు ఇవ్వమంటే చేతులు రావడం లేదని ఆవేదన చెందారు. తమ ప్రాంతంలో ఎకరం భూమి రూ 70 లక్షల నుంచి కోటి రూపాయలు పలుకుతుందని, అలాంటి భూమికి రిజిస్ట్రేషన్ ప్రకారం పరిహారం ఇస్తే ఎలా అని వారు ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో నిర్వాసితులకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్‌పార్టీకి ఓట్లు వేస్తే ఈ ప్రభుత్వం కూడా నిర్వాసితులను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రజా ప్రతినిధుల కోసం రీజనల్ రింగ్ రోడ్డు డిజైన్ మార్చినట్టు రైతులు ఆవేదన చెందారు.



ఈహెచ్ఎస్‌ను పటిష్టంగా అమలు చేయండి

- ఉద్యోగులకు,ప్రభుత్వానికి సమాన వాటా ఉండేలా చూడండి
- మంత్రి దామోదర రాజనర్సింహకు ఉద్యోగ జేఏసీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్)ను పటిష్టంగా అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. పీఆర్సీ సిఫారసుల ప్రకారం ఉద్యోగులు, ప్రభుత్వం సమాన వాటా ఉండేలా చూడాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మంగళవారం హైదరాబాద్‌లో ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో పది లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఉన్నారని తెలిపారు. ఈహెచ్ఎస్ ట్రస్టు బోర్డును ఏర్పాటు చేయాలంటూ పీఆర్సీ సిఫారసుల పట్ల ఉద్యోగులు సంతోషంగా ఉన్నారని వివరించారు. ప్రతినెలా వాటా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా సమాన వాటా ఈహెచ్ఎస్‌కు చెల్లించాలని కోరారు. ఈహెచ్ఎస్ అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేయాలని సూచించారు. ఈహెచ్ఎస్‌ను గత ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహించలేదని తెలిపారు. ఈ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేయాలని కోరారు. అనంతరం ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ సలహాదారు కె కేశవరావును ఉద్యోగ జేఏసీ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ నాయకులు ముజీబ్ హుస్సేనీ, బి శ్యామ్, కస్తూరి వెంకటేశ్వర్లు, శ్రీరాం రెడ్డి, విద్యానాథ్, శ్రీకాంత్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మలు, బోనాలతో ఆశాల బస్సు జాతాకు స్వాగతం



- నాగర్ కర్నూల్‌లో ముగిసి.. నల్లగొండ జిల్లా దేవరకొండకు
- ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపుకోవాలని నేతల డిమాండ్

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి/కొండమల్లేపల్లి

ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ రూ.18వేల కనీస వేతనం నిర్ణయించాలని, పీఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆశాలు చేపట్టిన బస్సుజాతాకు ప్రతిచోట ఆదరణ లభిస్తోంది. మంగళవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో బస్సు జాతాకు నాగర్‌కర్నూల్ లో ఘనంగా పూలమాలలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నుంచి పోస్ట్ ఆఫీస్ వరకు బతుకమ్మలు, బోనాలతో ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో సభ నిర్వహించారు. ఆ తర్వాత నల్లగొండ జిల్లా దేవరకొండకు చేరుకోగా.. జాతాకు బతుకమ్మలు బోనాలతో ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. టీటీడీ కల్యాణ మండపం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి మాట్లాడారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపు కోవాలని, ఫిక్స్ వేతనం రూ.18వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు ఇస్తున్న పారితోషికం అనేక సంవత్సరాలుగా పెద్ద ఎత్తున పోరాటాలు చేసిన ఫలితంగానే వచ్చిందని, ఫిక్స్ వేతనం వచ్చే ఫిబ్రవరి బడ్జెట్ సమావేశంలో ప్రకటించాలని అన్నారు. ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని పోరాటాలు చేస్తుంటే ప్రభుత్వం మాత్రం నిర్బంధాలతో బెదిరిస్తోందని ఇది సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. కార్యక్రమంలో బస్సు జాతా బృందం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ 'క్రిస్మస్' శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

క్రైస్తవ సోదరులకు మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఏసుక్రీస్తు జన్మదినాన్ని జరుపుకోవడానికి, ఆయన ఆశయాలను గౌరవించే సంతోషకరమైన సందర్భం ఇదని తెలిపారు. ఏసు జీవితం ప్రేమ, క్షమాపణ, సత్యం, కరుణ, సోదరభావం, త్యాగానికి ప్రతీకని అన్నారు. క్రిస్మస్ అందరికీ అపరిమితమైన ఆనందం, ప్రేమ, శాంతి, శ్రేయస్సును తీసుకురావాలనీ, క్రిస్మస్ నిజమైన స్ఫూర్తితో, ప్రపంచాన్ని మరింత శాంతియుతంగా మార్చాలని కోరారు.

ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకం :సీఎం రేవంత్‌రెడ్డి

ఏసుక్రీస్తు బోధనలు ఇప్పటికీ ఎప్పటికీ ప్రపంచంలోని మానవాళికి మార్గదర్శకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మంగళవారం ఆయన క్రిస్టియన్ సోదరులకు, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం మానవత్వమేనని ఆయన ఎంచుకున్న మార్గం అందరికీ దిక్సూచిగా నిలుస్తోందని అన్నారు. ఏసు ప్రభువు బోధనలను అనుసరించి అన్ని మతాల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు.


మత అల్లర్లకు బీజేపీ సర్కార్ ప్రోత్సాహం

(మొదటిపేజీ తరువాయి)

శాంతి నెలకొం టుంది" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మాజీ ఎమ్మెల్సీ కొంపల్లి యాదవరెడ్డి రాసిన "నట్, బోల్ట్స్ ఆఫ్ వార్ అండ్ పీస్" అనే పుస్తకాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైనా దురాక్రమణ, మణిపూర్ అల్లర్లతో పాటు దేశంలో అనేక చోట్ల అప్రకటిత యుద్ధవాతావరణం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తమ అధికారం కోసం అల్లర్లు సృష్టిస్తూ దేశాన్ని తిరోగమనం వైపు తీసుకెళుతోందని ఆరోపించారు. యుద్ధాలనేవి, కష్టాలను, కన్నీళ్లను మిగిలిస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో యాదవరెడ్డి లాంటి మేధావి శాంతిని కాంక్షిస్తూ పుస్తకాన్ని రాయడం అభినందనీయని అన్నారు. "చాలా మంది సిద్ధాంతాలు చెబుతారు. కానీ పాటించే వారు మాత్రం కొద్దిమందే ఉంటారు. సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్‌రెడ్డి లాంటి వారు హార్డ్ కోర్ కమ్యూనిస్టులు. జైపాల్ రెడ్డి, యాదవ రెడ్డి లాంటి వారు సాఫ్ట్ కోర్ కమ్యూనిస్టులు. దేశంలో పేదలకు అభివృద్ధి ఫలాలను అందించేందుకు వారు పదవుల కోసం కాకుండా, సిద్ధాంతాల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేశారు. తెలంగాణ ఉద్యమంలోనూ వారి కృషి ఎంతో ఉంది. తెలంగాణ కోసం తెర వెనుక కృషి చేసిన వారి నుంచి ముల్కీ- నాన్ ముల్కీ, తొలిదశ, మలిదశ తెలంగాణ ఉద్యమాలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు సంపూర్ణ వివరాలతో ఒక పుస్తకాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని సీఎం ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని అదానీ కంపెనీలో తయారవుతున్న డ్రోన్లను కట్టడి చేసే అధికారం రాష్ట్రానికి లేదనీ అది కేంద్రం పరిధిలో ఉంటుందని స్పష్టం చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం వైపునుంచి వాటిని అడ్డుకునేందుకు తమ వంతు కృషి చేస్తామని ప్రకటించారు. కార్యక్రమానికి హాజరైన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ నేడు ప్రపంచంలో అప్రకటిత యుద్ధం నడుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రష్యా -ఉక్రేయిన్, ఇజ్రాయిల్-పాలస్తీనాలే కాకుండా అనేక దేశాలు అంతర్యుద్ధాలతో సతమతవుతున్నాయని పేర్కొన్నారు. ఒక దేశం మరొక దేశాన్ని ఆక్రమించుకునే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలు తమ బడ్జెట్లో 40 నుంచి 50 శాతం ఆయుధాలు, రక్షణ కోసమే కేటాయిస్తున్నాయని అన్నారు. గాజాలో జరుగుతున్న మారణకాండకు మన రాష్ట్రంలోని అదానీ కంపెనీలో తయారవుతున్న డ్రోన్లే కారణమనీ, వాటిని కట్టడి చేయడంపై సీఎం దృష్టి సారించాలని కోరారు. ప్రపంచ శాంతి సంఘం అధ్యక్షులు పల్లబ్‌సేన్ గుప్త మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రజలు శాంతిని కోరుకుంటున్నప్పటికీ, అనేక దేశాలు యుద్ధాల బాటపట్టాయని అన్నారు. వాటిని భారత్‌తో పాటు శాంతిని కోరుకునే వారు అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ సరైన సమయంలో యాదవరెడ్డి పుస్తకం రాశారని కొనియాడారు. పార్లమెంట్ సభ్యులు మల్లురవి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తున్నదని గుర్తు చేశారు. మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ మూడో ప్రపంచ యుద్ధాన్ని నివారించడంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీతో పాటు క్యూబా అధ్యక్షులు ఫెడరల్ క్యాస్ట్రో తదితరులు కృషి చేశారని గుర్తు చేశారు. ఆల్ ఇండియా పీస్ అండ్ సాలిడిరిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఒబేదుల్లా కోత్వాల్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పుస్తక కర్త యాదవరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాల సారధి 'టీఎస్ యూటీఎఫ్'

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు



- ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి అవిశ్రాంత కృషి
- బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన విద్య
- కాంగ్రెస్ ప్రభుత్వంలో కనిపిస్తున్న మార్పు
- 317 జీవో సవరణతోనే బాధితులందరికీ న్యాయం
- పెండింగ్‌లో ఉన్న డీఏలు, వివిధ రకాల బిల్లులు చెల్లించాలి
- సీపీఎస్ రద్దు, పీఆర్సీని అమలు చేయాలి : ఎమ్మెల్సీలకు రోల్‌మోడల్ నర్సిరెడ్డి
- మళ్లీ గెలిపించుకోవాలని ఉపాధ్యాయుల ఆలోచన

నవతెలంగాణతో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

రాష్ట్రంలో ఉపాధ్యాయుల పక్షాన సమస్యల పరిష్కారం కోసం నికరంగా నిలబడి పోరాడుతున్న సంఘం టీఎస్‌యూటీఎఫ్ అని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. సమస్యల పరిష్కారంలో చాంపియన్‌గా ఉంటూ పోరాడే సంఘంగా ఐక్య ఉద్యమాల సారథిగా అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా ఎదుగుతున్నదని చెప్పారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నదని వివరించారు. బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మార్పు కనిపిస్తున్న దనీ, విద్యారంగంపై ఈ ప్రభుత్వం శ్రద్ధ చూపిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఎమ్మెల్సీలకు రోల్‌మోడల్‌గా అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉన్నారని అన్నారు. వరంగల్- ఖమ్మం- నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఆయన్ను మళ్లీ గెలిపించుకోవాలని ఉపాధ్యాయులంతా ఆలోచిస్తున్నారని చెప్పారు.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక ఆరో మహాసభలు ఈనెల 28,29,30 తేదీల్లో నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు చావ రవి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...

బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలు విద్యారంగానికి సంబంధించి ఎలా ఉన్నాయి? ఆ తేడాను వివరించగలరు?

బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం నిర్లక్ష్యానికి గురైంది. ప్రయివేటు, కార్పొరేట్ విద్యారంగం నియంత్రించబడుతుందనీ, ప్రభుత్వ విద్యారంగం బాగుపడుతుందని ఆశించాం. నాటి సీఎం కేసీఆర్ కేజీ టు పీజీ ఉచిత విద్య అందిస్తామన్నారు. కలెక్టర్ కొడుకైనా, బంట్రోతు కొడుకైనా ఒకే బడిలో చదువుకునేలా కామన్ స్కూల్ విధానాన్ని తెస్తామని చెప్పారు. కానీ ఆచరణలో అది జరగలేదు. కేజీ టు పీజీని గురుకులాలకే పరిమితం చేశారు. విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలను పట్టించుకోలేదు. ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోలేదు. ఉద్యమాల ఫలితంగా 8,792 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి టీఆర్టీని 2017లో వేశారు. 2019 నుంచి 2022 వరకు ఆ నియామకాలు జరిగాయి. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఎనిమిదేండ్లు అయ్యాక మన ఊరు-మనబడి పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రభుత్వ పాఠశాలలను బాగుచేయాలన్న చిత్తశుద్ధి బీఆర్ఎస్‌లో కనిపించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖలో మార్పు కనిపిస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దే విద్యాశాఖ ఉండడంతో శ్రద్ధ చూపిస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ బడుల్లో మరమ్మతులు, మౌలిక వసతులను కల్పిస్తున్నారు. పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు గ్రాంట్‌ను విడుదల చేస్తున్నారు. ఉచిత విద్యుత్ అమలవుతున్నది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆగస్టులో పరీక్షలు నిర్వహించి అక్టోబర్‌లో నియామకాలు చేపట్టింది. ఇది అభినందనీయం. దీంతో ప్రభుత్వ స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత తీరింది. 20 వేల మందికిపైగా ఉపాధ్యాయులకు పదోన్నతులు, 37 వేల మందికిపైగా బదిలీలు జరిగాయి. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి చొరవ, టీఎస్‌యూటీఎఫ్ ప్రాతినిధ్యం మేరకు గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో బదిలీలు చేపట్టారు.

గురుకులాల సమయపాలనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్న అభిప్రాయమున్నది. దీనిపై ఏమంటారు?

రాష్ట్రంలో 1,022 గురుకులాలున్నాయి. వాటిలో 660 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. విద్యాహక్కు చట్టానికి అనుగుణంగా సమయ పాలన ఉండాలని ప్రభుత్వాన్ని కోరాం. రెండేండ్ల కింద టైంటేబుల్‌ను మార్చారు. కానీ బీసీ సంక్షేమ గురుకులాల్లో మార్చలేదు. అది విద్యార్థులు, ఉపాధ్యా యులకు అనుకూలంగా లేదు. విద్యార్థులపై ఒత్తిడి పెరుగు తున్నది. ప్రభుత్వం మొం డిగా ఉంటో ంది. అవసరమైతే కమిటీని వేసి అధ్యయనం, అందరికీ ఆమోదయో గ్యమైన సమయపాలనను అమలు చేయాలి. గురుకులాల జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తే 40 శాతం మెస్‌చార్జీలను ప్రభుత్వం పెంచింది. దానివల్ల విద్యార్థులకు మేలు కలుగుతుంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకు లాలను ప్రారంభించబోతున్నది. గురుకులాల్లో ఉపాధ్యాయులు ఒత్తిడిగా భావిస్తున్నారు. జీతం, క్యాడర్ కంటే మానసిక ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారు. పనిఒత్తిడి ఎక్కువగా ఉన్నది. గురుకులాల ఉద్యోగాలను వదిలి బయటికి వస్తున్నారు. బోధనేతర పనుల భారం ఎక్కువవుతున్నది. పరిపాలనా వ్యవస్థను ఆధునీకరించాలి.

ఒకటో తేదీన జీతాలు వస్తున్నాయి, పెండింగ్‌లో వివిధ రకాల బిల్లులు, డీఏలు ఉన్నాయి కదా ఉద్యోగులు సంతృప్తిగానే ఉన్నారా?

నాలుగేండ్ల కాలంలో ఏనాడూ ఉద్యోగులు ఒకటో తేదీన జీతాలు తీసుకోలేదు. ఒకటిన జీతాలిస్తామని కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే ఒకటిన జీతాలిస్తున్నది. అది అందరికీ రావడం లేదు. ట్రెజరీ ద్వారా 010 పద్దు కింద జీతాలు తీసుకునే వారికే అమలవుతున్నది. గ్రాంట్ ఇన్ ఎయిడ్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు రావడం లేదు. డీఏలు, వివిధ రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పీఆర్సీ ఊసేలేదు. సీపీఎస్ రద్దు గురించి మాట్లాడ్డం లేదు. ఆరోగ్యకార్డులపై నిర్ణయం జరగలేదు. దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో అసంతృప్తి పెరుగుతున్నది. పదేండ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మధ్య ఐక్యత లేదు. ఇప్పుడు 206 సంఘాలు కలిసి జేఏసీగా ఏర్పడ్డాయి. ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. సీఎం రేవంత్‌రెడ్డి చర్చలకు పిలిచి మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరిలోపు ఆర్థికపరమైన సమస్యలను పరిష్క రించ లేమన్నారు. రెండు డీఏలు ఇస్తారని ఆశించినా క్యాబి నెట్ ఒక డీఏ ఇచ్చింది. సమగ్ర శిక్ష ఉద్యోగులు, కాం ట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగు లకు సమాన పనికి సమాన వేతనం కావాలని కోరుతు న్నారు. మినిమం టైంస్కేల్ ఇవ్వా లని డిమాండ్ చేస్తు న్నారు. గురుకులాల్లో సీఆర్టీలు, పార్ట్‌టైం, గెస్ట్ సిబ్బంది ఉద్యోగ భద్రత కల్పించాలని అడుగుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వాగ్దానం చేశారు. దాన్ని నిలబెట్టు కోవాలి. ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో త్రిసభ్య కమిటీని వేశారు. ఇంకా పని మొదలు పెట్టలేదు. ఉద్యోగ సంఘాలను పిలిచి మాట్లాడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను, విశ్వసనీయతను నిలబెట్టుకోవాలి.

317 జీవో వల్ల స్థానికత కోల్పోయిన ఉద్యోగుల సమస్యకు పరిష్కారమేంటీ?

తెలంగాణ ఏర్పాటు స్థానికత పునాదుల మీద జరిగింది. రాష్ట్రంలో 33 జిల్లాలు ఏర్పడ్డాయి. రాష్ట్రపతి ఉత్తర్వులు-2018 ప్రకారం ఉద్యోగాల్లో స్థానికులకు 95 శాతం రిజర్వేషన్ ఉన్నది. కానీ స్థానికత లేకుండా సీనియార్టీ ఆధారంగా 317 జీవోను బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చింది. ఆ ప్రభుత్వం పడిపోవడంలో ఇది ఒక కారణం. 317 జీవో బాధితులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. అభిప్రాయాలను సేకరించింది. న్యాయం చేస్తుందన్న నమ్మకం కలిగించింది. భార్యాభర్తలు (స్పౌజ్), ఆరోగ్య సమస్యలు, మ్యూచువల్ (పరస్పర) బదిలీలకు అవకాశం కల్పించింది. దానికోసం మంత్రివర్గ ఉపసంఘం వేయాల్సిన అవసరం లేదు. స్థానికత కోల్పోయిన ఉద్యోగుల బదిలీల ప్రస్తావన లేదు. దరఖాస్తు పెట్టుకున్న ప్రతి ఉద్యోగికీ న్యాయం చేయాలి. అందుకోసం 317 జీవోను సవరించాలి. లేదంటే బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన 317 జీవోకు క్లీన్‌చిట్ ఇచ్చినట్టు అవుతుంది.

శాసనమండలి ఎన్నికల్లో మీ వ్యూహం ఏంటీ?

ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం, మెదక్- నిజామాబాద్- కరీంనగర్- ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలు మార్చిలో జరగబోతు న్నాయి. ఈ ఎన్నికల్లో నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి టీఎస్‌యూటీఎఫ్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మళ్లీ పోటీ చేస్తున్నారు. అన్ని జిల్లాల్లో ప్రచారానికి ప్రణాళిక సిద్ధం చేశాం. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాడేది టీఎస్‌యూటీఎఫ్. దానికి మద్దతిచ్చేది, ఆ పోరాటాల్లో భాగస్వాములయ్యేది నర్సిరెడ్డి. ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల సంక్షోభాన్ని నివారించడానికి, మోడల్ స్కూల్, కేజీబీవీ బదిలీలు, గురుకులాల్లో పదోన్నతులు, బదిలీల వ్యవహారంలో నర్సిరెడ్డి కీలకంగా వ్యవహరించారు. అందుకే ఎమ్మెల్సీలకు రోల్‌మోడల్‌గా ఉన్నారు. నియోజకవర్గంలో అన్ని జిల్లాల్లో విద్యాసంస్థలను సందర్శించారు. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో సమర్థవంతంగా ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. నిజమైన ప్రజాప్రతినిధి అని నిరూపించుకున్నారు. సంఘాలకతీతంగా అన్ని వర్గాల మన్ననలు పొందారు. మరోసారి ఆయన్ను గెలిపించుకోవాలని ఉపాధ్యాయులంతా ఆలోచిస్తున్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆరో మహాసభల్లో ఏయే అంశాలు చర్చిస్తారు. భవిష్యత్ కార్యాచరణ గురించి వివరించండి?

అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యంతో, హక్కులు, బాధ్యతలు ఉద్యమ నేత్రాలుగా టీఎస్‌యూటీఎఫ్ పనిచేస్తున్నది. రెండేండ్లకోసారి నిర్మాణ మహాసభలు జరుగుతాయి. కొత్త కమిటీని ఎన్నుకుంటారు. ఆరో మహాసభలు నల్లగొండలో ఈనెల 28,29,30 తేదీల్లో జరుగుతున్నాయి. ఇందులో ఎన్ఈపీ-2020 దుష్ఫలితాలు, రాష్ట్ర విద్యారంగం పరిస్థితి గురించి చర్చిస్తాం. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు, వాటి పరిష్కారం, ఐక్య ఉద్యమాలు వంటి అంశాలపై చర్చ ఉంటుంది. టీఎస్‌యూటీఎఫ్ ఏర్పడినపుడు 20 వేల సభ్యత్వం ఉన్నది. ఈ పదేండ్లలో అది రెట్టింపైంది. 33 జిల్లాల్లోనూ కమిటీలున్నాయి. ప్రభుత్వ రంగంలో అన్ని యాజమాన్యాల్లో టీఎస్‌యూటీఎఫ్ కమిటీలున్నాయి. ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని పెంపొందించుకోవడానికి శిక్షణా తరగతులు, సెమినార్లు, గోష్టులు నిర్వహిస్తాం. ప్రభుత్వం ఏదైనా, అధికారంలో ఎవరున్నా ఉపాధ్యాయుల పక్షాన నికరంగా నిలబడి పోరాడేది టీఎస్‌యూటీఎఫ్. ఐక్య ఉద్యమాల సారథిగా పోరాడే సంఘంగా ఎదుగుతున్నది.

రేవతి కుటుంబానికి పుష్ప టీమ్ రూ.ఐదు కోట్లు చెల్లించాలి

కిమ్స్ ఆస్పత్రిలో శ్రీతేజకు సీపీఐ(ఎం) బృందం పరామర్శ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సంధ్య థియేటర్ ఘటనలో మృతి చెందిన రేవతి కుటుంబానికి పుష్పటీమ్ రూ. ఐదు కోట్లు చెల్లించాలనీ, శ్రీతేజ తండ్రి భాస్కర్‌కు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం శ్రీనివాస్ పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జూలకంటి మీడియాతో మాట్లాడుతూ సంధ్య థియేటర్ వద్ద పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో శ్రీతేజ తల్లి రేవతి చనిపోవటం బాధాకరమన్నారు. రేవతి కుమారుడు కూడా ఇప్పటి వరకు కోమాలో ఉండి, ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడని డాక్టర్లు తెలిపారన్నారు. ఈ ఘటనకు అల్లు అర్జున్, పుష్పటీమ్ బాధ్యత వహించాలన్నారు. పోలీసుల అనుమతి లేకుండా అల్లు అర్జున్ రావటం సరికాదన్నారు. పోలీసులతో పాటు ఇంటెలిజెన్సీ విభాగం పరిస్థితిని అంచనా వేయటంలో విఫలమయ్యారని చెప్పారు. రాజకీయాలతో నిమిత్తం లేకుండా ఘటనకు సంబంధించిన వ్యవహారం పట్ల నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వానికి సూచించారు

సినిమా రంగంలో మార్పు రావాలి : కూనంనేని

సినిమా రంగంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అభిప్రాయపడ్డారు. పుష్ప-2 సినిమా తొక్కిసలాటలో కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహాతో కలిసి పరామర్శించారు. రౌడీయిజాన్ని ప్రోత్సహించే సినిమాలకు అనుమతులు ఇవ్వొద్దని ప్రభుత్వాన్ని కోరారు.

27న రాష్ట్రవ్యాప్తంగా సర్పంచుల నిరసన

- గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలందజేత
- వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సర్పంచుల సంఘాల జేఏసీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు వినతిపత్రాలు అందజేసి నిరసన తెలపాలని సర్పంచుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ..మాజీ సర్పంచ్ ల బాధలు వర్ణానీతమని పేర్కొన్నారు. సర్పంచులుగా గెలిచిన పాపానికి అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తే ప్రభుత్వాలు పట్టించుకోకుండా, పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాయని వాపోయారు. అసెంబ్లీలో బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు తమ సమస్యలను ప్రస్తావిస్తే అధికార పార్టీ ఎమ్మెల్యేలు అవహేళన చేస్తూ మాట్లాడి, సర్పంచుల సమస్యను మరింత జటిలం చేసే విధంగా వ్యవహరించారని విమర్శించారు. మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామస్వరాజ్యం కోసం తాము కృషి చేశామనీ, ఇప్పుడు తాము అప్పులపాలై అత్యంత దీనస్థితిలో ఉంటే ప్రభుత్వం కనకరించక పోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించిన తరువాతనే ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు వెళ్లాలనీ, లేని పక్షంలో ఆ ఎన్నికలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల జాయింట్ యాక్షన్ కమిటీ ఉపాధ్యక్షుడు జీ.మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, గణేష్, మల్లయ్య, పూర్ణచందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా కష్టాలు


అధిక రేట్లతో ప్రేక్షకులు జేబులకు చిల్లు



- డబుల్ బెనిఫిట్‌ని మిస్సవ్వం : నిర్మాతలు
- ఇలాగైతే రోడ్డున పడతాం : ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు
- క్యాష్ చేసుకుంటున్న ఓటీటీలు

రెడ్డి హనుమంతరావు

కిరణ్‌ది మధ్య తరగతి కుటుంబం. భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఫ్యామిలీతో కలిసి నెలలో కనీసం ఒక సినిమా చూసే అలవాటు. దీని కోసం తన జీతంలో రూ.1500 బడ్జెట్‌ని కేటాయించి, ప్రతీ నెలా తూ.చ.తప్పకుండా అనుసరిస్తున్నాడు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే తనకిష్టమైన హీరో సినిమాని రిలీజ్‌కి ముందే ఎలాగైనా సరే చూడాలనుకున్నాడు. అనుకున్నట్టే బెనిఫిట్ షోస్ వేస్తున్నట్టు ప్రకటన చూశాడు. ఆన్‌లైన్‌లో టిక్కెట్ ధర రూ.1500 ఉన్నప్పటికీ సర్వీస్ చార్జి, జీఎస్టీ ఇవన్నీ కలిపి మరో 100 రూపాయలు (సుమారుగా) ఎక్స్‌ట్రా అయ్యింది. తీరా టికెట్ బుక్ చేసే టైమ్‌లో ఇంటర్వెల్ బ్రేక్‌లో స్నాక్స్ కాంబో ఆఫర్‌కి టెంప్ట్ అయ్యి రూ.300 అనే ఆఫర్ మీద క్లిక్ చేశాడు. మొత్తం రూ.1900 అయినప్పటికీ టిక్కెట్ బుక్ చేసుకున్నాడు. అనుకున్న బెనిఫిట్ షోకి టిక్కెట్ బుక్ అవ్వగానే ప్రపంచాన్నే జయించినట్టు ఆనందంగా ఫీలయ్యాడు. రేపు ఫలానా టైమ్‌లో బెనిఫిట్ షోకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పాడు. అదేంటి ప్రతి నెలా మనందరం కలిసి వెళ్తాం కదా.. ఇప్పుడు నువ్వొక్కడివే వెళ్తే ఎలా?, నేనంటే అర్థం చేసుకుంటాను. పిల్లలు అలా కాదు.. వాళ్ళని తీసుకెళ్ళకపోతే మారాం చేస్తారు. వాళ్ళని సముదాయించడం నా వల్ల కాదు.. అని భార్య అనగానే, చేసేది లేక పిల్లలతో పాటు భార్యకి కూడా తన మాదిరిగానే టిక్కెట్లు బుక్ చేశాడు. మొత్తం..7,600 రూపాయలు అయ్యింది. సినిమా బాగుందా లేదా అనేది పక్కన పెడితే, కిరణ్ జేబుకి మాత్రం గట్టిగానే చిల్లు పడింది. ఎంతగా అంటే సినిమాకి కేటాయించిన బడ్జెట్‌కి మూడు రెట్లు ఎక్కువ అయ్యింది. ఉన్న ఫళంగా అంత డబ్బు ఖర్చు అవ్వడంతో కిరణ్ ఫ్యామిలీ నాలుగు నెలల పాటు సినిమాలకు దూరంగా ఉంది. ఈ ఫ్యామిలీనే కా దు ఇలాంటి మధ్యతరగతి ఫ్యామిలీలెన్నో ఇదే తరహాలో తమ అభి మాన నటుడి సినిమా చూడా లనే ఉత్సాహ ంలో మూడు నాలుగు రెట్లు అధిక ధర ఉన్నప్పటికీ టిక్కెట్లు కొని, తర్వాత కొన్ని నెలల పాటు సినిమా లకు దూరంగా ఉంటు న్నారు. దీని వల్ల సింగిల్ స్క్రీన్ థియేటర్లకు జనా లు రాక వెలవెలబోతున్నాయి. దీని ప్రభావం ఆర్థికంగా ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల మీద పడితే, దీన్నే అదనుగా తీసుకుని ఓటీటీలు పలు ఆఫర్లతో ఆకర్షిస్తూ ప్రేక్షకుల్ని ఇంటికే పరిమితం చేస్తున్నాయి.



బెనిఫిట్ షోల వల్ల వచ్చే భారీ కలెక్షన్లతో కేవలం నిర్మాతలు లాభపడుతున్నారే తప్ప, సదరు సినిమాని తీసుకున్న పంపిణీదారులు, సినిమాని ప్రదర్శిస్తున్న ఎగ్జిబిటర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. భారీ టిక్కెట్ ధరలతో రెండు లేదా మూడు రోజుల పాటు బెనిఫిట్ షోలు వేయడంతో సినిమా చూద్దాం అనుకున్న ప్రేక్షకులు సైతం ఇంతే టిక్కెట్ ధర చెల్లించాలా అనే మీమాంశతో సినిమాని చూడ్డానికి రావడం లేదని పలువురు ఎగ్జిబిటర్లు వాపోతున్నారు.

హీరోల సినిమాలను వాళ్ళ అభిమానులతోపాటు యూత్ ఎంత ధర ఉన్నా చూస్తున్నారు. వీళ్ళ హడావుడి కేవలం ఆ మొదటి మూడు, నాలుగు రోజులు మాత్రమే. ఆ తర్వాత రావాల్సింది ఫ్యామిలీసే. అత్య ధిక టిక్కెట్ ధరల వల్ల ఫ్యామిలీస్ థియేటర్లకు రావ డం లేదు. దీని వల్ల ఎగ్జి బిటర్లే కాదు మేం కూడా నష్టపో తున్నాం అని డిస్ట్రిబ్యూ టర్లు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవ ల జరిగిన కొన్ని పరిణామాల దృష్ట్యా ఇకపై బెనిఫిట్‌షో లతోపాటు టిక్కెట్ల రేట్లు పెంచే ప్రసక్తే లేదని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. థియేటర్లకు ప్రాణం పోసే నిర్ణయం ప్రభుత్వం తీసుకుందని డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు ఊపిరి పీల్చుకుంటే, నిర్మాతలు దీనికి ప్రతికూలంగా స్పందిస్తున్నారు.

ప్రతి సంవత్సరం స్ట్రయిట్, డబ్బింగ్ కలుపుకుని సుమారు 250 నుంచి 280 సినిమాలు రిలీజ్ అవుతుంటాయి. వీటిల్లో 10 లేదా 15 సినిమాలు మాత్రమే పెద్దవి. మిగిలినవన్నీ చిన్న సినిమాలే. అధిక ధరలతో టిక్కెట్లు ఉన్నప్పటికీ పెద్ద సినిమాలను చూసేందుకు ఆరాటపడే ప్రేక్షకులు, చిన్న సినిమాల విషయంలో మాత్రం అలా ఉండటం లేదు. కంటెంట్ బాగుంటేనే చిన్న సినిమాలను చూడ్డానికి థియేటర్లకు వస్తున్నారు. ఒకవేళ వాళ్ళని ఆ సినిమాలు వినోదపరిస్తే, కలెక్షన్ల వర్షం కురిపిస్తున్నారు. ఇలా జరిగేది కూడా గట్టిగా 10 లేదా 15 సినిమాలకే. మరి మిగిలిన సినిమాల పరిస్థితి ఏంటి?, ఈ సినిమాలను ప్రదర్శించే థియేటర్లు, వాటి యజమానుల పరిస్థితి ఏంటి?, వీటిని పంపిణీ చేస్తున్న డిస్ట్రిబ్యూటర్ల పరిస్థితి ఏంటి?.. అనే ప్రశ్నలకు మాత్రం స్పష్టమైన సమాధానం లేదు. ఇవన్నీ సవ్యంగా ఉండాలంటే అసలు బెనిఫిట్ షోలే ఉండకూడదు. అలాగే ఇష్టానుసారం టిక్కెట్ల ధరలు పెంచకుండా ఒక స్థిరమైన ధరని మాత్రమే ఫిక్స్ చేయాలి. అలా చేస్తే సినిమాని నమ్ముకున్న మాలాంటి వాళ్ళ జీవితాలు బాగుపడతాయి. లేదంటే రోడ్డున పడతాయని పంపిణీదారులు, ప్రదర్శనదారులు నిర్వాహ మాటంగా చెబుతుంటే, భారీ బడ్జెట్‌తో సినిమాలు తీశాం. టిక్కెట్ల ధరలు పెంచకపోతే ఎలా?, బెనిఫిట్ షోలు లేకపోతే మేమూ రోడ్డున పడతాం అంటూ నిర్మాతలూ ఆందోళన పడుతున్నారు. ఈ విషయమై మరికొద్ది రోజుల్లో కొంతమంది నిర్మాతలు సీఎం రేవంత్‌రెడ్డిని కలవబోతున్నారు. ఆయనకి తమ పరిస్థితిని వివరించి, ఎలాగైనా బెనిఫిట్ షోలు, టిక్కెట్ల ధరని పెంచుకునే వెలుసుబాటు కోసం ప్రయత్నాలు చేయబోతున్నారు. ఇప్పుడు ఆయన్ని కలవడం ఆయా నిర్మాతలకు అత్యవసరం కూడా. ఎందుకంటే రాబోయే సంక్రాంతికి బ్యాక్ టు బ్యాక్ మూడు పెద్ద హీరోల సినిమాలు రాబోతున్నాయి. వీటిల్లో రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్', బాలకృష్ణ 'డాకు మహారాజ్', వెంకటేష్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలు బరిలో ఉన్నాయి. వీటితోపాటు అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' డబ్బింగ్ సినిమా కూడా పోటీలో ఉంది. బేసిగ్గా సంక్రాంతి సీజన్ అంటే కలెక్షన్ల వర్షం. పైగా బెనిఫిట్ షోలు, అధిక టిక్కెట్ల ధరలు.. నిర్మాతలకి డబుల్ బెనిఫిట్‌నిస్తాయి. ఈ డబుల్ బెనిఫిట్‌ని క్యాష్ చేసుకోవడానికి నిర్మాతలు పావులు కదుపుతుంటే, పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు సైతం ముఖ్యమంత్రిని కలిసి తమ గోడుని వినిపించబోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. అయితే పరిశ్రమను, దాన్ని నమ్ముకున్న నిర్మాతల్ని, డిస్ట్రిబ్యూటర్లని, పంపిణీదారుల్ని రక్షించడం ఎంత ముఖ్యమో, వీళ్ళందరికీ ప్రాణ వాయువైనా ప్రేక్షకుడ్ని కూడా రక్షించడమూ అంతే ముఖ్యమని ప్రభుత్వం గుర్తిస్తే, అందరికీ న్యాయం జరుగుతుంది. అలా జరగాలని ఆశిద్దాం.



సంపాదకీయం

అమ్మాయిలూ 'గేమ్'ఛేంజర్లే

'గేమ్ అమ్మాయిలది కాదు, అబ్బాయిలదీ కాదు. స్టామి నాది...' అని ఓ యాడ్‌లో అన్నట్టు సాధించాలనే పట్టుదల ఉండాలే కానీ ఆటకు లింగభేదం లేదు. ఇదే మన క్రీడాకారిణిలు మరోసారి రుజువు చేశారు. తాజాగా తొలి మహిళల అండర్-19 ఆసియాకప్ క్రికెట్ టోర్నీలో మన అమ్మాయిలు అదరగొట్టి టైటిల్ సాధించారు. దేశం గర్వించేలా చేశారు. ఫైనల్లో 41 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించారు. 'అమ్మాయిలు సత్తా చాటేనా' అనే అనుమానాలను పటాపంచలు చేస్తూ మన మహిళా క్రికెట్ టీమ్ రికార్డులు బద్దలు కొట్టింది. ఈ టీంలో తెలంగాణ బిడ్డ గొంగడి త్రిష 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవడం మనకు మరింత గర్వకారణం.

అయితే అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు ఆర్థిక భారం అమ్మాయిలను వెంటాడుతోంది. క్రీడా రంగానికి ప్రభుత్వం కేటాయిస్తున్న బడ్జెట్ కూడా నామమాత్రంగానే ఉంటోంది. ప్రభుత్వాలు కూడా పతకాలు సాధించిన క్రీడాకారులకే అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాయి. నైపుణ్యం ఉన్న వారిని ముందే గుర్తించి, తగిన శిక్షణ ఇవ్వడంలో మన ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయనేది అందరూ అంగీకరించే వాస్తవం. దీని వల్ల పేద, గ్రామీణ క్రీడాకారిణులు నైపుణ్యం ఉన్నప్పటికీ కింది స్థాయిలోనే ఆగిపోతున్నారు.



ఒక్క క్రికెట్‌లోనే కాదు అన్ని రకాల క్రీడల్లోనూ మన అమ్మాయిలు ఎప్పటికప్పుడు ఇండియా పరువు నిల బెడుతూనే ఉన్నారు. అంతర్జాతీయ పోటీల్లో దేశం పెట్టు కుంటున్న ఆశల భారాన్ని మహిళా క్రీడాకారులు మోస్తూనే ఉన్నారు. క్రికెట్, దానికి మించి రెజ్లింగ్, హాకీ, ఫుట్‌బాల్‌తో, బాక్సింగ్‌తో పాటు షూటింగ్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, ట్రాక్ అండ్ ఫీల్డ్... ఇలా ఏ విభాగంలో చూసినా ప్రస్తుతం పురుషులతో సమానంగా లేదా అంతకంటే ఎక్కువ మంది క్రీడాకారిణులు ఉన్నారు. గతంలో జరిగిన రియో ఒలింపిక్స్‌లో, టోక్యో ఒలింపిక్స్‌తో పాటు అనేక పోటీల్లో తమ శక్తిమేరకు మెరుగైన ప్రతిభ కనబరిచారు.


ఇలా ఎన్ని పతకాలు సాధించినా మన పురుషాధిక్య సమాజంలో క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవాలంటే అమ్మాయి లకు ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. సంస్కృతి, సాంప్రదాయం పేరిట అవరోధాలు సృష్టిస్తూనే ఉన్నారు. దేశానికి పతకాల వర్షం కురిపిస్తున్న రెజ్లర్లపై లైంగిక దాడులకు పాల్పడిన బ్రిజ్‌భూషణ్ వంటి నేరస్తులను కాపాడుకునేందుకు తీవ్రంగా కృషి చేసిన చరిత్ర మన కాషాయ పాలకుది. ఇలాంటి ఎన్నో అడ్డంకులను ఎదిరించి అమ్మాయిలు కొందరు క్రీడా ప్రపంచంలోకి అడుగుపెట్టినా, సరైన సదుపాయాలు ఉండటం లేదు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. అయినా పురుషుల కంటే తామేమీ తక్కువ కాదంటున్నారు మన క్రీడా కారిణులు. రెండు దశాబ్దాల ఫలితాలను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతోంది.

ఇరవైయేండ్ల కిందట సిడ్నీ వేదికగా జరిగిన ఒలింపిక్స్‌కు భారత్ 72 మంది క్రీడాకారులను పంపింది. అప్పుడే కరణం మల్లేశ్వరికి వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం వచ్చింది. ఆ ఒలింపిక్స్‌లో భారత్ సాధించింది ఆ ఒక్క పతకమే. ఇక రియో వేదికగా జరిగిన ఒలింపిక్స్‌కు 15 విభాగాలకు చెందిన 117 మంది క్రీడాకారులు వెళ్లారు. అందులో 54 మంది మహిళలు ఉన్నారు. అప్పుడు కూడా రెండు పతకాలు మాత్రమే వచ్చాయి. అవీ మహిళలు సాధించినవే. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు రజతం, రెజ్లింగ్‌లో సాక్షి మాలిక్ కాంస్యం. అప్పటి నుండి నేటి 'ఖేలో ఇండియా' వరకు మహిళలు వివిధ క్రీడల్లో, అనేక విభాగాల్లో పతకాలు సాధిస్తూనే ఉన్నారు. ఇక నిరు పేద కుటుంబంలో పుట్టిన మేరికోమ్ పక్కింటి వారు పెట్టిన మాంసం తిని బాక్సింగ్‌లో రాణించి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టింది.

లింగ సమానత్వం అత్యంత తక్కువగా ఉన్న హర్యానా లాంటి రాష్ట్రాల నుండి కూడా కొందరు ప్రముఖ మహిళా క్రీడాకారిణులు దేశానికి వన్నె తెస్తున్నారు. వారిలో గీతా ఫోగట్, బబితా ఫోగట్, వినేష్‌లు రెజ్లింగ్‌లో అంతర్జాతీయ పతకాలు సాధించారు. ఇటీవల ముంబయి, హైదరాబాద్ వంటి నగరాల నుంచి అనేక మంది మహిళా క్రీడాకారిణులు వెలుగులోకి వచ్చారు. పాఠశాల, జిల్లా స్థాయిలో పోటీలకు దిగుతున్నారు. అవకాశం వస్తే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ పాల్గొంటున్నారు.

అయితే అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు ఆర్థిక భారం అమ్మాయిలను వెంటాడుతోంది. క్రీడా రంగానికి ప్రభుత్వం కేటాయిస్తున్న బడ్జెట్ కూడా నామమాత్రంగానే ఉంటోంది. ప్రభుత్వాలు కూడా పతకాలు సాధించిన క్రీడాకారులకే అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాయి. నైపుణ్యం ఉన్న వారిని ముందే గుర్తించి, తగిన శిక్షణ ఇవ్వడంలో మన ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవు తున్నాయనేది అందరూ అంగీకరించే వాస్తవం. దీని వల్ల పేద, గ్రామీణ క్రీడాకారిణులు నైపుణ్యం ఉన్నప్పటికీ కింది స్థాయిలోనే ఆగిపోతున్నారు.

ఇక పూర్తిగా భద్రత కరువైన నేటి సమాజంలో ఆడపిల్లలను బయటకు పంపించాలంటే తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. క్రీడల్లో అమ్మాయిల వెనకబాటుకు ఇది కూడా ఓ కారణం. అలాగే మెరుగైన శిక్షణ, పోషకాహారం వంటి కారణాలతో ఇప్పటికీ దేశంలో క్రీడలు పట్టణ ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయి. కొన్ని చిన్న గ్రామాల్లో అయితే ఆటలపై అవగాహన ఉండడం లేదు. ఇక పోటీల గురించి ఎలా తెలుస్తుంది? కనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాఠశాల స్థాయి నుండే అమ్మాయిలను క్రీడల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత తమదే అని ప్రభుత్వాలు గుర్తించాలి. ముఖ్యంగా గ్రామ స్థాయిలో క్రీడలకు మౌలిక సదుపాయాలు మెరుగుపడితే క్రీడాకారిణులు మరింత మంది ముందుకొచ్చే అవకాశం ఉంటుంది.



'వాస్తవం' వెళ్లిపోయింది!

భారతీయ సినిమా రంగులు కడిగి
మూసధోరణికి మంగళం పలికి
నిప్పులాంటి నిజాల్ని వెలికితీసి
వాస్తవికత అసలు రూపాన్ని
కళాత్మక వైభవంతో ప్రదర్శించి
అవార్డుల వర్షంలో తడిసి
ముద్దయిన ఘనుడు
బెనగళ్ల శ్యామ సుందరుడు..

సమకాలీన సమాజాన్ని
అవపోసన పట్టి
కలల లోకాన్ని ఇలకు దించి
సామాజిక స్పృహను తెరకెక్కించి
మనసు పొరల్లో సహజత్వం గుచ్చి
సూర్యోదయాన్ని వెలుగులోకి తెచ్చిన
వాస్తవాల తపస్వి అతడు...

వేయితలల కులసర్పం బుసలు
పేదరికం మానవీయ విలువలు
వీధి బాలల బాలకార్మికుల వెతలు
ఎన్నెన్నో యధార్థ వ్యథార్థ గాథలు
ప్రేక్షకుల హృదయాలు తట్టిలేపేలా
అనితరసాధ్య రీతిలో చిత్రిక పట్టి
హద్దులు చెరిపి
వాస్తవికతకు అద్దం పట్టి
అద్భుత కళాఖండాన్ని
ప్రదర్శించిన నిజమైన కళాకారుడు!

(శ్యామ్ బెనగళ్ స్మృతి పథంలో..)

- భీమవరపు పురుషోత్తమ్
9949800253

అసలు లక్ష్యం ఇరాన్‌పై దాడి?



- ఎం కోటేశ్వరరావు
8331013288

ఆదివారం నాడు మధ్య ప్రాచ్యంలోని ఎర్ర సముద్రంలో అమెరికా నౌకాదళ యుద్ధ విమానం ఒకటి కూలిపోయింది. పొరపాటున దాన్ని తమ దళాలే కూల్చివేసినట్లు అమెరికా ప్రకటించగా, తామే కూల్చివేసినట్లు రాజధాని సనా నగరంతో సహా కీలకమైన ప్రాంతాలను అదుపులో ఉంచుకున్న హౌతీ సాయుధ దళం ప్రకటించింది. మరోవైపు హౌతీలు ప్రయోగించిన క్షిపణులను తమ రాడార్లు పసిగట్టలేకపోయాయని, ఫలితంగా కొద్ది మంది తమ పౌరులు గాయపడినట్లు ఇజ్రా యిల్ ప్రకటించింది. ఈ రెండు పరిణామాలు అమెరికా, ఇజ్రాయిల్ బలహీనతలను వెల్లడిం చాయి. గత కొద్ది రోజులుగా అమెరికా, ఇజ్రాయిల్ దళాలు ఎమెన్‌పై వైమానిక దాడులు జరుపుతున్నాయి. సిరియాలో బాత్ పార్టీ నేత అసద్ సర్కార్ కూలిపోయిన తరువాత ఈ పరిణామం చోటు చేసుకుంది.హౌతీలకు బదులు వారి వెనుక ఉన్న ఇరాన్ సంగతే చూడాలంటూ ఇజ్రాయిల్ గూఢచార సంస్థ మొసాద్ అధిపతి డేవిడ్ బర్నెయా తమ నేతలకు సూచించాడు. దీన్ని బట్టి ఇరాన్‌పై దాడికి పూనుకున్నట్లు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. గత ఏడాది కాలంగా ఎమెన్ కేంద్రంగా పని చేస్తున్న హౌతీలు జరుపుతున్న దాడుల తీరుతెన్నులను చూస్తే వారిని అణచివేయటం అంతతేలిక కాదని నిపుణలు చెబుతున్నారు.వారు ఇజ్రాయిల్ రాజధాని టెల్‌అవీవ్ మీద ప్రయోగించిన క్షిపణులు రెండు వేల కిలో మీటర్లు ప్రయాణించి భారీ నష్టం కలిగించాయి. లెబనాన్ కేంద్రంగా పని చేస్తున్న హిజబుల్లా కంటే వీరు శక్తివంతులని తేలింది. ఈ పూర్వరంగంలో ఒకేసారి ఇరాన్-ఎమెన్ మీద దాడులకు దిగితే రాగల పరిణామాలు, పర్యవసానాల గురించి అమెరికా కూటమి మల్లగుల్లాలు పడుతున్నట్లు చెప్పవచ్చు. మధ్యప్రాచ్య పరిణా మాలు ఏ మలుపు తిరిగేదీ ఇంకా స్పష్టంగా తెలియటం లేదు.

ఎర్రసముద్ర తీరం ఒకవైపు, మరోవైపు అరేబియా సముద్రం సరిహద్దులుగా కీలక ప్రాంతంలో ఉన్న పశ్చిమాసియాలోని ఎమెన్ తొలుత బ్రిటన్ తరువాత అమెరికా సామ్రాజ్యవాదుల కుట్రకు బలైంది. అంతర్యుద్ధం తరువాత ఉత్తర, దక్షిణ ఎమెన్‌లు 1990లో విలీనమైన తరువాత తిరిగి అంతర్యుద్ధం ప్రారంభమైంది.ప్రస్తుతం వివిధ దేశాల మద్దతు ఉన్న పక్షాల ఆధీనంలో ఎమెన్ ఉంది. ప్రభుత్వ ఆధీనంలో మెజారిటీ ప్రాంతం ఉన్నప్పటికీ దానిలో ఎక్కువ భాగం ఎడారి, తరువాత ఇరాన్ మద్దతు ఉన్న హౌతీలు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మద్దతున్న సాయుధులు, పరిమిత ప్రాంతంలో అల్‌ఖైదా, మరో రెండు సాయుధ శక్తుల ఆధీనంలో రెండు ప్రాంతాలు ఉన్నాయి. మధ్యధరా సముద్రం నుంచి సూయజ్ కాలువ ద్వారా ఎర్ర సముద్రం ఏడెన్ సంధి దగ్గర అరేబియా సముద్రం కలుస్తాయి. నౌకా రవాణాకు కీలకమైన ఈ ప్రాంతాన్ని ఆనుకొని ఎమెన్ రాజధాని సనాతో సహా కీలకమైన ప్రాంతాలు హౌతీల చేతుల్లో ఉన్నాయి. ఇటీవలి వరకు వీరిని వ్యతిరేకించే ప్రభుత్వ దళాలకు సౌదీ అరేబియా మద్దతు ఇచ్చింది. గతంలో దక్షిణ ఎమెన్ ప్రాంతానికి సౌదీ రక్షితదారుగా ఉంది. తరువాత చైనా మధ్యవర్తిత్వంలో ఇరాన్-సౌదీ అరేబియా ఒక ఒప్పందానికి వచ్చిన తరువాత సౌదీ అరేబియా జోక్యం నిలిచిపోయింది. పాలస్తీనాకు గట్టి మద్దతుదారుగా ఉన్న హౌతీల ఆధీనంలోని ఎమెన్ ఇటీవలి కాలంలో ఇజ్రాయిల్ దుశ్చర్యలను అడ్డుకుంటున్నది. ఎర్ర సముద్ర ప్రాంతంలో పాలస్తీనాకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌కు వచ్చే, మద్దతు ఇచ్చే దేశాల నౌకలను అడ్డుకోవటం ద్వారా ఒత్తిడి తెస్తున్నది. ఈ కారణంగానే సూయజ్ కాలువ లేకముందు మన దేశానికి వచ్చే నౌకలు ఆఫ్రికా ఖండంలోని గుడ్‌హోప్ అగ్రాన్ని చుట్టి వచ్చినట్లుగా ఇప్పుడు కూడా అనేక దేశాల నౌకలు చుట్టుతిరిగి వస్తున్నాయి.ఈ కారణంగానే మధ్య ధరా, ఎర్ర సముద్రాల్లో తిష్టవేసిన అమెరికా మిలిటరీ ఎమెన్‌పై దాడులకు పాల్పడుతున్నది.తమపై జరుపుతున్న క్షిపణి దాడులకు ప్రతిగా ఇజ్రాయిల్ కూడా దాడులకు దిగింది. తొలిసారిగా రాజధాని సనా నగరం మీద బాంబులు కురిపించింది.



ఇరాన్‌పై ఎంత బలమైన దాడులు జరిపామో అదే విధంగా ఎమెన్‌పై కూడా చేసి తీరుతామని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదివారం నాడు ప్రకటించాడు. హౌతీలు ప్రయోగించిన క్షిపణులతో ఇజ్రాయిల్ పౌరులు వణికిపోయారు. ఎందుకంటే చీమ చిటుక్కుమన్నా తమపైకి వచ్చే ప్రతి క్షిపణిని మధ్యలోనే కూల్చివేసే సామర్థ్యం తమకుందని చెబుతున్న వారు శనివారం రాత్రి రాజధాని టెల్‌అవీవ్‌పై జరిగిన దాడిని పసిగట్టలేకపోయినట్లు స్వయంగా అంగీకరించారు. కేవలం పదహారు మంది గాయపడ్డారని మాత్రమే చెబుతున్నప్పటికీ అంతకంటే ఎక్కువే నష్టం జరిగినట్లు వార్తలు వచ్చాయి. గురువారం నాడు కూడా క్షిపణి దాడిని సూచిస్తూ దేశంలోని అనేక ప్రాంతాల్లో సైరన్లు మోగించారు. జరిగిన నష్టాన్ని యంత్రాంగం మూసిపెడుతున్నది. టెహరాన్ మద్దతుదారులపై ఎందుకు ఏకంగా ఇరాన్‌పైనే దాడులకు దిగాలని ఇజ్రాయిల్ యుద్ధ దురహంకారులు రంకెలు వేస్తున్నారు. యుద్ధ కాబినెట్ సమావేశం తరువాత నెతన్యాహు మాట్లాడుతూ హౌతీలపై దాడుల్లో తాము ఒంటరి కాదని, గత ఏడాదిగా అమెరికా, బ్రిటన్ దళాలు కూడా ఉన్నాయని చెప్పాడు. కాస్త సమయం తీసుకున్నప్పటికీ గాజాలోని హమాస్, లెబనాన్‌లోని హిజబుల్లా మాదిరి దెబ్బతీస్తామని అన్నాడు. 2023 అక్టోబరు ఏడున గాజాలో మారణకాండ ప్రారంభమైన నాటి నుంచి హౌతీలు దాడులు చేస్తున్నారు. ఇప్పటి వరకు 200 క్షిపణులు, 170డ్రోన్లు ప్రయోగించినట్లు చెబుతున్నారు.ఎర్ర సముద్రంలోకి రాకుండా వంద వాణిజ్య నౌకల మీద కూడా దాడులు చేశారు. ఇదిలా ఉండగా ఇరాన్ మీద కొనసాగిస్తున్న తప్పుడు ప్రచారంలో భాగంగా ఆ దేశం అణ్వాయుధాల తయారీకి పూనుకున్నదని మరోసారి అమెరికా ఆరోపించింది. తాము శాంతియుత ప్రయోజనాల కోసం అణుకార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, అయితే గతంలో ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడు అంతకు ముందు కుదిరిన ఒప్పందాల నుంచి ఏకపక్షంగా వైదొలగి, తమ మీద విధించిన ఆంక్షల కారణంగా యురేనియం శుద్ధికి పూనుకున్నట్లు ఇరాన్ అంటోంది.

ఆదివారం నాడు అమెరికాకు చెందిన ఎఫ్-18 యుద్ధ విమానాన్ని కూల్చివేశామని, ఎమెన్‌పై అమెరికా, బ్రిటన్ దాడులను అడ్డుకున్నామని హౌతీ మిలిటరీ ప్రతినిధి యాహ్యా శారీ ప్రకటించాడు. అమెరికా విమానవాహక నౌక హారీ ఎస్ ట్రూమన్, ఇతర అనేక అనుబంధ నౌకలు శనివారం నుంచి దాడులు ప్రారంభించినట్లు పేర్కొన్నాడు. విమానాన్ని కూల్చివేసేందుకు తాము ఎనిమిది క్షిపణులు, 17 డ్రోన్లను వినియోగించినట్లు వెల్లడించాడు. అయితే తమ విమానాన్ని తామే కూల్చివేసినట్లు అమెరికా చెప్పుకుంది. అయితే అది ఎలా జరిగిందన్నది మాత్రం వెల్లడించలేదు.శనివారం నాడు ఎమెన్‌లోని క్షిపణి కేంద్రాల మీద దాడులు చేసినట్లు చెప్పుకుంది.తమ, ప్రాంతీయ భాగస్వాముల, అంతర్జాతీయ నౌకల ప్రయోజనాల రక్షణకే దాడులు చేస్తున్నట్లు పేర్కొన్నది. ఎర్రసముద్ర ప్రాంతంలో హౌతీలు దాడులను ముమ్మరం చేయటంతో అమెరికా తీవ్ర ఒత్తిడికి లోనైన కారణంగానే తమ స్వంత విమానాన్ని కూడా గుర్తించలేని ఆత్రత కారణంగా స్వయంగా కూల్చివేసినట్లు నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితి కారణంగా రానున్న రోజుల్లో దాని దాడుల సామర్థ్యం తగ్గే అవకాశం ఉందంటున్నారు. ముఖ్యంగా ప్రత్యర్థుల వైపు నుంచి మానవరహిత ఆయుధాల ప్రయోగ సమయంలో ఇలాంటి తప్పిదాలు మరింత ఎక్కువగా జరిగే అవకాశం ఉంది.అమెరికా సూపర్ హార్నెట్ విమానాన్ని యుఎస్‌ఎస్ హారీ ఎస్ ట్రూమన్ నౌక నుంచి ప్రయోగించగా ఆ నౌకకు కాపలాగా అనుసరించే గెటీఎస్‌బర్గ్ అనే మరో నౌక రాత్రి మూడు గంటల సమయంలో నియంత్రిత క్షిపణి ద్వారా కూల్చివేసింది. అయితే ఇద్దరు పైలట్లు సురక్షితంగా ఉన్నట్లు ప్రకటించింది. ఈ అసాధారణ ఉదంతం హౌతీల నుంచి ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లను ఎదుర్కొనే క్రమంలో జరిగింది.తమవైపు వస్తున్నది శత్రువులదా లేక మిత్రులదా అన్నది గుర్తించటంలో అమెరికా మిలిటరీ విఫలమైంది.హౌతీల దాడులు తగ్గకపోవటంతో గత గురువారం నాడు ఎమెన్ రిజర్వుబాంకు, మరికొన్ని కంపెనీల మీద అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సరికొత్త ఆంక్షలు ప్రకటించాడు.

సిరియాలో తాము మద్దతు ఇస్తున్న అసద్ ప్రభుత్వం కూలిపోయినప్పటికీ ప్రతిఘటన కొనసాగించాల్సిందేనని ఇరాన్ భావిస్తున్నది. ప్రతిఘటించే దేశాల కూటమి కుప్పకూలిపోయినట్లు ఎవరైనా భావిస్తే పొరపాటని అధినేత అయాతుల్లా అలీ ఖమేనీ చెప్పాడు. లెబనాన్‌లో హిజబుల్లా సాయుధ సంస్థ మీద ఇజ్రాయిల్ దాడులు చేస్తున్నప్పటికీ ఇప్పటికీ సజీవంగానే ఉందన్నాడు. ఇజ్రాయిల్‌ను వ్యతిరేకించే సిరియాలో ప్రభుత్వం పతనమై నూతన శక్తులు అధికారానికి వచ్చాయి. వాటి వైఖరి, ఆచరణ ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది. ఈలోగా కొంత మంది పశ్చిమదేశాల వారు చైనా- ఇరాన్ సంబంధాల గురించి మాట్లాడుతున్నారు.ఇరాన్ బలహీన పడినందున ఇప్పటి మాదిరి చైనా దానికి మద్దతుగా ఉండకపోవచ్చని, పశ్చిమదేశాల మార్కెట్‌ను వదులు కొనేందుకు సిద్ధపడదంటూ కొందరు, ఇరాన్‌తో సంబంధాలను చూపి పశ్చిమదేశాలతో ఒప్పందాలు చేసుకోవచ్చన్న విపరీత వ్యాఖ్యానాలు కూడా చేశారు. రెండు దేశాలూ అమెరికా, ఇతర పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదుల దాడులు, ఆర్థిక ఆంక్షలకు గురవుతున్నాయి, వాణిజ్య పోరును ఎదుర్కొంటున్నాయి. సామ్రాజ్యవాద వ్యతిరేకత అన్న అంశమే వారి మధ్య బంధం పెరగటానికి కారణం. పాతిక సంవత్సరాల సహకార ఒప్పందం రెండు దేశాల మధ్య 2021లో కుదిరింది. ఉప్పు నిప్పుగా ఉన్న ఇరాన్-సౌదీ మధ్య సయోధ్య కుదిర్చి ప్రపంచాన్ని ఆశ్చర్యపరచింది. తాత్కాలికంగా మధ్య ప్రాచ్యంలో ఇరాన్ బలహీనపడినంత మాత్రాన దాన్ని వదలివేసే అవకాశాలు లేవని చైనా తీరుతెన్నులను చూసినపుడు అర్థమవుతుంది. మరింత పటిష్టపరుచుకోవటం, ఆ ప్రాంతంలో అమెరికా, దాని తొత్తు దేశాలను ఎదుర్కోవటం ఎలా అన్న అంశం రానున్న రోజుల్లో కచ్చితంగా ప్రాధాన్యత సంతరించు కుంటుంది. దీనిలో భాగంగానే బ్రిక్స్, షాంఘై సహకార సంస్థలోకి ఇరాన్‌కు షీ జిన్‌పింగ్ ఆహ్వానం పలికాడు.

సిరియాలో అసద్ ప్రభుత్వం కూలిపోయినంత మాత్రాన అక్కడ అధికారానికి వచ్చిన శక్తులు అమెరికా ఒళ్లో వాలి పోతాయని, ఇజ్రాయిల్‌కు దాసోహమంటాయని చెప్పలేము. తొలుత అక్కడ ఒక స్థిరమైన ప్రభుత్వం ఏర్పడాలి. ఆ తరువాతే దాని బాట ఎటు అన్నది స్పష్టం అవుతుంది. అమెరికా అనుకూల దేశంగా ఉన్న సౌదీ అరేబియా నాటకీయ పరిణామాల మధ్య దాన్ని ధిక్కరించి రష్యాకు దగ్గరైంది.చైనా అధినేత షీ జిన్‌పింగ్‌ను ఆహ్వానించి తాము అమెరికాతో అంటకాగేది లేదన్న సందేశమిచ్చింది. చైనా చొరవతో చిరకాల ప్రత్యర్థిగా ఉన్న ఇరాన్‌తో సయోధ్య కుదుర్చుకుంది. ఇది మధ్య ప్రాచ్యంలో చైనా చొరవలో ఒక మైలురాయి, అమెరికాకు ప్రత్యక్షంగా కనిపిస్తున్న ఎదురుదెబ్బ. అమెరికా ఆర్థిక ఆంక్షలు, రాజకీయ ఒంటరితనం నుంచి ఇరాన్ కొంత మేర బయటపడింది. చైనాను దెబ్బ తీసేందుకు అమెరికా నాయకత్వంలోని పశ్చిమదేశాలు నిరంతరం ప్రయత్నిస్తున్న పూర్వరంగంలో ప్రతి ప్రాంతంలోనూ వాటిని ప్రతిఘటించే శక్తిగా చైనా ముందుకు వస్తోందని ఇటీవలి అనేక పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. డోనాల్డ్ ట్రంప్ రెచ్చగొట్టే చర్యలతో చైనా-ఇరాన్-రష్యా మరింత దగ్గరవుతాయి. ట్రంప్ తన యంత్రాంగంలోకి ఎంచుకున్న వ్యక్తుల తీరుతెన్నులను చూసినపుడు అసలే కోతి ఆపైన కల్లుతాగింది అన్నట్లుగా వారి చర్యలుంటాయని వేరే చెప్పనవసరం లేదు.

సిరియాలో అసద్ ప్రభుత్వం కూలిపోయినంత మాత్రాన అక్కడ అధికారానికి వచ్చిన శక్తులు అమెరికా ఒళ్లో వాలిపోతాయని, ఇజ్రాయిల్‌కు దాసోహమంటాయని చెప్పలేము. తొలుత అక్కడ ఒక స్థిరమైన ప్రభుత్వం ఏర్పడాలి. ఆ తరువాతే దాని బాట ఎటు అన్నది స్పష్టం అవుతుంది. అమెరికా అనుకూల దేశంగా ఉన్న సౌదీ అరేబియా నాటకీయ పరిణామాల మధ్య దాన్ని ధిక్కరించి రష్యాకు దగ్గరైంది. చైనా అధినేత షీ జిన్‌పింగ్‌ను ఆహ్వానించి తాము అమెరికాతో అంటకాగేది లేదన్న సందేశమిచ్చింది.

అమెరికా సూపర్ హార్నెట్ విమానాన్ని యుఎస్‌ఎస్ హారీ ఎస్ ట్రూమన్ నౌక నుంచి ప్రయోగించగా ఆ నౌకకు కాపలాగా అనుసరించే గెటీఎస్‌బర్గ్ అనే మరో నౌక రాత్రి మూడు గంటల సమయంలో నియంత్రిత క్షిపణి ద్వారా కూల్చివేసింది. అయితే ఇద్దరు పైలట్లు సురక్షితంగా ఉన్నట్లు ప్రకటించింది. ఈ అసాధారణ ఉదంతం హౌతీల నుంచి ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లను ఎదుర్కొనే క్రమంలో జరిగింది.తమవైపు వస్తున్నది శత్రువులదా లేక మిత్రులదా అన్నది గుర్తించటంలో అమెరికా మిలిటరీ విఫలమైంది.

అణిచివేతలు, అవమానాలే...మనుస్మృతి మూలాలు!



- టి.స్కైలాబ్ బాబు,
9177549646

1927 డిసెంబర్ 25న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహారాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ నాయకులు బిఆర్ మోరెతో కలిసి మహారాష్ట్రలోని మహద్ పట్టణం చౌదారు చెరువు మంచినీళ్ల పోరాటం సందర్భంగా మనుస్మృతి గ్రంథాన్ని దహనం చేశాడు. నేటికీ సరిగ్గా 97 సంవత్సరాలు. ఆనాడే మనుస్మృతిని దహనం చేయాలనే ఆగ్రహం అంబేద్కర్ ఎందుకు వచ్చింది? అసలు మనుస్మృతిలో ఏముంది? అది ఎవరి ప్రయోజనాల కోసం రాయబడింది? నేటికీ మెజార్టీ ప్రజలు ఎందుకు దాన్ని అనుసరిస్తున్నారు? అది ఈ దేశ ప్రజల పైన ఏ రకమైన ప్రభావాలు చూపిందన్న అంశాలపై ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన సమయం ఇది.

ఆర్యుల రాకతో ప్రారంభమైన ఈ వర్ణధర్మం దేశంలో వృత్తులకు బిగించడం ద్వారా ఏర్పడ్డ కుల వ్యవస్థను బ్రిటిష్ వాళ్లరాకతోనే అంటరానితనం వచ్చిందని పలు రకాల చర్చలు ముందుకొస్తున్నాయి. కానీ ఇందులో అణువంత నిజం లేదు. వాల్మీకి రామాయణంలో చాకలి, మంగలిని పిలిచి సీతాదేవికి శీలపరీక్ష పెట్టారని అని రాశారు. అప్పటికే కులవ్యవస్థ ఉందని ఒప్పుకున్నట్లే కదా. కులవ్యవస్థకు వేల ఏండ్లు. బ్రిటీష్ వాళ్ల రాకకు కేవలం మూడువందల ఏండ్లు. వేల ఏండ్లుగా ఊరికి బయట అస్పృశ్యులుగా ,అంటరాని వాళ్లుగా సాటి మనుషులుగా గుర్తించబడని నీచపు సంస్కృతి ఎందుకు కొనసాగుతుంది? ఈ నేరాలు అన్ని మనుస్మృతి మూలాలు కాక మరే మిటి? ఈ మానసిక చట్టాలను ప్రజలపై బలవంతంగా రుద్దబడ్డాయి. 'మనుస్మృతి అంటే దేవుడు సృష్టించిన గ్రంథం, దీనిని అం దరూ అమలు చేయాలి.లేకపోతే దేవుడి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది' అని విస్తృతంగా ప్రజల మెదళ్లను కలుషితం చేశారు.

మనుస్మృతిలో సుమారు 2500 శ్లోకాలు, ఎనిమిది కీలక అధ్యాయాలు ఉన్నాయి. సహజంగానే మనిషి మరణించినప్పుడు 'ధర్మ సంస్థాపనార్థాయాం సంభవామే యుగేయుగే' అనే శ్లోకం వినిపిస్తుంది. ఆ శ్లోకంలోని పరమార్థం ఏమిటంటే ధర్మం నాలుగు పాదాల మీద నడవాలి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలకు మాత్రమే సర్వహక్కులు, సకల సంపదల్లో భాగస్వామ్యం ఉండాలి. శూద్రులు అణిచివేతకు సంపదలేమికి ప్రకృతి వనరుల్లో ప్రాతినిధ్యం ఉండకుండా నిత్యం అవమానించబడుతూ ఉండాలి. ఇదే మనుధర్మ శాస్త్రం. ఇందులో ధర్మమే లేదు. సనాతన ధర్మమైన, మనుధర్మమైన, వేదాలు, ఉపనిషత్తులు ఏమిచెప్పిన అవన్నీ శూద్రులను అస్పృశ్యులను మహిళలను అణిచివేయటం కోసం ఏర్పాటు చేసుకున్నవే. వాటివల్ల మెజారిటీ ప్రజలకు హక్కులు నోచుకోక సంపదలో, భూమిలో, చదువులో, ఆభరణాల్లో, ఆయుధాల్లో, అధికారాల్లో భాగస్వామ్యం లేకపోవడంతో మనదేశం అనేక దేశాల కంటే వెనుకబడి ఉంది. నేడు ప్రపంచ ఆకలిసూచికలో మన దేశం 111వ స్థానంలో ఉంది. మానవాభివృద్ధి సూచికలో 131వ స్థానం. అంటే దేశంలో ఉత్పత్తి అవుతున్న సంపదలో వారికి సహజ న్యాయం జరగకపోవటమే అనేది గుర్తించాలి.

మనుస్మృతిపై నేడు అనేక సైద్ధాంతిక సంఘర్షణలు సాగుతున్నాయి. ప్రాచీన భారత రాజ్యాంగం మనుధర్మ శాస్త్రం అనే వాదనలు సాగుతున్నాయి. ప్రత్యేకించి ఆరెస్సెస్ గొంతుకలో నుండి ఇవి తరచూ వినిపిస్తున్నాయి. క్రీస్తుపూర్వం రెండో శతాబ్దంలో దాదాపు మూడువేల ఏండ్ల కిందట రాసిన ఈ మానసిక చట్టాలు నేటికి ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. మనుస్మృతి కాగితాల్లో గీసిన అక్షరం కాదు మనుషుల మెదళ్లలో నిర్మితమై ఉన్న మనుధర్మం. భారతదేశంలో ప్రతి పౌరుడిని పరోక్షంగా నడిపిస్తున్న సూత్రాలవి. వాటి వల్ల ఎవరి ప్రయోజనాలు నెరవేర్చబడ్డాయి? అంటే అది రాసిన వారికి మాత్రమే అనేది విధితమవుతుంది. మనుధర్మం అంటే బ్రాహ్మణ ధర్మం, ఆధిపత్య ధర్మం, అణిచివేసే ధర్మం, మెజారిటీ ప్రజలకు సర్వహక్కులు లేకుండా చేసే అధర్మశాస్త్రం. కులపరమైన హెచ్చుతగ్గులకు అదే మూలం. నిచ్చెనమెట్ల కులవ్యవస్థను నేటికీ పెంచి పోషిస్తూ సుస్థిరం చేయడమే కాదు, కొనసాగిస్తున్నది కూడా అదే అధర్మం. చాతుర్వర్ణ వ్యవస్థలో మూడు వర్ణాల ప్రయోజనాల కోసం (బ్రాహ్మణ, క్షత్రీయ, వైశ్య) ఆధిపత్యం కోసం శూద్రులను అణిచివేయటం, అవమానించడం కోసం ఉద్దేశించబడ్డవే. అదే నేడు ఈ దేశ సామాజిక వ్యవస్థను నడిపిస్తున్నది.ఇటీవల కాలంలో చినజీయర్ స్వామి మాట్లాడుతూ 'దేహానికి కాళ్లు రెక్కలు ఎలా ఉంటాయో, కుల వ్యవస్థ కూడా అలాగే ఉండాలి. ఎవరు చేసే పని వాళ్లు చేయాలి' అని సెలవిచ్చారు. అంటే దేశాన్ని తిరోగమన వైపు లాక్కెళ్లే హక్కు వీరికి ఎవరిచ్చారు?



మనుస్మృతిలోని కొన్ని శ్లోకాలను పరిశీలిస్తే ఆశ్చర్యమేస్తుంది. 'శూద్రులు విద్యను అభ్యసించరాదు.చదివితే నాలిక కోయాలి. వింటే చెవుల్లో సీసం పోయాలి' అని పేర్కొనబడింది. శూద్రుడైన శంభూకుడు వేదపఠనం చేశాడని రాముడు శంభూకుడి తల నరికిన దీనగాథ తెలిసిందే. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను సైతం తరగతి గదిలో కూర్చోనివ్వలేదు. ఈ రకమైన మానసిక చట్టాలన్నీ ఈ దేశంలో నూటికి ఎనభైశాతం మంది ప్రజలను ప్రకృతి, సహజ వనరులకు సంబంధం లేకుండా అణిచివేతకు అవమానాలకు గురిచేసింది మనువాదం. ఊరికి బయట ఉన్న అస్పృశ్యులు మూతికి ముంత.. ముడ్డికి తాటాకు కట్టుకొని రోడ్డుపై నడవాలని చెప్పింది. పట్టపగలు మాత్రమే గ్రామంలోకి రావాలి.తన నీడ తన మీదే పడాలి. ఇలాంటి దుర్మార్గపు శాసనాలు ఈ దేశాన్ని ఎంతగా పీడిం చాయో, ఎన్ని తరాలు అన్నింటికీ నోచుకోకుండా అవస్థలు పడ్డాయో ఊహించుకుంటేనే ఒళ్లు గగుర్లు పొడుస్తోంది. శవాలను కాల్చడం, వాటిని పూడ్చడానికి బొందలు తీయడం, సచ్చిన పశువుల్ని తీసుకెళ్లి తోలువలచి చర్మంతో చెప్పులు కుట్టడం, మురికి కాలువలు, పాయఖానలు శుభ్రం చేయడం, తరతరాలుగా ఒక తరగతికి మానసిక చట్టబద్ధత కల్పించడం, ఎంతటి దుర్మార్గపు చర్యనో ఆలోచించండి.

దేశంలో నూటికి ఎనభైశాతం మంది ప్రజలను ప్రకృతి, సహజ వనరులకు సంబంధం లేకుండా అణిచివేతకు అవమానాలకు గురి చేసింది మనువాదం. ఊరికి బయట ఉన్న అస్పృశ్యులు మూతికి ముంత..ముడ్డికి తాటాకు కట్టుకొని రోడ్డుపై నడవాలని చెప్పింది. పట్టపగలు మాత్రమే గ్రామంలోకి రావాలి. తన నీడ తన మీదే పడాలి. ఇలాంటి దుర్మార్గపు శాసనాలు ఈ దేశాన్ని ఎంతగా పీడించాయో, ఎన్ని తరాలు అన్నింటికీ నోచుకోకుండా అవస్థలు పడ్డాయో ఊహించుకుంటేనే ఒళ్లు గగుర్లు పొడుస్తోంది.

దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత భారతదేశానికి ప్రత్యేక రాజ్యాంగం ఏర్పడటం ద్వారా అంటరానితనాన్ని పూర్తిగా నిషేధించడం, విద్యా,ఉద్యోగ, రాజకీయ పదవులలో రిజర్వేషన్లు కల్పించడం జరిగాయి.అలాగే ప్రభుత్వ రంగంలోనే అవకాశాలు పెరగటం, హరిత విప్లవ వ్యవసాయ రంగంలో వచ్చిన సంస్కరణలతో దేశంలో కొన్ని రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అవి తీసుకొచ్చిన భూసంస్కరణలు, శాస్త్ర సాంకేతిక రంగంలో వచ్చినటువంటి సమూలమైన మార్పులు అట్టడుగు తరగతుల జీవితాల్లో వెలుగులు నింపాయి. కానీ, ప్రభుత్వ రంగం ద్వారా వచ్చిన రిజర్వేషన్ల వల్ల ఎంతో కొంత మెరుగైన జీవితాన్ని అనుభవిస్తున్న అట్టడుగు వర్గాలు నేడు అభద్రతలో జీవిస్తున్నాయి. ప్రభుత్వరంగమే కనుమరుగయ్యే పరిస్థితి ఉంది. పదేళ్లుగా దేశాన్ని ఏలుతున్న బీజేపీ సర్కార్ తమ మనువాద ఎజెండాను అమలు చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తుంది. ఇటీవల పార్లమెంటు సాక్షిగా భారతరత్న అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు కేవలం ఆయన గొంతులో నుండి అకస్మాత్తుగా ఊడిపడిన పదాలు కాదు. ఆరెస్సెస్-బీజేపీ సుదీర్ఘకాలంగా వాళ్లు అనుసరించిన విధానంలో అంతర్భాగమే.

రాజ్యాంగ రూపకల్పన జరుగుతున్న సమయంలోనే ఆరెస్సెస్,జనసంఘ్ ఏర్పడి ఉన్నప్పటికీ అంబేద్కర్ అంటరాని వాడని, అతను రాసిన రాజ్యాంగాన్ని అంగీకరించకూడదనే వాదన తీసుకొచ్చింది.1949 నవంబర్ 26 రాజ్యాంగ సభ మన రాజ్యాంగాన్ని ఆమోదించింది.'వివిధ దేశాల నుంచి అంబేద్కర్ అరువు తెచ్చిన అతుకులబొంత రాజ్యాంగం ఇది. దేశ ప్రజల సాంస్కృతిక జీవనానికి పనికిరానిది' అని నాటి సంఘ్ నేతలుగా ఉన్న ఎమ్మెస్ గోల్వాల్కర్, హెడ్గేవార్‌లు ప్రకటించారు. నాడు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనకుండా అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అంగీకరించకుండా, మన భారత దేశ మువ్వన్నెల జెండాను వ్యతిరేకించి, స్వాతంత్ర్య ఉద్యమానికి తిలోదకాలిచ్చిన నేటి పాలకులు దేశభక్తులుగా చెలామణి అవడం చూస్తుంటే దేశం ఎటువైపు వెళ్తుందోనన్న ఆందోళన కలుగుతోంది. మతోన్మాదుల చేతుల్లో పాలన, మహనీయులను కించపరుస్తున్న తీరు చూస్తే ఎంతో మనసులో ఆవేదన రగులుతోంది. అందుకే మనుస్మృతికి, రాజ్యాంగానికి మధ్య జరుగుతున్న అంతర్యుద్ధమిది. ఇందులో కుల,మతాలతో సంబంధం లేని భారతీయులుగా ఒక్కటిగా నిలబడి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి. రాజ్యాంగం లేకపోతే సామాజిక న్యాయమనేదే లేదు. ప్రజాస్వామ్యానికి చోటే ఉండదు. ఫెడరలిజం కానరాదు. లౌకిక విలువలు ఇక సమాధే. అందుకే అంబేద్కర్ మనుస్మృతిని దహనం చేసిన ఈరోజున రాజ్యాం గాన్ని రక్షించుకుంటామని ప్రతిఒక్కరూ ప్రతినబూనాలి. అదే నేడు దేశ ప్రజలందరి కర్తవ్యం కావాలి.

(డిసెంబర్ 25 మనుస్మృతి దహన దినం)



సీపీఐ(ఎం) పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ

మంగాపురం తండాలో పలువురు పార్టీలో చేరిక

నవతెలంగాణ-నేలకొండపల్లి

సీపీఐ(ఎం) పట్ల ప్రజల్లో మరింత ఆదరణ పెరుగుతుందని, రానున్న కాలంలో పార్టీకి పూర్వ వైభవం ఖాయమని పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని మంగాపురం తండ గ్రామంలో పార్టీ సిద్ధాంతాలు ప్రజా ఉద్యమాల పట్ల ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు సిపిఐ(ఎం)లో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువాలను కప్పి వారిని సాదరంగా పార్టీలోకి గుడవర్తి నాగేశ్వరరావు ఆహ్వానించారు. అనంతరం పార్టీ నూతన గ్రామ శాఖను ఏర్పాటు చేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఉద్యమాలు, పార్టీ సిద్ధాంతాలు పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు భూక్య కృష్ణ, పార్టీ గ్రామ శాఖ నూతన కార్యదర్శి తేజావత్ కిరణ్, సంజయ్, రామారావు, భూక్య నాగేశ్వరరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన వ్యవసాయ విధాన పత్రాన్ని ఉపసంహరించాలి

నవతెలంగాణ-వైరాటౌన్

కేంద్రం విడుదల చేసిన వ్యవసాయ విధాన పత్రంను వెంటనే ఉపసంహరించాలని కోరుతూ వైరా మండలం లింగన్నపాలెం గ్రామంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రం విడుదల చేసిన వ్యవసాయ విధాన పత్రం రైతులకు నష్టపరిచే విధంగా ఉందని, దీన్ని వెంటనే ఉపసంహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కేంద్రం తీసుకొచ్చిన నల్ల చట్టాలను దేశంలోని రైతాంగం మూడు సంవత్సరాలు పాటు పోరాటాలు ఉద్యమం చేసిన మూలంగానే కేంద్ర ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని, మళ్లీ పేరు మార్చి రైతులకు నష్టం జరిగే విధంగా ముసాయిదా పత్రాన్ని తీసుకొచ్చిందని అన్నారు. కార్పొరేట్‌శక్తులకు లాభాలు చేకూర్చే విధానాలను వ్యవసాయరంగంలో తీసుకొస్తున్నారని విమర్శించారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ కిసాన్ మోర్చ పిలుపులో భాగంగా తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుపుతున్నట్లు తెలిపారు. వెనక్కి తీసుకోపోనట్లయితే రైతులు, ప్రజలు పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మాగంటి తిరుమలరావు, రైతులు కొరకొప్పు నాగేష్, ముత్తమాల జయరాజు, బాణాలు వెంకటేశ్వర్లు, బాణాల భద్రయ్య, షేక్ మనసూర్ అలీ, షేక్ బాబు, చంగల్ నాగేష్, బరిగల పేరయ్య, బాణాల నవీన్, బాణాలు వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల బస్సు యాత్రను జయప్రదం చేయండి

సీఐటీయూ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న బస్సు యాత్ర ఈ నెల 26న ఖమ్మం జిల్లాకు వస్తుందని అ బస్సు యాత్రను ఆశా వర్కర్లు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెరుమళ్ళపల్లి మోహన్ రావు అన్నారు. మండలంలోని జలగం నగర్‌లో ఆశాల బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడారు. 2023 ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ ప్రెసిడెంట్, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశా కార్యకర్తలకు నెలకు 18 వేల రూపాయల ఫిక్స్ వేతనం, ఈఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని హామీనిచ్చారని అధికారం చేపట్టి సంవత్సరం అవుతున్న హామీలపై నోరు మెదపకపోవడం హేయమైన చర్య అన్నారు. ఆశాల సమస్యలు పరిష్కరించకపోతే మంత్రుల ఇళ్ళు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మాచర్ల సుభద్ర, డి.మమత, నాగమణి, మండల నాయకులు అర్వపల్లి శ్రీనివాసరావు, ఏర్పుల శ్రీనివాసరావు, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు కొండం కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్ నిర్మించాలని ఏఎంసీ తీర్మానం

నవతెలంగాణ- కల్లూరు



2వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిలువ చేయడానికి గోదాము నిర్మించాలని ఏఎంసి జనరల్ బాడీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఎఎంసి చైర్మన్ భాగం నీరజ చౌదరి అధ్యక్షతన మంగళవారం జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో ఏఎంసీ కార్యదర్శి ఎ.పంతులు నివేదిక ప్రవేశపెట్టారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా మూడు తీర్మానాలు ఆమోదించారు. 2000 మెట్రిక్ టన్నుల గోడన్ నిర్మించాలని, మార్కెట్ కమిటీ చుట్టూ ఉన్న ప్రహరీ గోడ శిధిలావస్థకు చేరిపోవడంతో మరమ్మతులు చేపట్టాలని, మార్కెట్ కమిటీ ఆవరణలో కోతుల బెడద అత్యధికంగా ఉండటంతో మామిడికాయ మార్కెట్ నడవట్లేదని, చుట్టూ సోలార్ పెన్షన్ ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానం చేసినట్లు చైర్మన్ భాగం నీరజ చౌదరి తెలిపారు. తీర్మానం ప్రభుత్వానికి పంపి నిధులు మంజూరు చేయాలని సమావేశం కోరింది. సమావేశంలో వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, కల్లూరు సొసైటీ అధ్యక్షుడు డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, సత్తుపల్లి వ్యవసాయ శాఖ ఏడిఏ శ్రీనివాస్ రెడ్డి, ఏవో ఎం.రూప, సూపర్వైజర్ బీ. జగదీష్ పాల్గొన్నారు.

'హెూప్ మినిస్ట్రీస్' సౌజన్యంతో పాస్టర్లకు దుస్తులు

- ఎమ్మెల్యే చేతుల మీదుగా 50మందికి అందజేత

నవతెలంగాణ-సత్తుపల్లి

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని హెూప్ మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ శామ్యూల్ జాషువా గెడ్డం సౌజన్యంతో 50మంది పాస్టర్లకు, ఎమ్మెల్యే భద్రతా సిబ్బంది 4గురికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చేతుల మీదుగా మంగళవారం దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. దుస్తులు వితరణ చేసిన హెూప్ సంస్థ నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ పొలిటికల్ వింగ్ జాతీయ అధ్యక్షుడు అలవాల కరుణాకర్ మాట్లాడుతూ హెూప్ మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ శామ్యూల్ జాషువా సంస్థ ద్వారా పేద వర్గాలకు చెందిన ఎంతో మందికి చేయూతను అందిస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే ఇటీవల కాలంలో వందలాదిగా కుట్టుమిషన్లను పేద వర్గాలకు పంపిణీ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ దోమ ఆనంద్‌బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, నాయకులు మొహమ్మద్ కమల్‌పాషా, బత్తుల భరత్‌కుమార్, మల్లూరు దిలీప్, పింగిలి సామేలు, ఫక్రుద్దీన్, పాస్టర్లు బేతంపూడి వరప్రసాద్, శాంసన్, యాకోబు, రవికిరణ్‌పాల్, దేవసహాయం, కొత్తపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు. సింగరేణి ఉద్యోగుల కాలనీలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో రాష్ట్ర కాంగ్రెస్ డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ పాల్గొని కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగులు, పాల్గొన్నారు.



నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

5

ఖమ్మం

బుధవారం | డిసెంబర్ 25, 2024 | www.navatelangana.com

పామాయిల్ సాగు మేలు : ఏవో వాణి

నవతెలంగాణ -కూసుమంచి



రైతులు ప్రస్తుతం ఆయిల్ ఫామ్ సాగు చేయడం వల్ల ప్రయోజనాలు చేకూరుతాయని మండల వ్యవసాయ అధికారి ఆర్.వాణి తెలిపారు.మంగళవారం మండలంలోని నేలపట్ల, పోచారం గ్రామాలలో రైతులకు పామాయిల్ పంట సాగుపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రస్తుతం సాగు చేస్తున్న పంటల్లో పామ్ ఆయిల్ సాగు ప్రాధాన్యత సంతరించుకున్నదని, కావున రైతులందరూ ఈ పంట సాగు చేసేందుకు మొగ్గు చూపాలని కోరారు. నీటి వసతి బాగా ఉన్న ప్రాంతాలలో ఈ పంటను సాగు చేసుకోవచ్చని, ఒక ఎకరం వరి సాగు చేయడానికి సరిపడా నీటితో మూడు ఎకరాల పామాయిల్ పంటను సాగు చేయవచ్చు అని తెలిపారు. పామాయిల్ పంట వేసిన నాలుగో సంవత్సరం నుండి 20 సంవత్సరాల వరకు దిగుబడి ఇస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రియాంక, వంశీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని బలహీన పరచాలనేదే బీజేపీ ఉద్దేశం

- కేంద్ర హెూం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలతో తేటతెల్లం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- అమిత్ షా వ్యాఖ్యలు దేశాన్ని కించపరిచేలా ఉన్నాయ్
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నవతెలంగాణ- ఖమ్మం

రాజ్యాంగాన్ని బలహీన పరచాలనేదే బిజెపి ప్రభుత్వం ప్రధాన ఎజెండా అని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఖమ్మంలోని మంగళవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనం నుండి జడ్పీ సెంటర్‌లో గల అంబేద్కర్ విగ్రహం వరకు పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాజ్యాంగాన్ని బలహీన పరచాలని బిజెపి భావిస్తుందని, గత ఐదు సంవత్సరాలుగా దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్ని రాష్ట్రాల్లో సమావేశాలు నిర్వహించి వివరిస్తున్నారని, ఆయన చెప్పిందే నిజం అన్నట్టు తాజాగా పార్లమెంట్లో కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్ను అవమానపరుస్తూ వ్యాఖ్యలు చేశారని తెలిపారు. భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి ఉల్లంఘించిన కేంద్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాలని రాష్ట్రపతిని కోరుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ దేశంలో అత్యున్నత రాజ్యాంగం కలిగిన దేశం భారతదేశం అని, అమిత్ షా వ్యాఖ్యలు భారతదేశాన్ని కించపరిచేలా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా బీజేపీ పార్టీ పునరాలోచించుకోవాలని ,అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార్ ముక్తార్, మాజీ శాసనమండలి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళ అభివృద్ధి చైర్మన్ నాయుడు సత్యనారాయణ, నగర కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల ఐఎన్‌టియుసి, మహిళా,సేవాదళ్, ఎస్సీ సెల్, కిసాన్ సెల్, కాంగ్రెస్ ఓబీసీ సెల్, మైనార్టీ అధ్యక్షులు కొత్త సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్ బొడ్డు బొందయ్య, మొక్క శేఖర్ గౌడ్, పుచ్చకాయల వీరభద్రం, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, మిక్కిలినేని మంజుల నరేందర్, ఎండీ రఫిదా బేగం తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ సర్కిల్ వద్ద బైపాస్ రోడ్డు ఎక్కడానికి...

ఎన్ఎస్‌పీ కెనాల్‌పై బ్రిడ్జిని నిర్మించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్



నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని టేకులపల్లి డబుల్ బెడ్ రూమ్స్ నుండి శ్రీశ్రీ సర్కిల్ వద్ద బైపాస్ రోడ్డు ఎక్కడానికి ఎన్ఎస్పి కెనాల్‌పై బ్రిడ్జిని నిర్మించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం కెసిఆర్ టవర్స్ డబుల్ బెడ్రూమ్స్ నుంచి నేరుగా శ్రీ శ్రీ సర్కిల్ వద్ద బైపాస్ రోడ్డు ఎక్కడానికి గతంలో ఉన్న ఎయిర్పోర్టు రోడ్డును ఫార్మేషన్ చేసి ఎన్ఎస్పి కెనాల్‌పై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఖానాపురం హవేలీ కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) నాయకుల బృందం, స్థానిక ప్రజలతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రం, ఖానాపురం హవేలీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు మాట్లాడుతూ ఖానాపురం హవేలి పరిధిలో టేకులపల్లిలో గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించిందని, అక్కడ సుమారు 1200 కుటుంబాలు నివాసం ఉంటున్నారని, వాటితోపాటు లక్ష్మీ నగరానికి చెందిన 600 కుటుంబాలు వారందరూ ఆరోగ్య సమస్యలపై గాని ఇతరత్రా అవసరాల కోసం నూతన బ్రిడ్జి నిర్మాణం చేపడితే అక్కడ ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. వారు ఖమ్మం రావాలంటే ఇప్పుడున్న టేకులపల్లి బ్రిడ్జి మీదుగా మాత్రమే వెళ్లే అవకాశం ఉందని, ఇప్పటికే టేకులపల్లి, ఖానాపురంలో ఉన్న ప్రజల రాకపోకలకు సరిపోక ఆ రహదారి నిత్యం రద్దీగా ఉంటుందని, దానివల్ల ప్రజలు అనేక రకాల అసౌకర్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వచ్చిన తర్వాత రద్దీ మరింత పెరిగిందని, టేకులపల్లి ప్రాంతంలో డైట్ కాలేజీ, ఐటిఐ కాలేజీ, మహిళా ప్రాంగణం, గురుకుల పాఠశాల తదితర ప్రభుత్వ సంస్థలు ఉండటం వల్ల ఆ సంస్థలో పనిచేసే ఉద్యోగులు, చదువుకునే విద్యార్థులు నిత్యం టేకులపల్లి ఇళ్ళ మధ్యలో ఉన్నటువంటి రహదారి గుండా మాత్రమే ప్రయాణించాల్సి వస్తుందని అన్నారు. ఖానాపురం, టేకులపల్లి, డబల్ బెడ్రూమ్స్ వద్ద ప్రైవేట్ వెంచర్లు కూడా చాలా ఉన్నాయని, ఈ వెంచర్లలో ప్లాట్లు కొనుక్కున్న ప్రజలు ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో జనావాసాలతో ఆ ప్రాంతం బాగా విస్తరిస్తుందని, పెరిగిన జనాభాకనుగుణంగా ప్రత్యామ్నాయ రహదారి లేకపోవడం వల్ల ఇక్కడ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.అందువల్ల గతంలో ఎయిర్పోర్ట్ కోసం తీసిన 60 అడుగుల రోడ్డును పునరుద్ధరించి డబుల్ బెడ్ రూమ్స్ నుండి నేరుగా శ్రీశ్రీ సర్కిల్ బైపాస్ రోడ్డుకి ఎక్కే విధంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని, అలాగే మధ్యలో ఉన్న ఎన్ఎస్పీ కెనాల్‌పై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం జరిగితే ప్రజలు నూతన కలెక్టరేట్‌కు వెళ్లడానికి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పిన్నింటి రమ్య, ఎంఏ జబ్బార్, ఎస్ నవీన్‌రెడ్డి, ఎస్‌కె మీరా, హవేలీ కమిటీ నాయకులు పోతురాజు వెంకటి, గాలి వెంకటాద్రి, కత్తుల అమరావతి, ధనియాకుల నాగేశ్వరరావు, పెద్ది నాగయ్య, పి.నాగమణి, కుర్రి వెంకటస్వామి, వంగూరి రామ, గాలి అంజయ్య, జట్ల ఆనందరావు, దంతాల నరసింహారావు, తిప్పర్తి నరసింహారావు, డివిజన్ నాయకులు భూక్య శ్రీనివాసరావు, బత్తిని ఉపేందర్, ఎస్కే నాగుల్ మీరా, బోడపట్ల సుదర్శన్, వజినేపల్లి శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ నాయకులు చింతల రమేష్, నాయకులు వేదగిరి మురహరి, నల్లమల సత్యనారాయణ, బోడిపూడి వీరభద్రం, శివకృష్ణ, ఎస్కే హిమాం, ఏఎం రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.



యుద్ధప్రాతిపదికన మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం

వరద ముంపు నుంచి ఖమ్మం ప్రజలకు శాశ్వతంగా విముక్తి కల్పించేందుకుగాను చేపట్టిన మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో రిటైనింగ్ వాల్ పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మున్నేరు ముంపు నుంచి ఖమ్మం పట్టణాన్ని కాపాడేం దుకు నదికి ఇరువైపులా ఆర్‌సిసి కాంక్రీట్ గోడలు నిర్మిస్తున్నామని, ఖమ్మం నగరంలో ముంపునకు అవకాశం లేకుండా సరైన మార్గంలో వరద ప్రవాహాన్ని నడిపించేందుకు సరైన డిజైన్‌తో వాల్ నిర్మించాలని అధికారులకు సూచిం చారు. వాల్ నిర్మాణ పనులు మరింత వేగం పెరగాలని, నెలలో రెండుసార్లు స్వయంగా తానే పర్యవేక్షిస్తానని అన్నారు. ఈ వాల్ నిర్మాణానికి అవసరమయ్యే భూ సేకరణను చేపట్టాలని, ఇందుకు సంబంధించి రెండు, మూడు రోజుల్లో ఖమ్మం జిల్లాలోని అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. వాల్ నిర్మాణానికి ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. 1969 నుంచి 2024 సెప్టెంబర్ వరకు వచ్చిన వరదలను దృష్టిలో పెట్టుకొని వాల్ నిర్మించాలని అన్నారు. ఇటు ఖమ్మం అటు పాలేరు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలకు సౌకర్యం కల్పించేలా సుమారు 23 కిలోమీటర్ల మేర వాల్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇఎన్‌సీ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కామన్ సర్వీస్ సెంటర్ వాహన సేవలను పకడ్బందీగా అందించాలి

- అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-ఖమ్మం

కామన్ సర్వీస్ సెంటర్ వాహన సేవలను పకడ్బందీగా అందించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్, ఖమ్మం జిల్లాకు కేటాయించిన సిఎస్‌సి వాహనాన్ని ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కామన్ సర్వీస్ సెంటర్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీని ద్వారా ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు, వైద్య, విద్య, ఉపాధి, ఈ మొబిలిటీ, గ్రామీణ ఈ స్టోర్, న్యాయ సేవలు, పర్యాటక, వ్యవసాయ సహకారం, ఇతర రంగాలకు సంబంధించిన సేవలు వంటివి ప్రజలకు నేరుగా ఉచితంగా అందించేందుకు వీలు పడుతుందని అన్నారు. దేశంలో ఇప్పటి వరకు స్థానిక పారిశ్రామిక వేత్తలచే 5.5 లక్షల కామన్ సర్వీస్ సెంటర్లు పనిచేస్తున్నాయని, వీటి ద్వారా స్థానికంగా ఉపాధి అందడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఈ- సేవలు అందుతున్నాయని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు నేరుగా అందాలనే ప్రధానమంత్రి ఆశయాన్ని సి.ఎస్.సి. నిజం చేస్తుందని అన్నారు. డిజిటల్ ఇండియా కామన్ సర్వీస్ సెంటర్ ప్రాజెక్టును దేశవ్యాప్తంగా 10 జిల్లాలలోని 4740 గ్రామ పంచాయతీల్లో మెరుగైన సేవలు, మౌళిక సదుపాయాలు ఈ గవర్నమెంట్ సర్వీస్ ఇండియా లిమిటెడ్ ద్వారా అమలు చేయడానికి ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఖమ్మం జిల్లాను దీనికి ఎంపిక చేశారని, ఈ పథకం క్రింద కామన్ సర్వీస్ సెంటర్ ఈ గవర్నెన్స్ లిమిటెడ్ ద్వారా జిపిఎస్ ఉన్న వాహనం ద్వారా ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేయడం, కార్యక్రమాల కోసం అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ. రాజేశ్వరి, ప్రాజెక్టు జిల్లా కో ఆర్డినేటర్ షేక్ ఫయాజ్, ఈ.డి.ఎం. దుర్గా ప్రసాద్, జిల్లా మేనేజర్ పి. సురేష్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు తెలిపారు.

వ్యవసాయ కూలీలందరికీ ఏడాదికి రూ.12వేలు అందజేయాలి

- వ్యకాస జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ- ఖమ్మం

రెక్కల కష్టమే ఆస్తిగా చెమట చుక్కలే పెట్టుబడిగా భూమిపై వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తామన్న సంవత్సరానికి 12 వేల రూపాయల పథకమును ఏ షరతులు లేకుండా బేషరతుగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు వ్యవసాయ కూలీలందరికీ సంవత్సరానికి 12 వేల రూపాయలు అందజేస్తామని వాగ్దానం చేసిందని, కానీ అమలు చేయడంలో సంవత్సరం గడుస్తున్న ఇంకా అనేక కొర్రీలు పెట్టి రెండు దఫాలంటూ మొదటి దఫా 6వేలు, రెండో దఫా రూ.6వేలు ఇస్తామని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రకటన చేశారని, మరల ఇప్పుడు జాబ్ కార్డు ఉన్నవారు వంద రోజులు పని చేస్తేనే అర్హులంటూ సాకులు పెడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక షరతులతో మహాత్మాగాంధీ ఉపాధి గ్రామీణ పథకాన్ని పనులను తగ్గించుకుంటూ షరతులు పెట్టుకుంటూ కేంద్ర బడ్జెట్ లో నిధులను తగ్గించుకుంటూ వస్తుందని, గ్రామీణ ప్రాంతంలో సంపూర్ణంగా పనిని కల్పించడం లేదు పట్టణ ప్రాంతాలకు ఈ పనిని అనుమతి ఇవ్వటం లేదని, ఫీల్డ్ అసిస్టెంట్లతోటి సర్వేలు చేయించి కూలీల వడపోత కార్యక్రమాన్ని ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ తప్పుడు విధానాలను వ్యవసాయ కార్మిక సంఘం ఖండిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ఏదైతే వాగ్దానం చేసిందో వ్యవసాయ కార్మికులందరికీ సంవత్సరానికి 12 వేల రూపాయలు అధికారంలోకి రాగానే అందజేస్తామని చెప్పారని, అందజేస్తామని చెప్పి నేడు కూలీలకు అనేక షరతులు విధిస్తున్నారని ఆరోపించారు. ఈ విధానం సరి అయినది కాదని, వ్యవసాయ కూలీలందరికీ ప్రభుత్వ పథకం అమలు చేయాలన్నారు. ప్రభుత్వం చేసిన వాగ్దానం సంపూర్ణంగా అమలు చేయాలని, లేని పక్షంలో కార్మికులు చేసే పోరాటానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

వికలాంగులు ఆర్థికంగా బలోపేతమైనప్పుడే నిజమైన అభివృద్ధి

- ఎన్జీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు
- వృత్తి నైపుణ్య శిక్షణను పూర్తి చేసుకున్న వికలాంగులకు సర్టిఫికెట్లు అందజేత



నవతెలంగాణ-నేలకొండపల్లి

వికలాంగులు ఆర్థికంగా బలోపేతమైనప్పుడే సమాజం నిజమైన అభివృద్ధి సాధించినట్లని ఎన్జీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు అన్నారు. గత కొద్ది రోజులుగా ఎన్జీఆర్ ఫౌండేషన్ (సిపిఐ(ఎం) కార్యాలయం) కార్యాలయంలో ఎస్‌ఆర్డిఎస్ ఎనేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న వికలాంగుల వ్యాపార, వృత్తి నైపుణ్య శిక్షణ మంగళవారంతో ముగిశాయి. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న 35 మంది వికలాంగులకు రామారావు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా టీడీజేఏసీ చైర్మన్ టీవీ చలమయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వికలాంగులు తమ స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు, వారి సమస్యల పరిష్కారానికి ఎన్జీఆర్ ఫౌండేషన్ నుండి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో వారికి వడ్డీ లేని రుణాలు కూడా అందించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్బిఐ ఆర్ఎస్ఈటిఐ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నేలకొండపల్లి మండలంలో పది రోజులు పాటు వికలాంగులకు వివిధ అంశాలలో వ్యాపార నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికి ఉపాధి నిమిత్తం ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు, అవసరమైన రుణాలు పొందేందుకు, వారి అప్లికేషన్లను బ్యాంకులకు సిఫారస్ చేయడం జరుగుతుందన్నారు. వారి అర్హతలను బట్టి అవకాశం ఉన్నవారికి బ్యాంకు ద్వారా తప్పనిసరిగా రుణాలు కూడా లభిస్తాయని తెలిపారు, వ్యాపార వత్తి నైపుణ్యాల పట్ల అత్యంత ఆసక్తితో శిక్షణ పూర్తి చేసుకున్న దివ్యాంగులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఎనేబుల్ ఇండియా తెలంగాణ స్టేట్ మేనేజర్ కొత్త మల్లికార్జున్ మాట్లాడుతూ ఇండియా నుండి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో దివ్యాంగులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి వ్యాపార అభివృద్ధి శిక్షణలు ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా నేలకొండపల్లి మండలంలో 35 మంది దివ్యాంగులకు శిక్షణ ఇచ్చి వారిని నైపుణ్యాభివద్ధి పరులుగా తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు. వారికి ఎనేబుల్ ఇండియా నుండి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. నేలకొండపల్లి వాసవి క్లబ్ నిర్వాహకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు దోసపాటి చంద్రశేఖర్ మాట్లాడుతూ నేలకొండపల్లి వాసవి క్లబ్ నుండి దివ్యాంగులకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. కొత్తగా వ్యాపారాన్ని ఏర్పాటు చేసుకోవాలని చూస్తున్న ఐదుగురు దివ్యాంగులకు వడ్డీ లేకుండా రుణాలు అందజేస్తామని తెలిపారు.

భక్త రామదాసు సర్వీసు సొసైటీ బాధ్యులు గల్లా జగన్మోహన్రావు మాట్లాడుతూ తమ సర్వీస్ సొసైటీ నుండి దివ్యాంగులకు అవసరమైన సహాయాన్ని ఎల్లప్పుడూ అందిస్తామన్నారు. ఎన్నారై ఫౌండేషన్ బాధ్యులు బండి నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ నుండి జిల్లా వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, ముఖ్యంగా దివ్యాంగులకు చేయూతని అందించడంలో ముందుంటామన్నారు. నేలకొండపల్లి మండలంలో శిక్షణ తీసుకున్న ఆరుగురు దివ్యాంగులకు వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రీడో సంస్థ డైరెక్టర్ నామా కార్తీక్ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రత్యేక హెల్త్ క్యాంపులు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఏర్పాటు చేసి వారికి కావలసిన ఉచిత వైద్య సహకారాలు అవసరమైన మందులను అందజేస్తామన్నారు. వ్యాపారాలను ఏర్పాటు చేయాలనుకున్న దివ్యాంగులకు లీగల్ డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్స్ తమ సంస్థ నుండి ఉచితంగా చేయిస్తామని హామీ ఇచ్చారు. నేషనల్ సర్వీస్ సొసైటీ జిల్లా కన్వీనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దివ్యాంగులకు సొసైటీ నుండి వారికి కావలసిన చేయూతను అందిస్తామన్నారన్నారు. ఎప్పుడు కార్యక్రమాలు జరిగినా వారికి అవసరమైన వాలంటీర్స్‌ని పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్డిఎస్ డైరెక్టర్ గడ్డం రాంబాబు, ఎన్జీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి కె.వి.రామిరెడ్డి, కొంగర నారాయణ ఎస్ఆర్డిఎస్ ప్రతినిధి ధరావత్ జానకి, సాయి కిరణ్, ప్రసాద్, నరసింహారావు, యువ ఆర్గనైజేషన్ మధు ఎనేబుల్ కమిటీ ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

గోరిగే హరీష్ హఠాన్మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం 3 టౌన్ ప్రాంతంలోని 46వ డివిజన్ నివాసి గొరిగె హరీష్ మరణం పట్ల కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ బాణాల లక్ష్మణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత పని మీద సూర్యాపేట వెళ్తున్న హరీష్‌ను రహదారి ప్రమాదంలో మరణించటం చాలా బాధాకరం అన్నారు.



ఆశాల జీపు జాతాను జయప్రదం చేయండి

- సీఐటీయు వన్ టౌన్ కన్వీనర్ షేక్ నాగుల్‌మీరా
- రేపు ఖమ్మానికి రాక

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఆశా వర్కర్ల హక్కుల సాధనకై జరిగే జీపు జాతాను జయప్రదం చేయాలని, ఈనెల 26న ఖమ్మం నగరానికి వస్తుందని సీఐటీయు వన్ టౌన్ కన్వీనర్ షేక్ నాగులమీరా పిలుపునిచ్చారు. ఈరోజు సిఐటియు వన్టౌన్ కమిటీ ఆధ్వర్యంలో సెంటిమేరి స్కూల్లో జీపు జాతా పోస్టర్లను విడుదల చేశారు. ఈ పోస్టర్లను ఆశా వర్కర్ల తోటి కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు వన్ టౌన్ కన్వీనర్ షేక్ నాగులమీరా మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో సుమారు 100 రోజులు పాటు ఆశా వర్కర్లు తమ హక్కుల కోసం వేతనాలు పెంచాలని కోరుతూ కనీస వేతనాన్ని అమలు చేయాలని నిరాహార దీక్షలు చేశారు. కానీ గత ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఆ ప్రభుత్వం అధికారంలోకొస్తే వేతనాలు పెంచుతాము క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పారని, కానీ నెరవేర్చాలేదన్నారు. ఈ పోస్టరు విడుదల చేసిన వారిలో సిఐటియు నాయకులు షేక్ హిమామ్, షేక్ ఖాసిం, ఆశా వర్కర్ల సిఐటియు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి రమణ, సిఐటియు నాయకులు నాగుల విజయ, ఆర్ శశిరేఖ, డి.నిర్మల, వి.సునీత, వసంత కుమారి, దుర్గ పాల్గొన్నారు.



పాస్టర్లకు స్వీట్ బాక్స్‌లు అందజేసిన సండ్ర

నవతెలంగాణ-సత్తుపల్లి/కల్లూరు/వేంసూరు

క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సత్తుపల్లి, వేంసూరు, కల్లూరు పట్టణాల్లోని పలు చర్చిలకు మంగళవారం స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. సత్తుపల్లి పట్టణంలోని జ్యోతి నిలయం పాఠశాల ఆవరణలోని ఆర్సీఎం చర్చిలో కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు, చర్చి పాస్టర్లకు స్వీట్లు పంపిణీ చేసి క్రిస్టమస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. గత పది సంవత్సరాలుగా చర్చిలకు స్వీట్ బాక్స్‌లను అందజేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, కౌన్సిలర్లు అద్దంకి అనిల్ కుమార్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, నాయకులు మానుకోట సత్యనారాయణ, పర్వతనేని వేణు, **వేంసూరులో జరిగిన కార్యక్రమంలో** మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, దొడ్డ వెంకటకృష్ణారెడ్డి, మందపాటి మహేశ్వర్ రెడ్డి, మారోజు సురేష్, పుచ్చకాయల శంకర్ రెడ్డి హరిబాబు, కల్లూరులోజరిగిన కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు కట్టా జయకుమార్, డాక్టర్ లక్కినేని రఘు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలేపు రామారావు, సొసైటీ అధ్యక్షుడు బోబోలు లక్ష్మణరావు ఏఐసిసి రాష్ట్ర అధ్యక్షుడు యనోశ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు బాలరాజు, దాసరి డేవిడ్ పాల్గొన్నారు.

జీళ్ళచెరువులో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు..

నవతెలంగాణ -కూసుమంచి



క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మండలంలోని జీళ్ళచెరువు గ్రామంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆ వీధినంతా రంగురంగుల విద్యుత్ దీపాలతో రంగు కాగితాలతో నక్షత్రాలతో అలంకరించి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్లు ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొక్క ఉపేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పెంద్ర అంజయ్య, కొండా శ్రీనివాస్ రావు క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఎర్రబోయిన సాయి చరణ్ పై ఉమ్మనేని రమేష్, బాబు దౌర్జన్యం

- ఎర్రబోయిన నాగేశ్వరరావుకు పట్టిన గతే నీకు పడుతుందని హెచ్చరికలు
- ఖమ్మం పోలీస్ కమిషనర్ కు బాధితుని తల్లి లక్ష్మి కుమారుడితో కలిసి ఫిర్యాదు

నవతెలంగాణ - బోనకల్

తన కుమారుడు కాలేజీకి వెళుతుండగా మార్గ మధ్యలో ఉమ్మనేని రమేష్, ఉమ్మనేని బాబు, కొత్తపల్లి వినయ్, సాదం కొండలరావులు ఆపి దాడి చేసి కొట్టారని ఎర్రబోయిన లక్ష్మి తన కుమారుడు సాయి చరణతో కలిసి మంగళవారం ఖమ్మం సిపి కార్యాలయంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌కు ఫిర్యాదు చేసినట్లు విలేకరులకు తెలిపింది. ఫిర్యాదు కాపీని ఆమె విలేకరులకు మంగళవారం అందజేశారు. ఆ ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) కార్యకర్త ఎర్రబోయిన నాగేశ్వరరావును గత సంవత్సరం కాంగ్రెస్ నాయకులు హత్య చేశారు. ఎర్రబోయిన నాగేశ్వరరావు బంధువే ఎర్రబోయిన సాయి చరణ్. సాయి చరణ్ ప్రతిరోజు గోవిందాపురం ఎల్ నుంచి మోటార్ సైకిల్ పై వెళ్లి మధిర క్రాస్ రోడ్డు వద్ద పెట్టి తల్లాడ కాలేజీకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 20న ప్రతిరోజు లాగే సాయి చరణ్ తన మోటార్ సైకిల్ పై గోవిందాపురం ఎల్ నుంచి పెద్దబీరవల్లి రోడ్డు నుంచి వెళ్తున్నాడు. ఈ సమయంలోనే ఎర్ర బయిన నాగేశ్వరరావు హత్య కేసులో నిందితులుగా ఉన్న ఉమ్మనేని రమేష్, ఉమ్మనేను బాబు, కొత్తపల్లి వినయ్, సాదం కొండలరావు మరికొందరు కలిసి కోర్టు వాయిదా నిమిత్తం వాహనంలో వెళ్తున్నారు. గోవిందాపురం ఎల్- పెద్ద బీరవల్లి గ్రామాల మధ్యలో మా వాహనానికి అడ్డు వస్తున్నారా అంటూ ఉమ్మనేని రమేష్, ఉమ్మనేని బాబు, కొత్తపల్లి వినయ్, సాదం కొండలరావు తన కుమారుడిని అడ్డగించి గల్లా పట్టుకొని ఇష్టమొచ్చినట్లు అసభ్యకరంగా దూషిస్తూ దాడి చేసి కొట్టారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎర్రబోయిన నాగేశ్వరరావుని హత్య చేస్తేనే మమ్మలను ఏమి చేయలేకపోయారని నిన్ను, నీ కుటుంబ సభ్యుల సంగతి కూడా చూస్తామంటూ బెదిరించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎర్రబోయిన నాగేశ్వరరావుకు పట్టిన గతే నీకు పడుతుందని తన కుమారుడిని బెదిరించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎర్రబోయిన నాగేశ్వరరావు హత్య కేసులో సాక్షులుగా ఉన్న వారిని కూడా వదిలిపెట్టేది లేదని, వాళ్లతో పాటు నీ సంగతి నీ అంతు కూడా చూస్తామని తన కుమారుడిని బెదిరించారని, గతంలో కూడా ఇటువంటి బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. వారి వల్ల గ్రామంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని తమ కుటుంబం భయం నీడన బతుకుతున్నామని, తమకు న్యాయం చేయాలని ఆమె సిపిని కోరారు. దీంతో సిపి స్పందిస్తూ న్యాయ విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.

కల నెరవేరేనా..?

- అసంపూర్తిగా నిలిచిపోయిన గృహాలు
- దిక్కు తోచని స్థితిలో లబ్ధిదారులు
- ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూపు

నవతెలంగాణ-వేంసూరు



ఎన్నో ఏళ్లగా సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల కల కలగాని మిగిలిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నికల ముందు మండలంలో 26 గ్రామపంచాయతీలలో 500 ఇల్లు మంజూరయ్యాయి. వీటిలో సుమారు 140 మంది లబ్ధిదారులు నిర్మాణం చేపట్టి కొన్ని మొదటి రెండవ దశ చేరుకున్నాయి. ప్రభుత్వం మారటం లబ్ధిదారులకు శాపంగా మారింది. అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇళ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. గత 11 సంవత్సరాలగా ఇల్లు లేక నానా అవస్థలు పడుతూ అప్పుసప్పు చేసి నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుల నివాసం ఉండే ఇళ్లను తొలగించి తాత్కాలికంగా పాకలలో వర్షాలకు తడుస్తూ ఎండకు ఎండుతూ బిక్కు బిక్కుమంటు జీవనం సాధిస్తున్నారు. అధికారులు పరిశీలించి ఇల్లు మొదలుపెట్టిన లబ్ధిదారులకు న్యాయం చేయాలని వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు.

అప్పు చేసి అభివృద్ధి పనులు

అప్పుల పాలైన సర్పంచులు

- ఈ ఊబి నుంచి సర్పంచులను గట్టెక్కించేనా?
- నెల నెలా అప్పులు చేసి వడ్డీలు చెల్లిస్తున్న తాజా మాజీ సర్పంచ్‌లు

నవతెలంగాణ-బోనకల్

అప్పు చేసి అభివృద్ధి పనులు చేసిన సర్పంచులు చివరకు అప్పుల పాలైనామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల వెంటపడి గ్రామాలలో తాము నిర్దేశించిన అభివృద్ధి పనులు చేయాల్సిందేనని పట్టు పట్టడంతో, మరో మార్గం లేక అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశారు. మరికొందరు సర్పంచులు కొద్దిగా వెనకాడినప్పటికీ అధికారుల ఒత్తిడితో పనుల కోసం అప్పు చేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఐదేళ్ల కేసీఆర్ పాలనలో చేసిన అభివృద్ధి పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పెండింగ్ బిల్లులు పేరుకుపోయాయి. సర్పంచులు కూడా తాము సర్పంచ్ గా గెలిచామని ఉత్సాహంతో అభివృద్ధి పనులు చేయకపోతే ఎట్లా అంటూ అప్పుచేసి అభివృద్ధి పనులు చేశారు.

మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీరిలో దాదాపు 90 శాతం మంది సర్పంచులు అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేశారు. సర్పంచులు గ్రామాలను మాత్రం అభివృద్ధి చేసి వారు మాత్రం అప్పుల ఊబిలో కూరుకు పోయారు. ఒక్కొక్క పంచాయతీలో ఒక సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఆనాడు కేసీఆర్ ప్రభుత్వంలో బిల్లుల కోసం సర్పంచులు ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగారు. అయినా ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులకు కూడా బిల్లులు చెల్లించలేదు. దీంతో అనేకమంది సర్పంచులు అప్పులు పాలు కావడంతోపాటు ప్రతినెల చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించుకుంటూ వస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో బిల్లులు పెద్ద సంఖ్యలో సర్పంచులకు పేరుకుపోయాయి. ఈ లోపు ఎన్నికల రావటం, అధికారంలోకి కాంగ్రెస్ రావటంతో సర్పంచులు తమకు బిల్లులు వస్తాయో రావోనని ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. సర్పంచుల అనుమానాలు ప్రస్తుతం నిజం అవుతూనే ఉన్నాయి. సర్పంచుల బిల్లులపై అధికార, ప్రతిపక్షాల మధ్య పెద్ద ఎత్తున శాసనసభలో చర్చలు సాగాయి. ఈ చర్చలలో మీ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులకు బిల్లులు ఎందుకు చెల్లించలేదని అధికారుల పక్షం ప్రతిపక్షాన్ని నిలదీసింది. ఇప్పుడు తమను పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఎందుకు విమర్శలు చేస్తున్నారంటూ అధికార పక్షం ప్రతిపక్షంపై విరుచుకుపడుతోంది.

ఈ విధంగా అధికార, ప్రతిపక్షాల మధ్య సర్పంచులు నరకయాతన పడుతున్నారు. బిల్లులు వస్తాయో రావోనని చేసిన అప్పులు ఎలా తీర్చాలంటూ సర్పంచులు మనోవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పంచాయతీ నుంచి పెద్ద గ్రామపంచాయతీ వరకు రూ.2 లక్షల నుంచి సుమారు రూ.20 లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించవలసి ఉంది.

సర్పంచుల మాటలలోనే చూద్దాం..

తూటికుంట్ల సర్పంచ్‌గా దళిత మహిళ నోముల వెంకట నరసమ్మ ఐదేళ్లపాటు అప్పులు చేసి గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. కానీ చివరకు ఆమెకు మిగిలింది అప్పులు మాత్రమే. దాదాపు సుమారు రూ. 14 లక్షల వరకు ప్రభుత్వం నుంచి పెండింగ్ బిల్లులు ఉన్నాయి. ఆనాడు 12 పనులకు ఎంబిలు చేసినప్పటికీ నిధులు లేకపోవడంతో చెక్కులు రాసి ఇచ్చిన ఆ చెక్కులు చెల్లలేదు. మండల పరిషత్ నుంచి రూ. 8 లక్షలు, జిల్లా పరిషత్ నుంచి మరో రూ. 4 లక్షలు బిల్లులు రావాల్సి ఉంది. 2 సంవత్సరాల నుంచి ఈ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పులకు మాత్రం ప్రతి నెల వడ్డీ చెల్లించుకుంటూ వస్తోంది. బోనకల్ సర్పంచ్‌గా గిరిజన తెగకు చెందిన భూక్యా సైదా నాయక్ కు మొత్తం రూ. 25 లక్షలు ప్రభుత్వం నుంచి బిల్లులు రావాల్సి ఉంది. ఈజీఎస్ నుంచి రూ.6 లక్షలు పాఠశాల టాయిలెట్స్ నుంచి రూ. 7 లక్షల పంచాయతీ నుంచి రూ. 5 లక్షల జిల్లా పరిషత్ నుంచి రూ. 2 లక్షలు బిల్లులు రావాల్సి ఉంది. మండల పరిషత్ ఇతర శాఖల నుంచి మరో రూ.5 లక్షల వరకు రావాల్సి ఉంది. అప్పులు చేసి అభివృద్ధి చేసి అప్పులు పాలయ్యానని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు.


వెంకటనరసమ్మ


సైదా నాయక్


షేక్ బిజాన్ బీ

ముష్టికుంట్ల సర్పంచ్ షేక్ బిజాన్ బి కి రూ.9.5 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. పంచాయతీ నుంచి రూ 4.5 లక్షలు, జిల్లా పరిషత్ నుంచి రూ.5 లక్షలు రావాల్సి ఉంది. రెండేళ్ల నుంచి ఈ బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి.

మోటమర్రి సర్పంచ్ గా మహిళ కేతినేని ఇందుకు సుమారు రూ.20 లక్షలు బిల్లులు రావాల్సి ఉంది. ఇందులో జడ్పీ నుంచి రూ 9.20 లక్షలు ఈజీఎస్ నుంచి రూ. 4 లక్షలు మండల పరిషత్ నుంచి రూ.3 లక్షలు టాయిలెట్స్‌కి రూ.3 లక్షలు పంచాయితీ నుంచి రూ.1.50 లక్షలు బిల్లులు రావాల్సి ఉంది. ఒక పంచాయతీకి 20 లక్షల రూపాయలు ప్రభుత్వం బకాయి పడింది.

చిరునోముల సర్పంచ్ గా దళిత యువకుడు మూలకారపు రవికి సుమారు రూ. 20 లక్షలు బిల్లులు రావాల్సి ఉంది. ఈ మొత్తం అప్పులు తీసుకువచ్చి పనులు చేశాడు. రూ.14 లక్షలతో సిసి రోడ్లు, లక్ష రూపాయలతో కల్వర్టులు, పంచాయతీ నుంచి రూ. 4 లక్షల రూపాయలు రావాల్సి ఉంది. మరో లక్ష మండల పరిషత్ నుంచి రావాల్సి ఉంది. ఆనాడు అధికారుల, ప్రభుత్వం ఒత్తిడితో తాను అప్పులు చేసి అభివద్ధి పనులు చేశానని, కానీ తనకు మూడు సంవత్సరాల నుంచి బిల్లులు చెల్లించడం లేదని తెలిపారు. తీసుకువచ్చిన అప్పులకే మరల అప్పులు చేసి ప్రతి నెల వడ్డీ చెల్లిస్తున్నానని తెలిపారు. ఈ విధంగా మండల వ్యాప్తంగా 22 మంది తాజా మాజీ సర్పంచులు గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక అప్పులపాలై ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తమ ఆర్థిక బాధలను గుర్తించి చేసిన అభివృద్ధి పనులకు పెండింగ్ బిల్లులను చెల్లించి తమను ఆత్మహత్యల నుంచి కాపాడాలని సర్పంచులందరూ ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని కోరుతున్నారు.




కేతినేని ఇందు


ములకారపు రవి

రైతుల పంటల్ని దోచుకునేందుకే నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానం

- రైతు వ్యతిరేక నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు మోడీ ప్రభుత్వ కుట్ర
- పంటల మద్దతు ధర, రైతాంగ హక్కులకై జరిగే ఉద్యమాలపై నిర్బంధాన్ని ఆపాలి
- రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా రింగ్ రోడ్డు సెంటర్లో నూతన వ్యవసాయ మార్కెట్ పాలసీ పత్రాలు దహనం
- రైతు నాయకులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి
- 29 రోజుల నుంచి నిరాహారదీక్షలో ఉన్న రైతు నేత జగత్ సింగ్ దాలైవాల ప్రాణాలు కాపాడాలి
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయకుండా కేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు దోచుకునేందుకు వీలుగా కేంద్ర నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని తీసుకువచ్చిందని, ఇది దేశ వ్యవసాయానికి వాస్తవ సాగు దారులకు, ప్రజలకు ఎంతో హానికరమని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మంగళవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపు మేరకు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా రింగ్ రోడ్డు సెంటర్లో కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫ్లే కార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టి నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రాలను దగ్ధం చేసి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, పట్టణ కార్యదర్శి చింత నిప్పు చలపతిరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక 3 నల్ల చట్టాలను అమలు చేయమని కనీస మద్దతు ధర చట్టం చేస్తామని హామీ ఇచ్చి ఆచరణలో దొడ్డిదారిన అవే నల్ల చట్టాల అమలుకు పూనుకుంటున్నారని, అందుకు ప్రత్యక్ష నిదర్శనమే నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానమని, కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడుదారులకు, వ్యాపారులకు, మార్కెట్ వ్యవస్థను అప్పగించడమే వారి ఉద్దేశమని తద్వారా ప్రస్తుత ప్రభుత్వ మార్కెట్ వ్యవస్థను నీరుగార్చి రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను అప్పనంగా దోచుకోవడానికి వీలు కల్పించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. చావు తప్పి కళ్ళు లొట్టబోయిన రీతిన ప్రజలు తీర్పునిచ్చిన బీజేపీ మోడీ ప్రభుత్వం తమ విధానాలను మార్చుకోకపోగా మరింత పదును పెట్టి దేశ వ్యవసాయాన్ని, రైతులను సంక్షోభంలోకి నెట్టే విధానాల రూపకల్పనకు ప్రయత్నిస్తున్నదని, కనీస మద్దతు ధర చట్టానికి హామీ ఇచ్చి నేటికీ అమలుకు పూనుకోకపోవడం సిగ్గుచేటని, ఈ తరుణంలో గత చారిత్రాత్మక రైతాంగ ఉద్యమ బాటలో ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్యమం ప్రారంభమైందని, అట్టి రైతాంగ ఉద్యమంపై నిర్బంధాన్ని ప్రయోగిస్తూ రైతు ఉద్యమకారులను అరెస్టు చేసి అక్రమ కేసులు పెట్టి జైల్లోకి పంపారని, ఎస్కేయం జాతీయ నాయకుడు జగత్ సింగ్ దలైవాల 29 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న కనీసం రైతు సంఘాలతో చర్చలు జరపాలనే స్పృహ కేంద్ర ప్రభుత్వానికి లేకపోవడం ఆవేదన కలిగిస్తుందని, ఇప్పటికైనా రైతు వ్యతిరేక విధానాలకు స్వస్తి పలికి రైతుల పంటలకు కనీస మద్దతు ధర చట్టాన్ని చేసి ఉత్పత్తి ఖర్చులను తగ్గించి దేశాన్ని కాపాడాలని లేకపోతే రైతాంగ ఉద్యమం క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. వెంటనే నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, పంజాబీ సరిహద్దుల్లో రైతుల పోరాటంపై అణిచివేతను ఆపాలని, గ్రేటర్ నోయిడా జైల్లో ఉన్న రైతు నాయకులను విడుదల చేయాలని, రైతు సంఘాలతో తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు , జిల్లా కమిటీ సభ్యులు బాణాల శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా నాయకులు తోట నాగేశ్వరరావు మాజీ ఎంపిపి బొంతు సమత, మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు, రైతు సంఘం నాయకులు కురుగుంట్ల శ్రీనివాసరావు, పైడిపల్లి సాంబశివరావు, యనమద్ది రామకృష్ణ, మాడపాటి మల్లిఖార్జున్, మల్లెంపాటి ప్రసాదరావు, వడ్లమూడి మధు, నూకల వెంకటేశ్వరరావు వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి గుమ్మా నరిసింహరావు, మహేష్, తేజావత్ సీతారాములు, పాల్గొన్నారు.

డీటీవో అఫ్రిన్ సిద్ధిఖీ రిలీవ్

నవతెలంగాణ-ఖమ్మం

జిల్లా రవాణా శాఖాధికారి అఫ్రీన్ సిద్ధిఖి మంగళవారం రిలీవ్ అయ్యారు. ఇటీవల రవాణా శాఖలో జరిగిన ఉద్యోగోన్నతుల్లో అఫ్రీన్‌కు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ)గా ఉద్యోగోన్నతి లభించింది. హైదరాబాద్ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి ఆమెను కేటాయించారు. ఈనేపథ్యంలో ఐదు నెలల సెలవు అనంతరం మంగళవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఆమె తిరిగి విధుల్లో చేరి రిలీవ్ అయ్యారు. ప్రస్తుతం డీటీఓగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు చూస్తున్న వాకదాని వెంకటరమణ ఆమెకు రిలీవ్ ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ రెంటాల స్వర్ణలత, శిక్షణ ఏఎంవీఐలు గోపికృష్ణ, సుమలత, దినేశ్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామాన్ని సందర్శించిన డిప్యూటీ సీఎం

- అభివృద్ధి పనులను పరిశీలించిన భట్టి

నవతెలంగాణ-వైరా



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంగళవారం మండలంలోని ఆయన స్వగ్రామం స్నానాల లక్ష్మీపురం గ్రామాన్ని సందర్శించారు. భట్టి విక్రమార్క రాష్ట్ర డిప్యూటీ సీఎం అయిన తర్వాత స్వగ్రామంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను ఎంఎల్ఏ ఎం.రాందాస్ నాయక్ తో కలిసి పరిశీలించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో మూడు కోట్ల 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మాణం చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. తర్వాత అధికారులతో మాట్లాడారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్డింగ్ నిర్మాణ పనులకు అడ్డంకిగా ఉన్న విద్యుత్తులైన్లను వెంటనే మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నూతి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీల వెంకట నర్సిరెడ్డి, దొడ్డ పుల్లయ్య, మల్లు రామకృష్ణ, ఏదునూరు సీతారాములు, పొదిలి హరినాథ్, వడ్డే నారాయణ, పమ్మి అశోక్, పనితి శీను, పలు శాఖల అధికారులు మండల నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మిటన్ పోటీలకు బోనకల్ క్రీడాకారిణి

నవతెలంగాణ-బోనకల్



70వ జాతీయస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ బాలికల పోటీలకు బోనకల్ టిఎస్‌డబ్ల్యుఆర్ఎస్‌కు చెందిన కే.మధులత ఎంపికైనట్లు జిల్లా బాల్ బ్యాట్మెంటన్ కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు వేజెల్ల సురేష్, కోచ్ అమరేసి లింగయ్య తెలిపారు. హైదరాబాదులోనే ఏఎస్ఆర్ నగర్లో రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులలో మధులత అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 26 నుంచి 29 వరకు మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో మధులత పాల్గొననున్నట్లు వారు తెలిపారు. మధులత ఎడమచేతితో ఆడగలిగిన అరుదైన క్రీడాకారిని అని వారు తెలిపారు. కే.మధులత ఎఫెన్స్, డిఫెన్స్‌లో కూడా ఎంతో నైపుణ్యం కలిగిన క్రీడాకారిణి అని వారు తెలిపారు. గతంలో మధులత జూనియర్, సీనియర్ విభాగాలలో జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొని ఎంతో నైపుణ్యాన్ని ప్రదర్శించింది. ఆమెను ప్రిన్సిపాల్ పాసంగులపాటి వెంకట పద్మావతి, పీఈటి సంధ్యారాణి పలువురు అభినందనలు తెలిపారు.

మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు: మధిర ఏడిఏ స్వర్ణ విజయ్ చంద్ర

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామంలో మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు గురించి మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడిఏ) స్వర్ణ విజయ చంద్ర రైతులకు మంగళవారం వివరించారు. గ్రామంలో మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. తల్లి రెక్కల పురుగులు లేత మొక్కలపై పెట్టిన గుడ్లు పగిలి లద్దె పురుగులుగా మారి, గుంపులుగా ఆకుల మీద పత్రహరితాన్ని గోకి తింటూ రంధ్రాలు చేస్తాయన్నారు. ఈ రంధ్రాలు ఆకులపై నిలువుగా కనిపిస్తాయన్నారు. మొక్కజొన్న పంటను యాసంగిలో నవంబర్ నెలలో విత్తుకుంటే మంచిదని, ఆలస్యంగా విత్తుకుంటే పంటలో పురుగు ఉధతి అధికంగా ఉంటుందన్నారు.అంతర పంట లేదా కంచె పంటగా నేపియర్ గడ్డిని వేసుకుంటే ఉధతి తగ్గుతుందన్నారు.విత్తనం విత్తిన వారం రోజులకు ఎకరా పొలంలో 8-10 లింగాకర్షక బుట్టలు అమర్చి, పురుగు ఉధతి గమనించాలాన్నారు. వేపనూనె (1500 పిపిఎమ్) 5 మి.లీ. లీటరు నీటికి చొప్పున పిచికారీ చేస్తే తొలి దశలో తల్లి పురుగు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చునన్నారు.అదే విధంగా పురుగు నివారణకు విషపు ఎర తయారీకి 10 కిలోల తవుడుకు 2 కిలోల బెల్లం కలిపి రాత్రంతా



పులియబెట్టి, ఉదయం వేళ 500 మి.లీ. మోనోక్రోటోఫాస్ లేదా 300 గ్రా. థయోడికార్బ్ మందును కలిపి ఉండలుగా చేసి పొలంలో చల్లాలని రైతులకు సూచించారు. తొలి దశలో పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 20 శాతం ఇ.సి. 2.5 మి.లీ/ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 శాతం ఎస్‌జి 80 గ్రా. మందు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. విత్తనం విత్తిన 40-45 రోజుల దశలో స్పైనోసాడ్ 45 శాతం ఎస్.సి. 60 మి.లీ. మందు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మరీదు త్రివేణి, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | డిసెంబర్ 25, 2024 | www.navatelangana.com

క్రైస్తవ సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు

- మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్



నవతెలంగాణ-ఇల్లందు

క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవ సోదర, సోదరీమణులకు మాజీ శాసన సభ్యురాలు భానోత్ హరిప్రియ నాయక్ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దయామయుడు గాను కరుణామయుడు గాను ఆరాధన అందుకునే గొప్ప దైవం క్రీస్తు యేసు అని ఏసుక్రీస్తు పుట్టిన రోజునే ప్రపంచవ్యాప్తంగా క్రిస్టమస్ పండుగ జరుపుకొని ఎంతో పవిత్రంగా భావిస్తారని అన్నారు. క్రీస్తు యేసు చూపిన మార్గంలో పయనించే ప్రేమ కరుణ త్యాగం శాంతి వంటి లక్షణాలను అలవర్చుకొని సన్మార్గంలో పయనించాలని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ కోరారు.

ఎంపీని మర్యాదపూర్వకంగా కలుసుకున్న గురజాల గోపి



నవతెలంగాణ-మణుగూరు

ములుగు జిల్లాలో కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుతం మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్‌ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురజాల గోపి కలిసి మణుగూరు మండలంలో ఉన్న సమస్యలపై చర్చించారు. వాటి పై ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరలో పరిష్కరింస్తానన హామీ ఇచ్చినట్టు గోపి తెలిపారు.

గురుకుల విద్యార్థిని అమూల్యను పరామర్శించిన రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-పినపాక

మండలంలోని పెంటన్నగూడెం గ్రామానికి చెందిన గుమాస్ అమూల్య పాల్వంచ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతూ ఇటీవల అనారోగ్యానికి గురై 15 రోజుల పాటు పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొంది ఇంటికి చేరింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఉడుముల రవీందర్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి అమూల్యతో ముచ్చటించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని పరామర్శించారు. ఆ కుటుంబానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో మాట్లాడి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

సీఎస్ఐఆర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మణుగూరు

హైదరాబాదులోని సీఎస్ఐఆర్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో ఐటీఐ పూర్తి చేసిన వారికి ఉద్యోగాల కోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు మణుగూరు ఐటీఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐటీఐలో ఎలక్ట్రిషన్, ఫిట్టర్, ఇన్స్ట్రుమెంట్ మెకానిక్, లేబరేటరీ అసిస్టెంట్, ఆరెండేసి, ఎంఎంవి, డ్రాట్స్మన్ సివిల్ కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు ఆన్లైన్లో తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. పూర్తి వివరాల కోసం http://www.iict.res.in వెబ్సైటులో చూసుకోవాలని తెలిపారు. ఈ నెల 26 లోగా తమ దరఖాస్తులను ఆన్లైన్లో అందజేయాలన్నారు.

కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-దమ్మపేట



సీపీఐ(ఎం) మండల కమిటీ ముష్టిబండ గ్రామశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర హోం శాఖ మంత్రి అమీత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ముష్టిబండలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ...రాజ్యాంగ రూపకర్త, మహానుభావులు బాబాసాహెబ్ అంబేద్కర్‌ని రాజ్య సభలో అమీత్ షా చేసిన అవమానకర వ్యాఖ్యలకు నిరసనగా ఈ కార్యక్రమం జరిపామన్నారు. వెంటనే అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మోరం పూడి శ్రీనివాస్‌రావు, మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా లక్ష్మి నారాయణ, మండల కమిటీ సభ్యులు కొలికిపోగు శ్రీనివాసరావు, కొలికిపోగు పెద్దోడు, వెంకటేశ్వరరావు, కొలికిపోగు జగపతిరావ, దాట్ల అశోక్, కొలిక్కిపోకు ప్రశాంత్, నారపోగు అనిల్, హెచ్ శ్రీరాములు, లచ్చన్న, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు...పనితీరు భేష్

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా కొండాపురం సీఎస్‌పీ నుండి తోగూడెం రైల్వే స్టేషన్ వరకు సింగరేణి ఆధ్వర్యంలో నడుస్తున్న రైల్వే లైన్ పై నిర్వహణ, రక్షణ చర్యలకు సంబంధించి కాంట్రాక్ట్ కార్మికుల పనితీరు భేషుగ్గా ఉందని కొండాపురం సీఎస్‌పీడీజీఎం ఐఈడీ వి.మదన్ నాయక్ కాంట్రాక్ట్ కార్మికులకు కితాబిచ్చారు. సింగరేణి 55వ రక్షణ పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం ఆయన సింగరేణి రైల్వే ట్రాక్ లైన్ సందర్శించారు. గత నెల రోజులుగా కాంట్రాక్ట్ వర్క్ లందరూ సమిష్టిగా పనిచేసి రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు ట్రాక్ లైన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్మికులు చేస్తున్న పనిని గమనించి వారిలో రక్షణతో కూడుకున్న విధివిధానాలను గుర్తించి 32 సంవత్సరాలుగా పనిచేస్తున్న సీనియర్ గ్యాంగ్ మెన్స్ కే.గురుమూర్తి, జి.నాగేశ్వరరావుకు బెస్ట్ వర్కర్స్ అవార్డు, జ్ఞాపికని రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆంగోత్ మంగీలాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైల్వే ట్రాక్ మేట్ ఏ.మంగీలాల్, లైన్ మెన్ జి.శ్రీనివాస్, గ్యాంగ్ మెన్స్ కే.గురుమూర్తి, జి.నాగేశ్వరరావు, కే.నాగేశ్వరరావు, యు.శివరామకృష్ణ, వి.శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన పాయం

నవతెలంగాణ-కరకగూడెం



మండల పరిధిలోని తాటిగూడెం పంచాయతీలో 20 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం సుమారు రూ.6,50,000ల విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పేదలకు కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా సహకారం అందిస్తున్నారని అన్నారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగప్రసాద్, ఎంపీఓ కుమార్, కరకగూడెం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, ఎర్ర సురేష్, పోలబోయిన తిరుపతయ్య మహిళా నాయకురాలు పోలెబోయిన శ్రీవాణి, చందా, వెంకటరత్నమ్మ, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-పినపాక

మండల పరిధిలోని ఏడూళ్ళ బయ్యారం సెయింట్ మేరీస్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో చిన్నారులు నృత్యాలతో అలరించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన క్రీస్తు జనన నమూనా అందరినీ ఆకట్టుకుంది. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్ రజిత బహుమతులు అందజేశారు. ఈ వేడుకలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించిన ఎమ్మెల్యే

- రూ.7.95లక్షల ఎల్‌ఓసీ చెక్కు అందజేత



నవతెలంగాణ-దమ్మపేట

మండల పరిధిలోని గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఎమ్మెల్యే జారే దరఖాస్తులు స్వీకరించారు. పలు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఇటీవల దమ్మపేటకు చెందిన భూక్యా ఏసు కుమార్తెకు అత్యవసర సర్జరీ నిమిత్తం ప్రభుత్వం నుండి మంజూరి చేపించిన రూ.7.95లక్షల ఎల్‌ఓసి చెక్కును కుటుంబ సభ్యులకు జారే అందజేశారు. అదే విధంగా జక్కా వెంకటేశ్వరావుకు చికిత్స నిమిత్తం రూ.45వేల చెక్కును అందజేసి హైదరాబాద్‌కు వైద్యం నిమిత్తం వారిని పంపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులకు అన్ని సదుపాయాలు

- ముక్కోటి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ముక్కోటి వైకుంఠ ద్వార దర్శనం తెప్పోత్సవం కనులారా వీక్షించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించనున్నట్టు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ముందుగా స్వామివారి వైకుంఠ ద్వార దర్శనం జరిగే ప్రదేశాలను ఆయన పరిశీలించి, స్వామివారి వైకుంఠ ద్వార దర్శనం వీక్షించడానికి వచ్చే ప్రముఖులకు వీఐపీలకు, వీవీఐపీలకు, భక్తులకు అందరికీ కనపడేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. అనంతరం తెప్పోత్సవం జరుగు ప్రదేశాలను పరిశీలించి ఈ సంవత్సరం ఇతర రాష్ట్రాల నుండి వచ్చే భక్తులకు ఈ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, ఆదివాసీ గిరిజనులకు సంబంధించిన కల్చర్ వంటకాలు సంస్కృతి, సాంప్రదాయాలు తెలియజేసే విధంగా ప్రత్యేకంగా స్టాల్స్ కల్చర్‌కి సంబంధించిన స్టేజి ఏర్పాటు చేసి ఈ నెల 31 డిసెంబర్ నుండి గిరిజనుల కళా ప్రదర్శనలు ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ అధికారులకు ఆదేశించారు. స్వామివారి తెప్పోత్సవం జరిగే రోజు భక్తులకు, ప్రముఖులకు ఇబ్బందులు కలగకుండా వేరువేరుగా భారీ కేడింగ్ ఏర్పాట్లు చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు. గోదావరి కరకట్ట ప్రదేశంలో ఏర్పాటు చేసే ప్రత్యేక స్టాల్స్‌లో ఆదివాసీ కళలకు సంబంధించిన క్రాఫ్ట్స్, ఆదివాసీ వంటకాలు ప్రతిరోజు ఆదివాసులకు సంబంధించిన ట్రైబల్ కల్చర్ ప్రోగ్రాములు వివిధ పాఠశాలల విద్యార్థుల చేత చేయించడం జరుగుతుందని ఈ ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచమంతటికి వ్యాపించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. స్వామివారి తెప్పోత్సవం వీక్షించడానికి వచ్చే భక్తులు మీ పిల్లలను ఇష్టానుసారంగా వదిలేయకుండా దగ్గర ఉండి పిల్లలకు చూపించి మంచి జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా అధికారులు సూచించిన విధంగా స్వామివారి తెప్పోత్సవం కార్యక్రమం వీక్షించి సంతోషంగా ఇండ్లకు వెళ్లాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్ రావు, దేవస్థానం ఈవో రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వరరావు, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవహేళన చేస్తే సహించేది లేదు

- అమిత్ షా పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

నవతెలంగాణ-పాల్వంచ



అంబేద్కర్‌ను అవహేళన చేస్తే సహించేది లేదని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. అంబేద్కర్ పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి కలెక్టరేట్ ఎదుట అంబేద్కర్ ఫోటోలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్ షా పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. బీజేపీ మనువాద భావజాలం అమిత్ షా మాటల ద్వారా బయటపడిందని, అంబేద్కర్ పట్ల బీజేపీ వైఖరిలో ఎలాంటి మార్పురాలేదని ఆక్షేపించారు. అంబేద్కర్‌ను బీజేపీ మాతృ సంస్థలు ఆర్ఎస్ఎస్, జనసంఘ్‌లు వ్యతిరేకించాయని రాజ్యాంగాన్ని ఆమోదించే సమయంలో అంబేద్కర్‌ను తప్పుపట్టాయని దుయ్యబట్టారు. అంబేద్కర్ భావజాలం దేశంలో బలంగా ఉండటం వల్లే బీజేపీ తన సొంత ప్రణాళికలు అమలు చేయడానికి జంకుతోందని మనువాదులకు అంబేద్కర్ సహజంగానే నచ్చరని అమిత్ షా వ్యాఖ్యలు దాన్ని మరోసారి నిరూపించాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి తడికల శివకుమార్, జిల్లా అధ్యక్షులు గంధం మల్లికార్జున రావు, శనగ వెంకటేశ్వర్లు, పాక వెంకటేశ్వర్లు, వినయ్, గుడివాడ రాజేందర్, పార్టీ శ్రేణులు

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జే.రమేష్



నవతెలంగాణ-బూర్గంపాడు

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జే.రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని సారపాక గ్రామపంచాయతీ ఈవో మహేష్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 27, 28లో జరిగే టోకెన్ సమ్మె జయప్రదం చేయాలని ఆయన అన్నారు. గత సంవత్సర కాలంగా గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి అనేక సార్లు సమస్యలను పరిష్కరించాలని పదే పదే వినతి పత్రాలు ఇచ్చినా, దశల వారీగా ఆందోళనలు చేసినా పట్టించుకోలేదని ఆయన అన్నారు. ఈ నెల 17వ తేదీన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఛలో హైద్రాబాద్ కార్యక్రమం నిర్వహించగా, ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లే ఇచ్చి, వెంటనే అనుమతిని రద్దు చేశారని ఆయన అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు చేశారని, గృహ నిర్బంధం చేశారని ఆయన అన్నారు. ఇంతటి నిర్బంధాన్ని సైతం ఎదిరించి వేలాది మంది కార్మికులతో చలో హైద్రాబాద్ కార్యక్రమం నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని, దీనితో ఈ నెల 27, 28 తేదీలలో రెండు రోజుల పాటు టోకెన్ సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ పిలుపునిచ్చారని ఆయన అన్నారు. టోకెన్ సమ్మె తోనైనా ప్రభుత్వం స్పందించాలని, లేని యెడల జనవరి 5వ తేదీ తర్వాత నిరవధిక సమ్మెకి వెళ్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు సురేష్, యాకుబ్, వెంకన్న, రోషమ్మ, సునీత, జన్మియా, తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం రూరల్ : ఎంతోకాలంగా పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కార్మికులందరూ ఒక తాటిపైకి వచ్చి ఉద్యమానికి సిద్ధం కావాలి అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీలలో నిర్వహించనున్న టోకెన్ సమ్మె నోటీసుని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కి అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ యం.బీ.నర్సారెడ్డి, ఉపాధ్యక్షులు బండారు శరత్ బాబు, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు కాపుల రవి, చెన్నకేశవలు, తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 27, 28 తేదీలలో జరుగు పంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకుపాక ధర్మ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్, గొర్రెపాటి బసవయ్య, సాయిలు మహేష్, పెనుబల్లి ఉదయ్, చిన్న రాంబాబు, భాస్కర్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

కోయల రాములకి కన్నీటి వీడ్కోలు

- తుది శ్వాస వరకు సీపీఐ(ఎం), సీఐటీయూ అభివృద్ధి కోసం పరితపించిన నాయకుడు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కనకయ్య





నవతెలంగాణ-మణుగూరు

ఆర్టీసీలో డ్రైవర్‌గా పని చేస్తూ రిటైర్మెంట్ అయిన, ఎస్‌డబ్ల్యూఎఫ్ మణుగూరు డిపో మాజీ అధ్యక్షులు, ప్రస్తుతం సీపీఐ(ఎం) అశోక్ నగర్ శాఖ సభ్యులు కామ్రేడ్ కోయల రాములు (62) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కడసారి కామ్రేడ్ కోయల రాములు భౌతికాయాన్ని చూసేందుకు మణుగూరు నుండి అశేష జనావళి సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు తరలివచ్చారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు కనకయ్య, రేపాకుల శ్రీనివాస్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు కామ్రేడ్ కోయల రాములు మృతదేహంపై ఎర్ర జెండా కప్పిజోహార్లు అర్పించారు. పూలమాలవేసి నివాళు లర్పించారు. కామ్రేడ్ కోయల రాములు కార్మిక పక్షపాతి అని కనకయ్య కొనియాడారు. ఆయన లేని లోటు పార్టీకి, ప్రజా సంఘాలకు పూడ్చలేనిది అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మహా పాదయాత్ర మణుగూరు వచ్చినప్పుడు యాత్ర బృందానికి తమ ఇంటి వద్ద ఆతిథ్యం ఇచ్చాడని, ఈ సందర్భంగా తమ్మినేని ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మణుగూరు శ్రామిక భవనం నిర్మాణ సమయంలో ఆర్థిక సహాయ, సహకారాలు అందించారు. ప్రస్తుతం మణుగూరు ఆర్టీసీ డిపోలో గుర్తింపు సంఘంగా ఉన్న ఎస్‌డబ్ల్యూఎఫ్ గెలుపులో ప్రముఖ పాత్ర వహించారు. నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్నప్పుడు ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుండేవారు. ఇటీవల కాలంలో మణుగూరు నుండి బీటీపీఎస్ వరకు బొగ్గు రవాణా చేస్తున్న 14 టైర్ల టిప్పర్ లారీ డ్రైవర్లు వేతనాల పెంపు విషయంలో తాను ఓనర్ అయినప్పటికీ కార్మికుల పక్షాన నిలబడ్డారు. వేతనాలు పెంపు వరకు సీఐటీయూ తరపున పనిచేశారు. తమ స్వగ్రామం మాదారంలో పార్టీ నిర్మాణానికి కార్మికుల కార్మికుల పక్షాన ఎంతో పని చేశారని ఆయన లేని లోటు తీరా బాధను, ఆవేదనకు గురవుతున్నామని గ్రామ ప్రజలు తెలిపారు. మణుగూరు ప్రాంతంలో ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ బలోపేతానికి అహర్నిశలు కృషి చేశారు. చివరికి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించేందుకు ఆర్థిక సాయంతో పాటు నిరంతరం పని పనిచేశారని ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ అధ్యక్షులు బాణాల రాంబాబు డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.నరసింహారావు, తాటి సుధాకర్ రావులు అన్నారు. నా, నీ భేదాలు లేకుండా అందరినీ కలుపుకొని పనిచేసేవాడని వారు తెలిపారు. ఉమ్మడి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిత్యం శ్రమించేవాడని అన్నారు. పూలమాలవేసి నివాళు లర్పించారు. జై సింగరేణి 14 టైర్లు టిప్పర్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ అధ్యక్షులు ఎం.రామారావు, కార్యదర్శి కె.భాస్కర్ రావులు మాట్లాడుతూ మంచి మిత్రుని కోల్పోయామని తమ బాధను, సంతాపాన్ని తెలిపారు. సీపీఐ(ఎం) మండల కమిటీ కామ్రేడ్ కోయల రాములకి ప్రగాఢ సంతాపం తెలిపింది. పార్టీ సీనియర్ నాయకులు కొడిశాల రాములు, మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పిట్టల నాగమణి, బొల్లం రాజు, ములకల ఉత్తం, తోట పద్మ, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు మణుగూరు నుండి అంత్యక్రియలో పాల్గొన్నారు. పూలమాలతో కామ్రేడ్ రాములుకి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.



నూతన జీపీ, అంబులెన్సు ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కరకగూడెం

మండల పరిధిలోని ప్రాథమిక వైద్యశాలలో నూతన 102 అంబులెన్స్‌ను మంగళవారం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించకుండా 102 అమ్మ వాహనం అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాటిగూడెం గ్రామంలోని సుమారు రూ.20 లక్షల నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం గ్రామపంచాయతీ కార్యాలయానికి స్థలాన్ని దానం చేసిన కొమరం వెంకటమ్మ, కొమరం సత్యవతి, కొమరం విజయను శాలువాతో సన్మానించారు. అలాగే విద్య, వైద్యం, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖ, ఫారెస్ట్, వ్యవసాయ శాఖ, అంగన్వాడీ, ఇతర ప్రభుత్వ శాఖ అధికారులతో గ్రామస్తుల సమక్షంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పలు సమస్యలపై చర్చించి గ్రామస్తుల సమక్షంలోనే పరిష్కరించారు. తెలంగాణలో ప్రజాపాలన ప్రభుత్వం వచ్చిందని గ్రామంలో మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తుందని తెలియజేశారు. ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, మాజీ సర్పంచులు పోలేబోయిన శ్రీవాణి, తోలేం నాగేశ్వరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుపతయ్య, ఎర్ర సురేష్, జలగం క్రిష్ణ, గోగ్గలి రవి, లక్క శ్రీను, నాగేష్, మధు, మహిళా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మనువాదుల గుండెల్లో తుపాకీ తూటా పెరియార్

- డాక్టర్ భాను ప్రసాద్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



స్థానిక బీఆర్ అంబేద్కర్ హాస్పిటల్ నందు మహాజన మహిళా సమైక్య ఎంఎంఎస్ ఆధ్వర్యంలో సాంఘిక విప్లవ నేత పెరియార్ రామస్వామి 51వ వర్థంతి సందర్భంగా పెరియార్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు సామాజిక ఉద్యమకారులు ప్రముఖ హేతువాది డాక్టర్ భాను ప్రసాద్ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ ప్రజలకు స్త్రీలకు గౌరవం లేకుండా కులం మతం పేరుతో ఏళ్ల నుంచి అసమానతలకు కారణమైన మనువాద వ్యవస్థపై ఆత్మగౌరవ పోరాటం చేసిన వ్యక్తి పెరియార్ రామస్వామి అన్నారు. సమాజాన్ని కులాల పేరుతో విడదీసి ఆత్మగౌరవం లేకుండా అవమాన పరిచిన మనువాదుల గుండెల్లో తుపాకీ తూటగా మారిన గొప్ప సంఘసంస్కర్త పెరియార్ రామస్వామి అని కొనియాడారు. ప్రతీ ఒక్కరూ పెరియార్ మార్గంలో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహాజన మహిళా సమైక్య జిల్లా అధ్యక్షులు మేకల లత, ఉపాధ్యక్షురాలు కొచ్చర్ల కుమారి, కార్యదర్శి కొప్పుల నాగమణి, కోట ప్రశాంతి, రమణమ్మ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా సీనియర్ నాయకులు అలవాల రాజా పెరియార్, కొప్పుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులను కాపాడాలి

- అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్

నవతెలంగాణ-పాల్వంచ



వినియోగదారుల హక్కులను కాపాడాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు కాపాడటానికి 1986వ సంవత్సరంలో అమల్లోకి వచ్చిందని అన్నారు. ఈ చట్టాన్ని 2019లో మార్పులు చేసి, వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంగా రూపొందించారన్నారు. వినియోగదారులు రాయితీలు, ఉచిత ప్రకటనలను ఆన్లైన్లో చూసి మోసపోవద్దు అన్నారు. ఇలాంటి మోసాలను హ్యాకర్లు గుర్తించి దోచేస్తారని, పాస్వర్డ్‌ను సులువుగా పెట్టుకోవద్దని, ఓటీపీలను ఇతరులతో పంచుకోవద్దన్నారు. కొనుగోలు చేసిన వస్తువు తయారీ, చిరునామా, గడువు తేదీ మరియు కస్టమర్ కేర్ నెంబర్‌ను సరి చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డిజిటల్ పేమెంట్లు, క్యూఆర్ కోడ్ మరియు మొబైల్ యాప్ ద్వారా చెల్లింపులు వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు విత్తనాలు, మందులు కొనేటప్పుడు బోగస్ కంపెనీల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మోసానికి గురైతే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసి తమకు జరిగిన నష్టాన్ని తిరిగి పొందవచ్చు అని తెలిపారు. వినియోగదారులు తూకాలలో మోసపోవద్దని వస్తువు కొనుగోలులో పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాపారస్తులు ఉపయోగించే తూనికలు కొలతలు పరికరాలకు సకాలంలో ముద్ర వేయించుకొని లైసెన్స్ తీసుకోవాలని అన్నారు. వినియోగదారుల హక్కులను కాపాడేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారి రుక్మిణి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి మనోహర్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్, వాలంటరీ ఆర్గనైజర్స్ జూలూరి రఘు రామాచారి, తెలంగాణ కన్స్యూమర్ సెయింట్ ఇన్ఫర్మేషన్ రైట్స్ అవేర్నెస్ ఫోరం గుగులోతు బాలు, తెలంగాణ కన్స్యూమర్ ఫోరం కొత్తగూడెం సభ్యులు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి ప్రపంచానికి తెలిసేలా ట్రైబల్ మ్యూజియం

- ముక్కోటి నాటికి సిద్ధం
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఇతర రాష్ట్రాల నుండి సీతారామచంద్ర స్వామి వారి తెప్పోత్సవం ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులకు ఈ జిల్లాలోని మారుమూల ప్రాంత ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, వారి కల్చర్‌కు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేసి ఈ కల్చర్ను ప్రపంచమంతట విస్తరింప చేయడానికి ట్రైబల్ మ్యూజియంలో కల్చర్‌కి సంబంధించిన కళాఖండాలు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ప్రాంగణంలో ఖాళీగా ఉన్న భవనాలను వెదురు క్రాఫ్ట్ సంబంధించిన వస్తువులు అమ్మకాలు జరుపుకోవడానికి ఏర్పాట్లు చేయాలని మ్యూజియం ప్రాంగణంలో నిర్మాణం చేపట్టే పాతకాలపు ఇండ్లలో భక్తులు సెదతీరి ఆదివాసీ వంటకాలు సేవించేలా వెదురుతో తయారుచేసిన సోఫాలు కుర్చీలు అమర్చాలని అన్నారు. ప్రతి స్టాల్‌లో ట్రైబల్‌కు సంబంధించిన ప్రాడక్ట్స్ మాత్రమే ఉండాలని, అలాగే పాత కాలం గిరిజనులు సేంద్రియ ఎరువులతో పండించిన పంటలకు సంబంధించిన తృణధాన్యాలు, ఔషధ గుణాలకు సంబంధించిన పదార్థాలు స్టాల్స్‌లో ఏర్పాటు చేస్తున్నామని భక్తులు నేరుగా వచ్చి ఆదివాసీ గిరిజనులకు సంబంధించిన క్రాఫ్ట్ కొనుగోలు చేసి మ్యూజియంను సందర్శించి బొజ్జిగుప్ప నారాయణపేట గ్రామాలను సందర్శించి రాత్రి అక్కడ బస చేసి, ట్రైబల్ కల్చర్ వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు ఇక్కడ కల్చర్ను చూసి మైమరిచిపోయేలా ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. దేవస్థానం, గోదావరి కరకట్టల ప్రదేశం నుండి ఐటీడీఏ ట్రైబల్ మ్యూజియం బొజ్జిగుప్ప గ్రామాలకు భక్తులు వెళ్లే విధంగా సూచిక బోర్డులను ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, ఐటీడీఏ ఏఓ సున్నం రాంబాబు, ఏపీఎంఓ రమణయ్య, ఏటీడీఓ అశోక్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, డీఎస్ఓ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ, జేడియం హరికృష్ణ, ఈవో గ్రామపంచాయతీ శ్రీనివాస్, మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి, ఐకేపీ ఏపీఎంలు జగదీష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కట్ చేసిన డబ్బులను అకౌంట్‌లో వేయాలి

- సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు



నవతెలంగాణ-కొత్తగూడెం

సుమారు 12 నెలల పాటు కన్వేయన్స్ వాహనాల బిల్లులో సీఎం పీఎఫ్ పేరుతో కట్ చేసిన 15 శాతం డబ్బులను కార్మికుల సీఎం పిఎఫ్ అకౌంట్‌లో, డ్రైవర్ అకౌంట్‌లో జమ చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, బ్రాంచ్ కార్యదర్శి వీరన్న కమిటీ సభ్యులు రమేష్ ప్రతినిధి బృందం ట్రాన్స్‌పోర్టు జియంను కసిపి వినతి పత్రం అందజేశారు. అనంతరం బి.మధు మాట్లాడుతూ సింగరేణి కన్వేయన్స్ డ్రైవర్లు అందరికి సీఎంపిఎఫ్ అమలుచేయాలని అనేక సంవత్సరాలుగా యాజమాన్యాన్ని కోరుతూ వచ్చారు. చివరకు సిఎంపిఎఫ్ అధికారులతో సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు సిఎం పిఎఫ్‌లో సమస్య చేయడానికి అంగీకరించిందని తెలిపారు. 1ఏప్రియల్ 2023 నుండి అమలు చేయాలని ఆదేశాలను ఇచ్చిందన్నారు. సింగరేణి యాజమాన్య ఆదేశాలపై ఓనర్లు హైకోర్టుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం సిఎంపిఎఫ్‌ను అమలు చేయకుండా సిఎంపిఎఫ్ నిమిత్తం 1జూన్2020 నుండి కన్వేయన్స్ వాహనాల బిల్లులలో 15శాతం అమౌంట్ ని కట్ చేసుకుని బిల్లులను చెల్లించిందని చెప్పారు. హైకోర్టులో కార్మికుల అనుకూలంగా సిఎంపిఎఫ్ అమలు చేయాలని తీర్పు వచ్చింది. ఓనర్లు సుప్రీం కోర్టు వెళ్లారు. ఇప్పుడు కోర్టు సైతం కార్మికులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈనేపథ్యంలో 1ఏప్రియల్2024 నుండి డ్రైవర్లకు పూర్తిస్థాయిలో సిఎంపిఎఫ్ అమలు చేస్తున్నారు. ఇప్పుడు కొంతమంది బినామీ ఓనర్లు ఆడబ్బులను ఓనర్లకు చెల్లించాలని, అందుకు డ్రైవర్లకు అభ్యంతరం లేదని పేపర్లు రాసి బలవంతంగా డ్రైవర్లతో సంతకాలు పెట్టిస్తున్నారు. సంతకాలు పెట్టకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. అవి సిఎంపిఎఫ్ నిమిత్తం కట్ చేసిన డబ్బులు. ఆ పేరుతో ఓనర్లు డ్రైవర్లకు వేతనాలు కూడా తగ్గించారు. అంటే అవి డ్రైవర్ల డబ్బులే. కావున ఆ డబ్బులను డ్రైవర్ల పేరుతో సీఎంపిఎఫ్ అకౌంట్స్‌లో జమ చేయాలి. లేదా డ్రైవర్ల అకౌంట్స్‌లోనే జమచేయాలని, లేదా ఓనర్లు డ్రైవర్లకు తక్కువగా చెల్లించిన వేతనాలను తిరిగి చెల్లించిన అనంతరం ఓనర్లకు నెల్లంచాలని తెలిపారు.

అడవులను నరికితే కఠిన చర్యలు : డీఎఫ్ఓ



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

అడవులను నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ జిల్లా అధికారి(డీఎఫ్ఓ) కృష్ణ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆళ్ళపల్లి, గుండాల, రేగళ్ల, కాచనపల్లి, కొమరారం రేంజీల అధికారులు, సిబ్బందితో కలిసి అడవిరామవరం గ్రామంలో సమావేశమయ్యారు. ఈ మేరకు రేగళ్ళ, ఆళ్ళపల్లి, కాంచనపల్లి రేంజ్‌లలో ఫారెస్ట్ భూముల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయా రేంజీల్లో ఏర్పాటు చేస్తున్న హరితహారం నర్సరీలు, అడవులను, అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టిలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ.. అడవులకు నిప్పు అంటించి వద్దని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నర్సరీల్లో నాటిన ప్రతి ఒక్క బతికే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అటవీ సంపదకు నష్టం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, రేంజర్లు కిరణ్, వి.జశ్వంత్, చలపతిరావు, కె.నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల పస్తులు..

పండగెలా జరుపుతారు..?

- సింగరేణి డే ఉత్సవాల వద్ద సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) ఆందోళన
- ఎస్అండ్‌పీసీ-పోలీసులు, సీఐటీయూ నాయకులకు మధ్య వాగ్వివాదం
- సీఐటీయూ ఆందోళన ఫలితంగా చర్చలకు పిలిచిన సింగరేణి చైర్మెన్

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని దానికి నిరసనగా సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలియజేస్తూ 'సింగరేణి డే' సందర్భంగా ప్రకాశం స్టేడియం వద్ద శాంతి యుతంగా ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళన సింగరేణి ఎస్అండ్‌పిసీ, పోలీసుల సిఐటియూ నాయకుల మధ్య తీవ్రవాదం జరగడంతో కొద్దిసేపు సింగరేణి ఉత్సవాలలో గందరగోళం నెలకొంది. సింగరేణి డే సందర్భంగా కాంట్రాక్టు కార్మికుల శ్రమను గుర్తించి వారికి రావలసిన న్యాయమైన హక్కులు వేతనాలు సంక్షేమ పథకాలు ఇతర సౌకర్యాలు కల్పించే విధంగా సింగరేణి సీఅండ్‌ఎండి ప్రకటన చేయాలని నినాదాలు చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి సిఐటియు నాయకులు నినాదాలు చేశారు. అనంతరం సింగరేణి చైర్మెన్‌కు వినతి పత్రం అందజేసే విధంగా నిరసన బ్యాడ్జీలతో కాంటాక్ట్ కార్మికుల సమస్యలను ద్వారా ప్రదర్శిస్తూ సిఐటియూ నాయకులు ఆందోళన చేపట్టడం జరిగింది. ప్రకాశం స్టేడియంలో గంటపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.మధు మాట్లాడుతూ కోలిండియాలో అమలు చేస్తున్న వేతనాలు సింగరేణిలో కూడా అమలు చేయాలని ఈఎస్ఐ అమలు చేయాలని, ప్రతి నెల 7వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని తదితర ప్రధాన డిమాండ్ల ను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, సమ్మె కాలపు హామీలను అమలు చేయాలని, వృత్తి పన్నులను సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అనేకసార్లు అధికారులకు, ప్రభుత్వానికి కోల్బెల్టులో గెలిచిన శాసన సభ్యులకు వినతి పత్రాలు ఇచ్చి కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ వేదికల్లో మాట్లాడాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సమస్యలు పరిష్కరించాలని అనేకమార్లు కాంట్రాక్టు కార్మికుల గోసను వెళ్ళబుచుకున్న ఫలితం లేదన్నారు. ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికలయ్యాక మరో మాట చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై స్పందించాలని న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మధు డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం ఒకే కుటుంబం... ఒకే లక్ష్యం... ఒకే గమ్యం అంటూ నినాదాలు గోడల వరకే పరిమితం అయ్యాయని, ఆచరణలో మాత్రం రెండు రకాల విధానాలు అవలంబిస్తూ కాంట్రాక్టు కార్మికుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని, ఇది సరైనది కాదని సింగరేణి అధికారులకు సూచించారు. శ్రమ ఒకటే అయినప్పుడు వేతనాలు కూడా శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వాలన్నారు. అందుకనే రాష్ట్ర వ్యాప్తంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించే విధంగా నిరసనలు తెలియజేస్తున్నామన్నారు. సమస్యలు పరిష్కరించ కుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.





సీఐటీయూ ఆందోళనకి దిగివచ్చిన సింగరేణి యాజమాన్యం

చర్చలకు పిలిచిన సీఅండ్ ఎండి

సీఐటీయూ ఆందోళనలకు దిగివచ్చిన సింగరేణి అధికారులు చర్చలకు పిలిచారు. అనంతరం సింగరేణి సీఎస్ఎండీ బలరాంకి వినతి పత్రం అందజేసి సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ ఉత్తర్వులు కనీస సౌకర్యాలు అమలు వేతనాల విషయంలో అధికారులు ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నారని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని వివరించారు. ఈ విషయాలపై సీఎస్ఎండి బలరాం నాయక్ సానుకూలంగా స్పందిస్తూ వెంటనే మంగళవారం సాయంత్రం జీఎంలతో, సంబధిత సింగరేణి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మీ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తారని హామీ ఇచ్చారు. అనంతరం సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు మాట్లాడుతూ దేవుడు కరుణించిన పూజారి కరుణించనట్లు...మిమ్మల్ని అనేకసార్లు కలిసి వినతి పత్రాలు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఇచ్చామని, మీరు పెద్దమనుసుతో వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని కిందిస్థాయి అధికారులకు సర్కిలర్లు జారీచేసినప్పటికీ, కింద ఉన్నటువంటి అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని, కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా మీరు చొరవ తీసుకొని ఎక్కడ జాప్యం జరుగుతుందో అధికారులతో మాట్లాడి అనాదిగా సింగరేణి పరిధిలో పరిష్కారం అయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. జీతాల సమస్య ఏదైనా ఉంటే అది ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, స్థానికంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. మధు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కాంట్రాక్ట్ కార్మికులు జీవితం ఎలా గడుస్తుంది. వారి సమస్యలను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించకపోతే సిఐటియూ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలని నిర్వహిస్తామని, ఇప్పటికే కాలయాపన చేస్తున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి, జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు భూక్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవిద్యా స్కూల్ విద్యార్థులకు పథకాల పంట

నవతెలంగాణ-కొత్తగూడెం

డిసెంబర్ 16వ తేదీ నుండి 21వ తేదీ వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి సిఎం కప్ టోర్నమెంట్స్ నిర్వహించారు. స్థానిక కొత్తగూడెం ప్రగతి మైదాన్ క్లబ్, సీఇఆర్ క్లబ్, పాల్వంచ టిఆర్‌సీ క్లబ్ నందు వేరువేరు విభాగాలలో నిర్వహించడం జరిగింది. జిల్లా స్థాయిలో నిర్వహించబడిన సీఎం కప్‌లో స్థానిక శ్రీవిద్యా స్కూల్ 9వ తరగతి చదువుతున్న పి.నోయల్ విన్సెంట్ వేరు వేరు విభాగాల్లో 12 పథకాలు సాధించి జిల్లాస్థాయి " చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారన్ని శ్రీవిద్యా విద్యాసంస్థల సీఇఓ శ్రీచైతన్య కృష్ణ తెలిపారు. మంగళవారం పాఠశాలలో పతకాలు సాధించిన వారని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీ విద్యా స్కూల్ పాల్వంచలో 8వ తరగతి చదువుతున్న జి.భావన మంచి ప్రతిభ కనబరిచి 4 విభాల్లో పథకాలు సాధించారని తెలిపారు. అదేవిధంగా 2024 స్టఫ్ స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించడం జరిగింది. ఇదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జి.భావన కార్తిక పలు పథకాలు సాధించినట్లు శ్రీచైతన్య కృష్ణ తెలిపారు. విద్యార్థులు విద్యతో పటు మానసిక-శారీరక ధారుడ్యాన్ని కలిగి ఉండటానికి క్రీడలు చక్కగా దోహదపడతాయన్నారు. ఇంతటి ప్రతిభను కనబరచేందుకు ప్రోత్సహించిన విద్యార్థుల తల్లి, దండ్రులను ఈ సందర్భంగా సీఇఓ ప్రశంసించారు. విద్యార్థులకు బంగారు బాటలు వేయడానికి గురువులే కాకుండా తల్లి, దండ్రుల ప్రోత్సహం, సహకారం ఏంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వందనపు స్వప్న, విద్యా సంస్థల ఏజీఎం వేణుగోపాల్ రెడ్డి, కో-ఆర్డినేటర్ జిఎస్.కుమార్, విద్యార్థినీ, విద్యార్థుల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తారా...విద్యార్థులతో రోడ్డెక్కాలా

- పది, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నా పట్టించుకోరా
- ప్రజా ప్రభుత్వమా, ఉద్యోగుల శ్రమ దోపిడీ చేసే ప్రభుత్వమా?
- జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నిరసనలు
- బి.వీరభద్రం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



నవతెలంగాణ-పాల్వంచ

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ గత 15 రోజులుగా సమ్మె చేస్తున్న కేజీబీవీ-సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలియజేశారు. జిల్లావ్యాప్తంగా కేజీబీవీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగుల సమ్మెను ప్రభుత్వం వెంటనే విరమింపజేయాలని కోరుతూ జిల్లా వ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చారు. పాల్వంచ నూతన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చౌక్‌లో సమ్మె చేస్తున్న ఉద్యోగుల సంఘీభావం ప్రకటిస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం మాట్లాడారు. కేజీబీవీ-సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల నిరవధిక సమ్మెతో కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో బోధన నిలిచిపోయిందని, విద్యార్థులకు కీలక తరుణం కావడంతో బోధనకు ఆటంకం ఏర్పడి సిలబస్ ముందుకు సాగటం లేదని, ఫలితంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నాన్నారు. బోధనేతర సిబ్బంది సైతం సమ్మె చేస్తుండడంతో ఎంఆర్సీలు, డీఈవో కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయని, వివిధ రకాల ఫైళ్లు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. జిల్లాలో కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్ళు, భవిత కేంద్రాలు ఎంఈఓ, డీఈవో కార్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బంది సుమారు 500 మంది విధులు నిర్వహించేవారంతా సమ్మెలో ఉన్నారని, ఇందులో బోధనా సిబ్బంది 200 పైగా ఉన్నారని వీరుతో పాటు విద్యాశాఖ జిల్లా స్థాయిలో ఏపీవోలు, డీపీఓలు, సాంకేతిక నిపుణులు, సిస్టం ఎనాలసిస్టులు, భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలు అందించే ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు. మండల స్థాయిల్లో కంప్యూటర్ సహాయకులు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వాచ్మెన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు ఉన్నారని వీరంతా 2024 నుంచి పని చేస్తున్నారని 15 రోజులుగా సమ్మె చేస్తుండటంతో అటు బోధన విషయంలో, ఇటు పాలన విషయంలో తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. 5 వేలకు పైగా విద్యార్థుల చదువులు ప్రమాదంలో ఉన్నాయనీ, జిల్లాలో 14 కస్తూర్బా గాంధీ విద్యాలయాలలో 4 వేలకు పైగా విద్యార్థులు ఉన్నారని, వీరులో పదో తరగతితో పాటు, ఇంటర్ విద్యార్థులు చదువుకుంటున్నారని బోధనా సిబ్బంది సమ్మెలో ఉండటంతో బోధన చేసేవారు లేరని ఒకరిద్దరు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినా, ఆశించిన మేర సిలబస్ కావడం లేదని ఇప్పటికే టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించిందని అంతేకాకుండా మండల విద్యాశాఖ కార్యాలయాల్లో యూ డైస్, మధ్యాహ్న భోజన తదితర బిల్లులు నిలిచిపోయాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ 25 రోజులపాటు సమ్మె చేశామనీ, ఉద్యోగుల డిమాండ్లు నెరవేరుస్తామని ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా హామీలు నెరవేర్చడం లేదని, ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మందా నాగకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రామ్ చరణ్, జిల్లా నాయకులు బి.సాయి తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-ఇల్లందు

జెకె కాలని సింగరేణి మైదానంలో వాకర్స్ సభ్యులు విమల, ఇమాన్యూయల్ ఆధర్యంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు. పోలీసు అధికారి జక్కుల శంకర్ హాజరై కేక్ కట్ చేసి సభ్యులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఏసుక్రీస్తు శాంతి సందేశం మానవతా విలువలు ఎందరికో ఆచరణాత్మకమని వారు తెలిపారు. అనంతరం నిర్వాహకులు జక్కుల శంకర్, రాకం శ్యామ్ బాబు, అప్పల రాజులను శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు రాకం శ్యామ్ బాబు, సుదర్శన్ కోరి, అప్పల రాజు, అశోక్, అయిత విశ్వేశ్వర రావు, సోఫియా, మణి కుమార్, సర్దార్, శ్రీను, రమేష్, యాదగిరిలు పాల్గొన్నారు.



క్రిస్మస్ సందర్భంగా దుస్తుల పంపిణీ

నవతెలంగాణ - బోనకల్

మండలంలోని శాంతి నిలయంలోని మానసిక వికలాంగుల కేంద్రంలో క్రీస్తులో నిరీక్షణ జయం ప్రార్థన మందిరం వారు గుమ్మ సైదులు, లక్ష్మి దంపతులు, రాంబాబు, స్వర్ణ ప్రియ, వినోదు -బిందు దంపతుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం నిర్వహించారు. అనంతరం శాంతి నిలయంలో కేక్ కట్ కట్ చేశారు. మానసిక వికలాంగులకు స్వీట్స్, అల్పాహారం అందించారు. అనంతరం మానసిక వికలాంగులకు వారు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ వి భరత్ కుమార్, పాస్టర్ బి అబ్రహం, పాస్టర్ ఎన్ జాకబ్ శాంతి నిలయం నిర్వాహకురాళ్లు సిస్టర్ ఆల్ఫీ, సిస్టర్ బిజిలి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మనదే

- సింగరేణి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు
- కొత్తగూడెం ఏరియాలోని పర్యటించిన సింగరేణి చైర్మెన్ ఎన్.బలరామ్



నవతెలంగాణ-కొత్తగూడెం

రోజు రోజుకు వస్తున్న పర్యావరణ మార్పులనుండి మనం కాపాడుకుంటూ, పర్యావరణాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మనదేనని సింగరేణి చైర్మెన్ ఎన్.బలరామ్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం ఏరియాలో పర్యటించి సింగరేణి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. చుంచుపల్లి మండలంలోని పెనగడప గ్రామం సింగరేణి ప్రభావిత గ్రామంలో గుర్తించి రెమిడీయేషన్ ప్లాన్ అండ్ నేచురల్ కమ్యూనిటీ రిసోర్స్ అగ్మెంటేషన్ ప్లాన్ ఫండ్స్‌తో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. పెనగడప గ్రామంలో పర్యటించి సింగరేణి సంస్థ ద్వారా జరిగిన, జరుగుతున్నటువంటి అభివృద్ధి పనులను (ప్రభుత్వ పాఠశాల సివిల్ మరమ్మతు పనులు, ఫర్నిచర్, సీసీ రోడ్లు, రోడ్డు సైడ్ కాలువలు, రహదారుల వెంబడి సోలార్ లైట్లు, ఆర్ఓ వాటర్ ప్లాంట్స్, చెత్త తీసుకొనుటకు వాహనాలను, వివిధ హరితహారం ద్వారా మొక్కలు నాటిన పనులు సంబంధిత అధికారులతో వెళ్లి సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మెన్ బలరామ్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలను అభివృద్ధి పరచడంలో ఎప్పుడు ముందుంటుందని అలాగే పర్యావరణాన్ని పరిరక్షించడం కూడా ముఖ్య బాధ్యతగా భావించి వివిధ రకాల మొక్కలను, ప్లాంటేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. పెనగడపలోని పార్కును సందర్శించారు. పెనగడప గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) డైరెక్టర్ (పా) జి.వెంకటేశ్వర్ రెడ్డి, జిఎం (సిడిఎస్) ఎస్.కె సుభాని, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు, జిఎం (ఎఫ్ అండ్ ఎ) ఎం.సుబ్బారావు, కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ కె.రాములు, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, ఎస్ఓ టు జిఎం జీవీ కోటిరెడ్డి, ఎజిఎం (సివిల్) సిహెచ్. రామకృష్ణ, డిజిఎం (పర్సనల్) బి.శివ కేశవరావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ జీకే ఓసి ఎం.శ్రీరమేష్, ఎస్ఓఎం ఎన్విరాన్మెంట్ తోట.సత్యనారాయణ, మేనేజర్ జికేఓసి ఎం.రామచంద్ర మురళి, జీకేఓసి ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ వి.మధుకర్, ఐటీ మేనేజర్ కే.శేషశ్రీ, సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ బి.తౌరియా, యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు : ఎమ్మెల్యే



నవతెలంగాణ-కొత్తగూడెం

క్రైస్తవ కుటుంబాలకు కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పేద, ధనిక తరతమ్యం లేకుండా క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. యేసు క్రీస్తు చూపిన శాంతి, ప్రేమ మార్గాన్ని ఎంచుకొని సమాజంలో ప్రతి ఒక్కరు సోదర భావంతో మెలిగితే సమాజంలో శాంతిని నెలకొల్పినవారమవుతామని, ప్రజా స్వామ్య భారత దేశంలో ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ మత సామరస్యాన్ని చాటాలని ఆకాంక్షించారు.



మునగ సాగును పరిశీలించిన వ్యవసాయ సంచాలకులు

నవతెలంగాణ-దమ్మపేట

మండల పరిధిలోని నల్లకుంట ప్రాంతంలో ఓ రైతు పొలంలో సాగు చేస్తున్న మునగ సాగుకు వ్యవసాయ సహాయ సంచాలకులు రవికుమార్ సందర్శించారు. మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి రైతు తాళ్ళ శంకర్‌రావు సాగుచేస్తున్న పంటను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు మునగ సాగు ఒక వరమని అన్నారు. మునగ సాగును చేసేందుకు రైతులు ప్రోత్సహించేందుకు గాను ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పలు సబ్సిడీలు అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా అన్ని రకాల ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. నేషనల్ హెల్త్ ప్రోగ్రాంల అన్ని ఇండికేటర్లలో 100% అచీవ్మెంట్ సాధించాలని ఆదేశించారు. సికెల్ సెల్ స్క్రీనింగ్, సికిల్ సెల్ కార్డ్స్ త్వరగా డిస్ట్రిబ్యూషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ బాలాజీ నాయక్, మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారులు డాక్టర్ శివ కుమార్, డాక్టర్ నిశాంత్ రావు, పీహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

కల్వకుంట్ల కవిత కృషి ఫలితమే

సింగరేణి కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి సంస్థ నందు పని చేస్తున్న క్రిస్టియన్ కార్మికులకు క్రిస్మస్ నాడు వేతనంతో కూడిన సెలవుగా టిబిజికెఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ద్వారా సాధించడం జరిగిందని ఏరియా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు తెలియచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన టిబిజికెఎస్ గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్న సమయంలో కల్వకుంట్ల కవిత ప్రత్యేక చొరవ చూపి హిందువులకు సంక్రాంతి నాడు, ముస్లింలకు రంజాన్ పండుగ, క్రిస్టియన్‌లకు క్రిస్మస్ కు వేతనంతో కూడిన సెలవు దినం (ఆప్షనల్ హాలీడే) సాధించడం జరిగిందని తెలిపారు. అత్యవసర విభాగాల్లో పనిచేసే క్రిస్టియన్ కార్మికులు క్రిస్మస్ విధులు నిర్వహిస్తే మూడు మస్టర్‌ల వేతనం వర్తిస్తుందని తెలిపారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ముత్యాలమ్మ అమ్మవారికి వెండి గరిగ అందజేత

నవతెలంగాణ -దుమ్ముగూడెం

దుమ్ముగూడెం గ్రామంలో గల శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి రూ.2 లక్షల విలువచేసే వెండి గరిగను మంగళవారం భక్తులు అందజేశారు. గ్రామానికి చెందిన కరేళ్ల సుందర రామకృష్ణారావు, రాజరాజేశ్వరి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్తెలు నట్ల సుమతి, నాయుడు హిమ, మోటుపల్లి నీలిమ, కరేళ్ల పూర్ణిమ, కరేళ్ల భాను శ్వేతలు ఆలయ అధ్యక్షులు చుక్క గణేష్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంచినీటి సౌకర్యం కోసం 30 వేలు వితరణ

దుమ్ముగూడెం గ్రామంలో గల శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద మంచినీటి సౌకర్యం కోసం రేగుబల్లి గ్రామానికి చెందిన తోటమల్ల సంగీతరావు దంపతులు రూ. 30 వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిల ద్వారా వచ్చే నీటిని మంగళవారం తోటమల్ల సంగీతరావు దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి బైరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

త్రివేణిలో ఘనంగా ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

స్థానిక లక్ష్మీదేవిపల్లిలో గల త్రివేణి పాఠశాలల ప్రాంగణంలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సహోదర భావాలని కలిగి ఉండాలని, మతమేదైనా మానవహితమే ప్రబోధిస్తుందని పాఠశాలల డైరెక్టర్ డాక్టర్. గొల్లపూడి వీరేంద్ర చౌదరి అన్నారు ఈ కార్యక్రమంలో గొల్లపూడి జగదీష్, సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళి కృష్ణ, ప్రిన్సిపల్స్ శ్రీనివాస్ సింగ్, వై.వి సురేష్, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య ఫాతిమా, పాల్గొన్నారు.

వాసవి క్లబ్ మండల అధ్యక్షులుగా బాలగంగాధర్

నవతెలంగాణ-అశ్వారావుపేట

2025 సంవత్సరానికి గానూ వాసవి క్లబ్ (కేసీజీఎఫ్) మండల అధ్యక్షులుగా సత్యవరపు బాలగంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ క్లబ్ రీజనల్ చైర్మెన్ భోగవల్లి రాంబాబు పర్యవేక్షణలో స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆ సంఘం మండల కమిటీ బాలగంగాధర్‌ను అధ్యక్షులుగా, కార్యదర్శిగా కొణిజర్ల ఉమామహేశ్వరరావును, కోశాధికారిగా రావిక్రింది కుమార్ రాజాను ఎన్నుకున్నారు. బాలగంగాధర్ స్థానిక ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం, రాజకీయ పరపతి కలిగి ఉన్నారు. ఉమామహేశ్వరరావు ఆర్యవైశ్య ప్రముఖులే కాక ఔషధ దుకాణం యజమానులు సంఘంలో బాధ్యులుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో జల్లిపల్లి దేవ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాల గ్రామపంచాయతీని విభజించకండి

గ్రామస్తుల వినతి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని పర్ణశాల గ్రామపంచాయతీని రెండుగా విభజించ వద్దని కోరుతూ పంచాయతీ ప్రజలు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. మండలంలో అతి పెద్ద పుణ్యక్షేత్రంగా ఉన్న పర్ణశాల గ్రామపంచాయతీని విచ్ఛిన్నం చేసి పర్ణశాల రామాలయ అభివృద్ధిని అడ్డుకోవద్దని వినతి పత్రంలో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ విచ్ఛిన్నం కావడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని, పుణ్యక్షేత్రమైన పర్ణశాల ఈ గ్రామ పంచాయతీలో ఉండడంతో ఎన్నో రకాల వేలం పాటల ద్వారా ఆలయ అభివృద్ధికి ఈ ప్రాంత ప్రజానీకం తోడ్పాటును అందిస్తున్నారని అన్నారు. తద్వారా గ్రామపంచాయతీలో శానిటేషన్, మంచినీటి సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుందని, పంచాయితీ విచ్ఛిన్నం కావడం వలన గ్రామపంచాయతీలో అన్ని ప్రాంతాలు అభివద్ధికి నోచుకోక ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉన్నందున ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో తెల్లం హరికృష్ణ, చింతం రమేష్, పూణెం భూపతిరావు, లక్ష్మీనర్సు, నరసింహారావు, కనకారావు, వెంకటేశ్వరరావు, యుగంధర్ ఉన్నారు.

సీపీఐ వంద వసంతాల ఉత్సవాలను జయప్రదం చేయండి

నవతెలంగాణ - బోనకల్

ఖమ్మంలో ఈనెల 26న నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) 100 వసంతాల ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు కోరారు. మండలంలోని మోటమర్రి సీపీఐ శాఖ సమావేశం శాఖ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26 న ఆవిర్భవించి 2025 డిసెంబర్ 26 నాటికి 100 సంవత్సరంలోకి అడుగుపెడుతున్నదని, ఈ సందర్భంగా ఖమ్మంలో భారీ స్థాయిలో సభను నిర్వహించనున్నట్లు, ఈ సభకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు పాల్గొని విజయవంత చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సీపీఐ నాయకులు వంగాల కృష్ణ, మందా కృష్ణారావు, మరీదు శ్రీను, బుర్రి రామకృష్ణ తదిరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహాసభల వాల్ పోస్టరావిష్కరణ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

నల్లగొండలో జరిగే యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మండల పరిధిలో గల వివిధ పాఠశాలల నందు సంఘం జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి నంద్రు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు, కోశా ధికారి నీలం సైదారావు, మండల కార్యదర్శి టి అనితా రెడ్డిలు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ నాయకులు సురేష్, చలం, ఎం.శ్రీనివాసరావు, బి.రాజారావు, పుల్లారావు, ఇందిరా, ఎస్.వెంకమ్మ,జీవన్, ఖాజా మొహిద్దిన్, నాగరాజు, ఎం.నాగేశ్వరరావు, సత్యనారాయణ, సుబ్బరామరాజు, శీలం రత్నకుమారి, నవీన్, నరసింహారావు, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన డైరీని ఆవిష్కరించిన బార్ అసోసియేషన్

నవతెలంగాణ-మధిర

మధిర కోర్టులో సుప్రీం కోర్టు బార్ కౌన్సిల్ సభ్యులు పి.విష్ణువర్ధన్ రెడ్డి రూపొందించిన 2025 సంవత్సరానికి సంబంధించిన నూతన డైరీలను మంగళ వారం బార్ అసోసియేషన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.పుల్లారావు, సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, దిరిశాల జగన్ మోహన్‌రావు, నంబూరి జనార్ధనరావు, చింతల గోపాల్, కట్టా పూర్ణచంద్రరావు, కావూరి రమేష్, కోటా జ్ఞానేష్, నెల్లూరి రవి, జే రమేష్, ఎం.సతీష్, కె.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందర్భంగా ముస్తాబైన ప్రార్థనా మందిరాలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబైన ప్రార్థన మందిరాలు ఎర్రుపాలెం మండల పరిధిలో గల అన్ని ప్రార్థన మందిరాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించుకోనున్నారు. బనిగండ్లపాడు గ్రామంలో గల ఆర్సీఎం చర్చి విచారణ గురువులు ఫాదర్ కొప్పుల శౌరి మాట్లాడుతూ తోటి వారిని ప్రేమించి ఉన్నదాంట్లోనే పేదవారికి సహాయం చేస్తూ మనుషుల మధ్య ప్రేమానురాగాలు కలిగి సుఖ సంతోషాలతో పిల్లా పాపలతో సంతోషంగా జీవించాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిస్టర్స్, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చావా రాజ్యలక్ష్మి మృతి ప్రజాతంత్ర ఉద్యమాలకు నష్టం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని మాతృమూర్తి చావా రాజ్యలక్ష్మి మృతి ప్రజాతంత్ర ఉద్యమాలకు తీవ్ర నష్టమని పేర్కొంటూ ఆమె మృతికి టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. చావా రాజ్యలక్ష్మి తన ముగ్గురు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించి, ఉన్నత ఆశయాల వైపు పయనింపజేశారని పేర్కొన్నారు. వారి కుటుంబం వివిధ ప్రజాతంత్ర ఉద్యమాలకు అండగా నిలబడిందని తెలిపారు. రాజ్యలక్ష్మి మరణం బాధాకరమని జిల్లా కమిటీ ఒక ప్రకటనలో తెలియజేసింది. పేద పిల్లల చదువులు, పేదల విద్యాభివృద్ధి కోసం ఆమె కృషి చేశారని పేర్కొంది. గ్రంథాలయం నిర్వహిస్తూ అనేక వందల మంది పిల్లలకు అండగా నిలిచారని, నేటి సమాజం రాజ్యలక్ష్మిని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, పూర్వ జిల్లా అధ్యక్షులు జీవీ నాగమల్లేశ్వరరావు, బుర్రి వెంకన్న, షమీ, వల్లంకొండ రాంబాబు , రాందాస్ పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన భట్టి

నవతెలంగాణ-వైరా



స్నానాల లక్ష్మీపురం గ్రామాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంగళవారం సందర్శించారు. స్వగ్రామంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను ఎంఎల్‌ఏ రాందాస్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో మూడు కోట్ల 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మాణం చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. తర్వాత అధికారులతో మాట్లాడారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్డింగ్ నిర్మాణ పనులకు అడ్డంకిగా ఉన్న విద్యుత్తులైన్లను వెంటనే మార్చాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నూతి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీల వెంకట నర్సిరెడ్డి, దొడ్డ పుల్లయ్య, మల్లు రామకృష్ణ, ఏదునూరు సీతారాములు, పొదిలి హరినాథ్, వడ్డే నారాయణ, పమ్మి అశోక్, పనితి శీను, పలు శాఖల అధికారులు మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

- రెవెన్యూలోకి పూర్వ వీఆర్వోలను తీసుకోవడం మా అదృష్టం
- విలేకరుల సమావేశంలో తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరిక ఉపేందర్‌రావు

నవతెలంగాణ-ఖమ్మం



గత ప్రభుత్వ పాలనలో గ్రామ రెవెన్యూ వ్యవస్థ రద్దు కావడంతో రెండున్నర సంవత్సరాలుగా మానసిక వేదనతో ఆందోళనలో ఉన్న రాష్ట్రవ్యాప్తంగా 5,139 మంది వీఆర్వోల కుటుంబాలకు అండగా నిలుస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం విఆర్ఓలను రెవిన్యూలోకి ఆప్షన్ పద్ధతిలో తీసుకుంటూ నిర్ణయించడం చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరిక ఉపేంద్ర రావు అన్నారు. మంగళవారం ఖమ్మంలోని టీటీడీసీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వానికి యావత్ వీఆర్వోల కుటుంబాలు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. గత ప్రభుత్వం వీఆర్వోలను రెవెన్యూ శాఖ నుంచి విడదీయడమే కాకుండా గ్రామస్థాయి రెవిన్యూ రద్దు చేసి వీఆర్వోల భవిష్యత్తును అంధకారంలో నెట్టిందని ఆరోపించారు. నాటి నుండి నేటి వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ రెవెన్యూ అధికారులు అనేక దఫాలుగా ఆందోళనలు నిరసనలు తెలిపినా గత ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవని అవినీతిపరులుగా గ్రామ రెవెన్యూ అధికారులను చిత్రీకరించి అవమానులకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థ బలోపేతంలో సమస్త విఆర్ఓలకు ఆప్షన్ పద్ధతిలో తీసుకోవడానికి కృషి చేసిన వారికి ప్రతి ఒక్కరికి తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బంక కృష్ణ, షేక్ జానీమియా, వజ్జ రామారావు, చర్ల శ్రీనివాస్, ధరావత్ భాస్కర్, కిషోర్, నెల్లూరు లవన్‌కుమార్, బంక భాస్కర్, శ్రీ వాణి, మల్లీశ్వరి, వాంకుడోత్ వెంకన్న, వస్త్రం ధన్నూరి బాలరాజు, చిట్టి మల్ల నాగేశ్వరరావు, చీమల నాగేంద్ర బాబు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి భాయి

నవతెలంగాణ-ఖమ్మం



వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని సేవలు అందజేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి భాయి అన్నారు. మంగళవారం మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 16వ డివిజన్ ధంసలాపురం కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కాలనీ ప్రజలకు రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వ్యాధులకు మందులను అందజేశారు. వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి భాయి సందర్శించి వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని సేవలు అందజేయాలని కోరారు. అనంతరం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ధంసలాపురం కాలనీ సందర్శించి మున్నేరు వరదలు వచ్చి పాడైపోయిన పరికరాలు, రికార్డులు అన్ని ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ సైదులు, డిపిఓ మేకల దుర్గ, దంశలాపురం కాలనీ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారి డాక్టర్ విష్ణు సింగ్, కమ్యూనిటీ హెల్త్ అధికారిని గోలి రమాదేవి, ఆరోగ్య పర్యవేక్షకులు తాళ్లూరి శ్రీకాంత్, హెల్త్ అసిస్టెంట్స్ రాధా, సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మినిమం టైం స్కేల్ వర్తింపు చేయాలి

- డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షులు పేరెల్లి శ్రీను

నవతెలంగాణ- ఖమ్మం

గత 10 సంవత్సరాలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పని చేస్తున్న వారికి "మినిమం టైం స్కేల్" వర్తింపచేయాలని ఖమ్మం జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షులు పేరెల్లి శ్రీను కోరారు. జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేసిన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకుల బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా ఈ వ్యవస్థలో పనిచేస్తున్నామని, గంటల ప్రాతిపదికన వేతనాలు చెల్లించటం వల్ల తాము తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులను ఎదుర్కుంటున్నామని, దీనివల్ల అప్పులు పాలవుతున్నామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిరక్షణలో అతిథి అధ్యాపకులు ప్రధాన భూమిక పోషిస్తున్నారని అన్నారు. కళాశాలల అడ్మిషన్స్ పెంచటంలో, విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాదించటంలో, విద్యార్థులు ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందడంలో చేస్తున్న తమ కృషికి ప్రభుత్వం ఆదరించాలని కోరారు. తమకి ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి త్వరగా పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముసుగు రాజీరెడ్డి, కొమ్ము జల్ అభిజిత్ దేవ్, జెల్లా రాంప్రసాద్, ఖమ్మం జిల్లా జనరల్ సెక్రటరీ కొమ్ము నవీన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మినేని వీరన్న, కోశాధికారి వనం పుల్లారావు, జిల్లా సీనియర్ అధ్యాపక సభ్యులు దుర్గ భవాని చౌదరి, రోహిణి, అప్పారావు, శ్రీనివాసరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

- 28, 29, 30 తేదీల్లో నల్లగొండలో రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు
- ముఖ్యఅతిథులుగా మండలి చైర్మెన్ గుత్తా, మంత్రి కోమటిరెడ్డి

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర ఆరో విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈనెల 28, 29, 30 తేదీల్లో నల్లగొండలో ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక యూటీఎఫ్ భవన్ లో మహాసభల పోస్టర్ ను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం దుర్గాభవాని, నాగేశ్వరరావు మాట్లాడారు. 28వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఉపాధ్యాయుల మహాప్రదర్శనతో మహాసభలు ప్రారంభమవుతాయని చెప్పారు. ముఖ్యఅతిథులుగా శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హాజరవుతారని వివరించారు. విశిష్ట అతిథులుగా విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఇ.వి. నరసింహారెడ్డి హాజరవుతారని అన్నారు. అదే రోజు మధ్యాహ్నం నిర్వహించే విద్యా సదస్సులో సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, ప్రముఖ మీడియా విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, జేఎన్‌యూ విద్యార్థి సంఘం పూర్వ అధ్యక్షులు ఐషీ ఘోష్ ప్రసంగిస్తారని వివరించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ప్రారంభిస్తారని తెలిపారు. ఈనెల 29,30 తేదీల్లో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. గత రెండేండ్ల కాలంలో విద్యారంగంలో నెలకొన్న పరిణామాలు, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చిస్తామని అన్నారు. విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలపై అవసరమైన తీర్మానాలు, కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు.

ప్రభుత్వ విద్యారంగం బలోపేతమే లక్ష్యం

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతమే లక్ష్యంగా మహాసభల్లో చర్చించి తగు నిర్ణయాలు, తీర్మానాలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు, కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయులు గత 14 రోజులుగా సమ్మెలో ఉన్నా వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రిక సంపాదక వర్గ సభ్యులు జీవీ నాగమల్లేశ్వరరావు, జిల్లా నాయకులు బుర్రి.వెంకన్న, షమీ, వల్లంకొండ రాంబాబు, మండవ. నర్సయ్య, బానోత్ రాందాస్, ధర్మసోత్ నాగేశ్వరరావు, వి.వి.రామారావు, పెనబాక సురేష్, గుగులోత్.రామకృష్ణ, కట్టా పద్మ, అనుమోలు కోటేశ్వరరావు, కోడిసేన విజయ్ కుమార్, దొడ్డా ఉమామహేశ్వర రెడ్డి, నారపోగు సుధాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్

నవతెలంగాణ-ఖమ్మం

హత్య కేసులో ఆరుగురు నిందితులకు జీవిత ఖైదు శిక్ష, మరొకరికి ఐదు సంవత్సరాలు శిక్ష పడేలా సాక్ష్యాధారాలు సేకరించి పకడ్బందిగా చర్యలు చేపట్టిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించి రివార్డ్ అందజేశారు. 2019 సెప్టెంబర్ 10న రాజకీయ వివాదాల కారణంగా పెనుబల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రహ్మళకుంటలో జరిగిన హత్య కేసులో ఆరుగురికి జీవిత ఖైదు, రూ.10వేల జరిమానా, ఒకరికి ఐదేళ్ల జైలుశిక్ష రూ.5వేల జరిమానా విధిస్తూ సత్తుపల్లి కోర్టులో జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీనివాస్ ఇటీవల తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఇన్స్‌పెక్టర్ టి.రవికుమార్, ఎస్సై నాగరాజు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అబ్దుల్ బాషా, కోర్టు డ్యూటీ ఆఫీసర్ (కానిస్టేబుల్) గిరి, హెూంగార్డు సురేష్ బాబు అభినందించారు.

పేదలకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ -బోనకల్

మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 400 మంది వితంతు మహిళలకు గ్రేస్ సర్వీస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో దుస్తులను పంపిణీ చేశారు. ఈ దుస్తులను మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య, ఎంపీడీవో రురావత్ రమాదేవి, ఎస్సై కడకండ్ల మధుబాబు, గిర్దవర్ గుగులోతు లక్ష్మణ్, మాజీ జెడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 1500 మంది నిరుపేదలను గుర్తించినట్లు సిజిఎం చర్చి ఫాదర్ దాసరి ఎర్నెస్ట్ పాల్ తెలిపారు. తొలుత మండల వ్యాప్తంగా ఎంపిక చేసిన 400 మంది మహిళలకు ఈ దుస్తులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. రెండు రోజుల క్రితం ఖమ్మం పట్నంలో 500 మంది పాస్టర్లకు దుస్తులు, బియ్యం, నిత్యావసర సరుకులను గ్రేస్ సొసైటీ వారు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. వీటిని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, ఖమ్మం మేయర్ పూనకొలను నీరజ పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ, ఎంపీడీవో మాట్లాడుతూ సీజీఎం చర్చి ఫాదర్ ఎర్నెస్ట్ పాల్ కృషితో గ్రేస్ సర్వీస్ సొసైటీ వారు నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

ఆదివాసీ మహిళలకు 'చేతన' చేయూత

- 'పోలీసులు మీ కోసం'లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ
- చేతన పౌండేషన్ నిర్వాహకులకు ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు కృతజ్ఞతలు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా పేద ఆదివాసి మహిళలకు ఖమ్మంలోని చేతన ఫౌండేషన్ సహకారంతో ఉచితంగా 35 కుట్టుమిషన్లను ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు జైనూర్ మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్ లో మంగళవారం పంపిణీ చేశారు. ఆదివాసి ప్రజల అభివృద్ధికి పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా పోలీసులు విధులు నిర్వర్తిస్తారని, ప్రజా భద్రతతో పాటు వారి సంక్షేమం గురించి కూడా పోలీసులు పాటుపడతారని అన్నారు. ఇదివరకే దర్జీ ట్రెనింగ్ ను పూర్తిచేసుకుని మిషన్ల కోసం ఎదురుచూస్తున్న పేద మహిళలు ఎస్సై రామారావును కలిసి సమస్య వివరించారు. ఆయన దానిని జిల్లా పోలీసు ఉన్నతాధికారి దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే ఎస్పీ చేతన ఫౌండేషన్ వారి సహకారం కోరారు. ఈ మేరకు ఫౌండేషన్ నిర్వాహకులు 35 కుట్టుమిషన్లను సమకూర్చారు. జిల్లా కలెక్టర్ ను సంప్రదించి హాస్టల్ లేదా స్కూళ్లలో విద్యార్థులకు యూనిఫామ్ లు కుట్టే విధంగా చూస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఆదివాసీలను అభివృద్ధి వైపు పయనించేలా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఎస్పీ తెలిపారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తమ గ్రామంలో కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. చేతన ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చేతన ఫౌండేషన్ ద్వారా ఇదివరకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మునుముందు కూడా పోలీస్ సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఎస్పీతో పాటు చేతన పౌండేషన్ నిర్వాహకులను ఆదివాసీ మహిళలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణాకర్, జైనూర్ సీఐ రమేష్, ఎస్సైలు రామారావు, రామన్ కుమార్, సందీప్, చేతన ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, గణేష్, నవీన్, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామ పంచాయతీని అభివృద్ధి చేస్తాం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-రఘునాథపాలెం



మండల పరిధిలోని కొర్లబోడు తండా గ్రామపంచాయతీలో 16 లక్షల వ్యయంతో 3 అంతర్గత సిసి రోడ్ల శంకుస్థాపన కార్యక్రమాన్ని మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. రఘునాథపాలెం కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ భూక్యా చిన్నయ్య నాయక్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందించి వెంటనే వివిధ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బాణోత్ భీంల, ధరవత్ భద్రు, భూక్యా పుల్యా, భూక్యా రాంకు, భూక్యా వెంగల్, దారవత్ క్రిష్ణ, ధరవత్ రవి, భూక్యా భాస్కర్, భూక్యా మల్సూర్, బాణోత్ నరేష్, భూక్యా చంద్ర శేఖర్, బాణోత్ రామారావు తదితరులు పాల్గొన్నారు.



రెజొనెన్స్‌లో క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొండా కృష్ణవేణి, ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రెజొనెన్స్ పాఠశాలలో క్రిస్మస్ సంబరాలు



ఖమ్మం శ్రీనివాసనగర్‌లో రెజొనెన్స్ పాఠశాలలో క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్స్ ఆర్.వి.నాగేంద్రకుమార్, నీలిమా ప్రసంగించారు. అనంతరం పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపించి, వారితో మాట్లాడి ఎంతో సంబురంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులచే ప్రదర్శనలు, కార్యక్రమాలు చేయించి ఈ సంబురాన్ని ఆనందోత్సాహాలతో నిర్వహించారు.

'బ్లూమింగ్ మైండ్స్'లో క్రిస్మస్ వేడుకలు



నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి.అశోక్ రెడ్డి, ప్రిన్సిపల్ వి.కిరణ్ కుమార్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'స్మార్ట్ కిడ్జ్'లో క్రిస్మస్ వేడుకలు



నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత క్రిస్మస్ కేక్ కటింగ్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడారు. క్రిస్మస్ విశిష్టత తెలిసేలా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మేరి, శాంతాక్లాజ్, షెపర్డ్, వైజ్ మ్యాన్ వేషధారణలో పిల్లల ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలి

- ఫోరం సలహాలు, సూచనలు తప్పక పరిగణనలోకి తీసుకుంటాం : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

వినియోగదారుల రక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం 1986 డిసెంబర్ 24న అమలులోకి వచ్చిందనీ, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి వారి ఫోరమ్స్ చక్కగా పనిచేస్తున్నాయన్నారు. డిజిటల్ విధానం, వర్చువల్ విచారణల ద్వారా వినియోగదారులకు సత్వర న్యాయమందేలా సంఘాలు పనిచేయాలని సూచించారు. వినియోగదారులు ఆహార పదార్థాలు, నగలు, ఇతర ఏ వస్తువుయినా కొనుగోలు చేసేటప్పుడు ధర, నాణ్యతా ప్రమాణాలు తెలుసుకొని కొనుగోలు చేయాలన్నారు. అన్యాయం జరిగితే సత్వరమే వినియోగదారుల ఫోరమ్‌లో అర్జీ దాఖలు చేసి న్యాయ పరంగా నష్ట పరిహారం పొందాలన్నారు. ప్రజలతో పాటు పాఠశాల, కళాశాల విద్యార్థులకు వినియోగదారుల చట్టాలపై చైతన్యం కల్పించాలన్నారు. ముఖ్యంగా ఆహార తనిఖీలలో శాఖాధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టలన్నారు. నకిలీ వస్తువుల మోసాల నుంచి బయటపడాలంటే వినియోగదారులలో చైతన్యం అవసరమన్నారు. అంతకుముందు తూనికలు కొలతల శాఖ ఏర్పాటు చేసిన వివిధ రకాల వస్తువుల స్టాల్‌లను సందర్శించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డీసీఎస్‌వో రమేష్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అరుణ్ సాయి, తూనికలు-కొలతల శాఖ అధికారి శివానంద్, ఆరోరా కళాశాల ప్రొఫెసర్ అర్జున్ రావు, వివిధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాలకు సూచనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ రచనలను ప్రోత్సహించడానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏటా సాహితీ పురస్కారాలను ప్రదానం చేస్తున్నది. గతేడాది ప్రదానం చేసే పురస్కారాల ఎంపికకు పాఠకులు, రచయితల నుంచి సూచనలను కోరుతున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రక్రియల్లో 2020 జనవరి నుంచి 2022 డిసెంబర్ మధ్యకాలంలో తొలిసారిగా ప్రచురణ పొందిన గ్రంథాల్లో పాఠకులు ఉత్తమంగా భావించిన వాటిని పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. రచయిత మరణించినప్పటికీ వారి రచనలు 2020 జనవరి నుంచి 2022 డిసెంబర్ మధ్య కాలంలో ప్రచురణ పొంది ఉంటే సూచించొచ్చని తెలిపారు. గేయ కవిత ప్రక్రియలో మాత్రం 2018 నుంచి 2022 మధ్య ప్రచురణ పొందిన గ్రంథాలను సూచించొచ్చని వివరించారు. దరఖాస్తులను రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్-500004 చిరునామాకు వచ్చేనెల 20వ తేదీలోగా పంపాలని కోరారు.

దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులుగా పవన్ కుమార్ ఎన్నిక



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

దక్షిణాది రాష్ట్రాల అటవీ అధికారుల సమాఖ్య అధ్యక్షులుగా గజ్వేల్ అటవీ సెక్షన్ అధికారి పవన్ కుమార్ ఎన్నికయ్యారు. అదేవిధంగా అఖిల భారత అటవీ అధికారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన డిప్యూటీ రేంజ్ అధికారి మహమ్మద్ మోజం అలీ ఖాన్, ఆల్ ఇండియా జాయింట్ సెక్రెటరీగా మెదక్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఆజం హుస్సేన్ ఎన్నికయ్యారు. మంగళవారం ఢిల్లీ విజ్ఞాన భవన్‌లో జాతీయ అటవీ అధికారుల సమాఖ్య ఎన్నికలు జరిగాయి. ఇందులో పవన్ కుమార్ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. జాతీయ కార్యవర్గంలో పవన్ కుమార్‌కు అవకాశం దక్కడం ద్వారా అటవీ అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి మార్గం సుగుమమైందని అటవీ అధికారుల సంఘం, అటవీ శాఖ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

శానిటైజర్ పేలి ఇద్దరికి గాయాలు

- ప్రభుత్వాస్పత్రికి తరలింపు

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

నారాయణపేట జిల్లా మద్దూరు మండలం మద్దూరు గ్రామంలోని మ్యాతరి భాస్కర్(24) ఇల్లును శుభ్రం చేసే క్రమంలో ఇంటిలో ఉన్న ఐదు లీటర్ల డబ్బాలో ఉన్న హ్యాండ్ శానిటైజర్ బయటికి పడవ వేస్తుండగా డబ్బా పేలింది. దీంతో అందులో ఉన్న శానిటైజర్ పక్కనేఉన్న మోనపురం రాజు(12), డబ్బు బన్నీ(12)పై పడి తీవ్ర గాయాలయ్యాయి. శానిటైజర్ కండ్లల్లో పడింది, ముఖంపై, చేతులపై పడటంతో పాటు తల వెంట్రుకలు కూడా కాలిపోయాయి. ప్రైవేట్ పార్ట్స్ కూడా తీవ్ర గాయాలయ్యాయి. పేలిన శబ్దానికి సుమారు ఒక కిలోమీటర్ వరకు శబ్దం వినిపించడంతో ప్రజలు భయాందోళన చెందారు. పక్కనే ఉన్న పోలీసులు శబ్దం విని ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. గాయాలైన వారిని మద్దూర్‌లో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. అనంతరం నారాయణపేట ఏరియా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ టీచర్లను కేజీబీవీలకు పంపొద్దు


- డీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు, మండల విద్యా వనరుల కేంద్రం, ఇతర జిల్లా, రాష్ట్ర కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు 15 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారని డీటీఎఫ్ అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి మంగళశారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి స్థానంలో ఇతర ఉపాధ్యాయులు, ఉద్యోగులను నియమించడం సరి కాదని పేర్కొన్నారు. వెంటనే సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు.

రైతు చేతివేళ్లు నరికిన దుండగులు

- కరీంనగర్ జిల్లా వీణవంకలో ఘటన



నవతెలంగాణ-వీణవంక :

దుండగులు రైతు చేతి వేళ్లను నరికిన ఘటన కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో మంగళవారం జరిగింది. హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన మారం వెంకట రాజిరెడ్డి(56) రోజువారీగానే మంగళవారం తన పొలం వద్దకు వెళ్లాడు. మొక్కజొన్న చేనుకు నీరుపెడుతుండగా అదే సమయంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు అతడిపై కత్తులతో దాడి చేశారు. ఈ ఘటనలో రాజిరెడ్డి ఎడమ చేయి మట్టపై తీవ్రంగా గాయమైంది. బాధితుడి భార్య మారం విజయ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ఆ బడులు తెరుచుకునేదెప్పుడు?

అత్యధికంగా నల్లగొండ జిల్లాలోనే..

- గ్రామీణ బడులకు మంచి రోజులు వచ్చేదెప్పుడో?
- విశ్వాసం కల్పించే దిశగా చర్యలు ఉండాలని ప్రభుత్వానికి సూచనలు

రాష్ట్ర వ్యాప్తంగా 1819 స్కూళ్లు సున్నా నమోదుతో బంద్



నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

భారత రాజ్యాంగం అందించిన హక్కుల ప్రకారం ప్రాథమిక విద్య ప్రతి ఒక్కరి హక్కు. 6-14 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ నాణ్యత గల ఉచిత నిర్బంధ విద్యను అందించాలని బాలల హక్కు చట్టం (2009) నిర్దేశిస్తుంది. విద్యతోనే జీవన ప్రమాణాలు మారుతాయి. కానీ, రాను రానూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ విద్య కునారిల్లుతోంది. సౌకర్యాల మెరుగుదల లేక, విద్యార్థుల నమోదుకు ప్రోత్సాహకం లేక.. విద్య కార్పొరేటీకరణ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతూ వచ్చాయి. దశాబ్దాల కాలంగా ఎన్నో పాఠశాలలు మూతపడ్డాయి. మూతబడిన పాఠశాలలను తెరిపిస్తామని ప్రస్తుత ప్రభుత్వం చెప్పినా.. ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. పది సంవత్సరాలుగా ఉపాధ్యాయ ప్రమోషన్స్, బదిలీలు, నూతన నియామకాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యాశాఖలో.. 2024లో జరిగిన డీఎస్సీ నియామకాలతో అయినా మూతపడిన పాఠశాలలు తెరుచుకుంటాయని తల్లిదండ్రులు ఆశపడ్డారు. నల్లగొండ జిల్లాలో 606, సూర్యాపేట 306, యాదాద్రి భువనగిరిలో 277.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 1189 ఉపాధ్యాయ పోస్టులను వివిధ కేటగిరీల్లో డీఎస్సీ ద్వారా భర్తీ చేశారు. కానీ మూతపడిన పాఠశాలలను మాత్రం పున:ప్రారంభించలేదు.

ప్రస్తుతం పాఠశాలల పరిస్థితి

రాష్ట్ర వ్యాప్తంగా 1819 జీరో స్కూల్స్‌గా ఉన్నాయనేది అధికార వర్గాల సమాచారం. విద్యార్థులు లేరని, మరికొన్ని చోట్ల పదికంటే తక్కువ మంది విద్యార్థులు ఉన్నారని అధికారులు చెబుతున్నారు. నల్లగొండ జిల్లా పరిధిలో ప్రాథమిక పాఠశాలలు 877, ప్రాథమికోన్నత పాఠశాలలు 208 ఉన్నాయి. సూర్యాపేట జిల్లా పరిధిలో ప్రాథమిక పాఠశాలలు 472, ప్రాథమికోన్నత 66, ఉన్నాయి. యాదాద్రి-భువనగిరి జిల్లా పరిధిలో ప్రాథమిక 481, ప్రాథమికోన్నత పాఠశాలలు 68 ఉన్నాయి. అయితే, 1189 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయినా నేటికీ మూతపడిన పాఠశాలలు తెరుచుకోకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు అటువైపు చూసిన దాఖలాలు లేవు. రాష్ట్ర వ్యాప్తంగా మూతపడిన ప్రభుత్వ పాఠశాలల్లో నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో ఉంది. నల్లగొండ జిల్లా 274 బడుల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్‌తో మొదటి స్థానంలో ఉంది. సూర్యాపేటలో 80 పాఠశాలలు మూతపడ్డాయి. సున్నా నమోదు పాఠశాలలకు గ్రామాలు, తండాలు అని తేడా లేకుండా ఉపాధ్యాయ కొరత ఉండటం వల్ల తల్లిదండ్రులు విద్యార్థులను పంపడానికి ఇష్టపడటం లేదు. ఇవి జాతీయ రహదారి వెంబడి ఉన్న నార్కట్‌పల్లి మండలంలో ఐదు పాఠశాలలు, చందంపేట, నేరెడుగొమ్ము డిండిలో పదుల సంఖ్యలో ఉండగా, మరో పది పాఠశాలలు పిల్లలు లేక మూతపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేవరకొండ, కొండమల్లేపల్లి, చింతపల్లి మండలాల్లోనూ ఇలాంటి బడులున్నాయి.

గ్రామీణబడులకు మంచి రోజులు వచ్చేది ఎప్పుడు?

ప్రభుత్వాలు మారినప్పుడు పాలకులు పథకాల పేర్లను మార్చుతూ ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తాం అని ప్రణాళిక రూపొందించుకోవడం తప్ప జీరో నమోదు ఉన్న పాఠశాలలపై దృష్టి సారించడం లేదు. గత పది సంవత్సరాల్లో మన ఊరు- మనబడి, మన బస్తి బడి ఇలాంటివి నామకరణం చేసి ప్రకటన చేశారు. ఏడాది కిందట ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలు అనే పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో స్వయం సహాయక సంఘాల సభ్యుల సహకారంతో అభివృద్ధి చేస్తున్నట్టు ప్రకటించింది. ఆకునూరి మురళి సారధ్యంలో విద్యా కమిషన్ ఏర్పాటు చేసి జిల్లాల్లో పాఠశాలల స్థితిగతులపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ ప్రణాళికతోనైనా గ్రామాల్లో ప్రాథమిక విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, మూతబడిన పాఠశాలలను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

సన్న వడ్లకు రూ.939 కోట్ల బోనస్

3.36 లక్షల మంది రైతులకు లబ్ది

రూ.10903 కోట్ల ధాన్యం కొనుగోళ్లు

ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సన్న రకాల వరి సాగు రైతుల పంట పండింది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే రూ.10,149 కోట్ల ధాన్యం కొనుగోళ్లు చేసింది. ఇచ్చిన మాట ప్రకారం ఈసారి సన్న వడ్లకు రూ.500 బోనస్ చెల్లించిందని ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సన్న రకాల వరి సాగును ప్రోత్సహించటంతోపాటు బోనస్ చెల్లింపుతో రైతులకు అదనంగా లబ్ది చేకూర్చిందని తెలిపింది. రాష్ట్రంలో దాదాపు 3.36 లక్షల మంది రైతులు ఈసారి సన్న వడ్ల బోనస్ అందుకున్నారని పేర్కొంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 18.78 లక్షల మెట్రిక్ టన్నుల సన్న వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేసిందని వివరించింది. వీటికి అదనంగా ఇచ్చే బోనస్ ప్రకారం రూ.939 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటికే రూ.591 కోట్లు చెల్లించినట్టు తెలిపింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 47.01 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసినట్టు పేర్కొంది. అందులో 28.23 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 18.78 లక్షల మెట్రిక్ టన్నులు సన్న రకమని వివరించింది. గత ఏడాది 2023 ఖరీఫ్ సీజన్‌లో 41.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా...ఈ ఏడాది అంతకంటే 6 లక్షల మెట్రిక్ టన్నులు ఎక్కువ ధాన్యం కొనుగోలు చేసిందని తెలిపింది. మొత్తం ఇప్పటి వరకు రూ.10903 కోట్ల విలువైన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసినట్టు పేర్కొంది.

అందులో రూ.10,149 కోట్ల చెల్లింపులు చేసిందనీ, మొత్తం 8.84 లక్షల మంది రైతుల నుంచి ఈసారి ధాన్యం సేకరించిందని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఈసారి 8318 కేంద్రాల్లో కొనుగోళ్లు చేపట్టినట్టు పేర్కొంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఈసారి సివిల్ సప్లయిస్ విభాగం పక్కాగా ఏర్పాట్లు చేసిందని తెలిపింది. ఈదురు గాలులు, అకాల వర్షాలకు కూడా రైతులు నష్టపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్టు గుర్తు చేసింది. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణలో కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, పెద్దపల్లి, సిద్దిపేట జిల్లాలు ముందు వరుసలో ఉన్నట్టు ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది.

బోనస్‌తో పెరిగిన సన్నాల సాగు

సన్నవడ్లకు ప్రభుత్వం బోనస్ ప్రకటించటంతో ఈసారి సన్న రకాల వరి సాగు విస్తీర్ణం అనూహ్యంగా పెరిగింది. 2023 ఖరీఫ్ సీజన్‌లో మొత్తం వరి సాగైన విస్తీర్ణంలో 38 శాతం కేవలం 25.05 లక్షల ఎకరాల్లో సన్నరకం పండించారు. ఈ ఖరీఫ్‌లో (2024) రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 66.78 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. అందులో 61 శాతం...దాదాపు 40.55 లక్షల ఎకరాల్లో రైతులు సన్న ధాన్యం పండించారు. మిగతా 26.23 లక్షల ఎకరాల్లో దొడ్డు రకాలు సాగు చేశారని ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది.

ముంపు గ్రామాల నిర్వాసితులను ఆదుకుంటాం

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

- నక్కల గండి ప్రాజెక్టు అభివృద్ధికి సహకరించాలి : ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- ఏజెన్సీ హక్కులు కల్పించాలని గ్రామస్తుల డిమాండ్



నవతెలంగాణ-అచ్చంపేట

నక్కలగండి ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న నక్కలగండి తండా, మర్లపాడు తండా, కేశ్య తండా, మన్నేవారిపల్లి గ్రామాల నిర్వాసితులను రాజకీయాలకతీతంగా ఆదుకుంటామని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హామీ ఇచ్చారు. ఆర్‌అండ్‌ఆర్ ద్వారా భూ సేకరణ, ఇండ్ల నిర్మాణానికి అచ్చంపేట మండలం హాజీపూర్ గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశామని, అన్ని వసతులతో ఆదర్శవంతమైన కాలనీని తీర్చిదిద్దుతామని, ముంపు గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. మంగళవారం మండల పరిధిలోని మర్లపాడు తండా గ్రామంలో కలెక్టర్, ఎమ్మెల్యేతో కలిసి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నక్కల గండి ప్రాజెక్టు నీటితో పలు గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని, ముంపు గ్రామాల ప్రజలు గమనించి ప్రభుత్వం అందిస్తున్న పరిహారాన్ని స్వీకరించి, ముందుకు రావాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక ఎమ్మెల్యేలతో పాటు జిల్లా యంత్రాంగం ప్రభుత్వంతో మాట్లాడి అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అచ్చంపేట మండల పరిధిలోని హాజీపూర్ గ్రామం, మన్నేవారిపల్లి లేదా సిద్ధాపూర్ గ్రామాలలో ఇప్పటికే గుర్తించిన ప్రభుత్వస్థలంలో రోడ్లు, అండర్ డ్రయినేజీ వ్యవస్థ, గ్రామస్థాయి ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల, అంగన్వాడీ నిర్మాణాలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నక్కల గండి ప్రాజెక్టుతో 2026 నాటికి ప్రస్తుతం గ్రామసభ నిర్వహిస్తున్న గ్రామంలో పూర్తిగా ముంపునకు గురై, ప్రాజెక్టు నీరు నిలిచి ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా నిలవాలని ఉద్దేశంతోనే ముంపు గ్రామాల ప్రజలతో గ్రామసభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ రిజర్వాయర్‌లో చేపల వేటకు, టూరిజంలో భాగంగా జరిగే అభివృద్ధిలో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని, గజానికి రూ.3వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు. మైదాన ప్రాంతానికి వెళ్తితే తమ ఏజెన్సీ హక్కులు కోల్పోతామని, కావున ఏజెన్సీ హక్కులు కల్పించాలని కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి సానుకూలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్, ఎమ్మెల్యే గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ మాధవి, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ చంద్రశేఖర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సినిమాపరిశ్రమను బోనులో నిలబెట్టేయత్నం

- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్
- శ్రీతేజ్‌ను పరామర్శించిన ఎంపీలు ఈటల, డీకే అరుణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సంధ్య థియేటర్ ఘటనను ఆధారంగా చేసుకుని తెలుగు సినిమా పరిశ్రమను మొత్తం బోనులో నిలబెట్టే ప్రయత్నాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆ బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్‌మీడియాతో మాట్లాడుతూ..క్రీడాకారులు, రాజకీయ నాయకులు, సినిమా తారలకు పెద్ద ఎత్తున మాస్ ఫాలోయింగ్ ఉంటుందనీ, వారు ఎక్కడకు వెళ్లినా జనం పెద్ద ఎత్తున వస్తారని చెప్పారు. వారి పర్యటనల సందర్భంగా ముందస్తు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత పోలీసు శాఖ ఉంటుందన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని అల్లు అర్జున్‌ను కోరారు. ఈ ఘటన ద్వారా క్రికెట్, పొలిటికల్, సినిమా స్టార్లు బాధ్యతాయుతంగా ఉండాలనీ, ఈ ఘటనను ప్రతి ఒక్కరూ గుణపాఠంగా తీసుకోవాలని సూచించారు. ఇక విషయాన్ని రాజకీయం చేయడాన్ని ఆపాలని కోరారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

- కలెక్టరేట్‌కు విద్యార్థుల 20 కిలోమీటర్ల పాదయాత్ర



నవతెలంగాణ - ఇటిక్యాల/జోగులాంబ గద్వాల


జోగులాంబ గద్వాల జిల్లా బీచుపల్లి రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని బీచుపల్లి పాఠశాల విద్యార్థులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పాఠశాల ప్రిన్సిపాల్ సీట్లను అమ్ముకుంటూ విద్యార్థులను అకారణంగా కొడుతూ.. దూషిస్తున్నాడని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. భోజనం సరిగా అందించడం లేదని, వసతులు కూడా కల్పించకుండా తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తుండడంతో తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌కు వివరించేందుకు గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్రగా బయలుదేరినట్టు విద్యార్థులు తెలిపారు. ప్రిన్సిపాల్ సస్పెండ్ అయ్యేంత వరకు తమ పోరాటం కొనసాగిస్తామని అన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే సంఘీభావం..

బీచుపల్లి రెసిడెన్షియల్ పాఠశాల నుంచి విద్యార్థులు దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకుంటున్న విషయం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తెలుసుకున్నారు. వ్యక్తిగత పనుల మీద పెబ్బేరుకు వెళుతున్న సందర్భంలో వీరాపురం గ్రామం దగ్గర విద్యార్థుల పాదయాత్ర దగ్గరకు చేరుకొని సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ కుమార్‌కు ఫోన్‌లో మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకొని బీచుపల్లి రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు న్యాయం చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నుంచి నిధులొస్తున్నా.. సర్కారు ఆస్పత్రుల తీరు మారదా?

కేంద్ర నిధులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందాలి : కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'కేంద్రం రూ.వందలు, వేల కోట్ల నిధులిస్తున్నా.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాటన్ లేదంటరు.. మందుల్లేవ్ అంటరు. ఎక్స్‌రే మిషన్ కరాబైందంటరు? దశాబ్దాలు మారినా సర్కారు ఆస్పత్రుల తీరు మారదా?. ఇంకోవైపు కాంట్రాక్టర్లు సిండికేట్ అయి తమాషా చేస్తూ ఏండ్ల తరబడి పనులు పూర్తి చేయకుండా ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు. గడువులోపు పనులు పూర్తి చేయకుంటే కాంట్రాక్టర్లకు 60(సీ)నోటీసులిచ్చి చర్యలు తీసుకోవాలి. కేంద్రం ఇచ్చే ప్రతిపైసా క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా కృషి చేయాలి. లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవు' అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లా అధికారులను హెచ్చరించారు. ఈ రెండు జిల్లాల అభివృద్ధి పనులపైనా, కేంద్ర పథకాలపైనా మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ కింద రూ.398 కోట్లు మంజూరు చేసినా పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని, యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఎందుకు సమర్పించలేదని కరీంనగర్ మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. యూసీ సమర్పిస్తే మిగిలిన రూ.70కోట్ల నిధులు తాను మంజూరు చేయిస్తానన్నారు. స్మార్ట్‌సిటీ, సీడీఎఫ్ నిధులు ఏయే పనులకు కేటాయించారో పూర్తిస్థాయి వివరాలు ఇవ్వాలని, ప్రస్తుతం పెండింగ్ పనులు పూర్తి చేశాకే కొత్త పనులు చేపట్టాలని ఆదేశించారు. కరీంనగర్ జిల్లాకు నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.7 కోట్లు, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.5.29 కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని, అవి ఏ పనులకు ఖర్చు చేశారో వివరాలు ఎందుకు ఇవ్వలేదన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా రూ.4 కోట్ల మెడికల్ పరికరాలను, అంబులెన్సులను అందజేస్తే వాటిని కూడా చిన్న రిపేర్ వచ్చిందని మూలన పడేయటం బాధాకరమన్నారు. సిరిసిల్ల జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో 12 రోడ్ల (80కిలోమీటర్ల) నిర్మాణం కోసం రూ.46 కోట్లు కేంద్రం మంజూరు చేస్తే అందులో ఒక్క వర్కే పూర్తయిందన్నారు. ఎంపీ నిధులు అనేసరికి కొంచెం కావాలని ఆలస్యం చేస్తున్నారని, దీనిపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ సునీల్ రావు, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు, కేంద్ర హోంశాఖ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి ఆంధ్ర వంశీ ఐఏఎస్, కరీంనగర్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ వాజ్ పేయి సహా వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు.

'అర్బన్ నక్సల్స్' కోసం వేట

- సీఆర్‌పీఎఫ్‌కు కేంద్రం ఆదేశాలు
- వ్యూహకర్తలు, సానుభూతిపరులను పసిగట్టాలని సూచన

న్యూఢిల్లీ : దేశంలోని వివిధ నగరాలలో ఉన్న మావోయిస్టులను ఏరివేయాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉంది. అందులో భాగంగా 'అర్బన్ నక్సల్స్'ను గుర్తించాలని హోం మంత్రిత్వ శాఖ సీఆర్‌పీఎఫ్‌ను ఆదేశించింది. మావోయిస్టు వ్యూహకర్తలు, సానుభూతిపరులు ఎక్కడ ఉన్నా వారి ఆచూకీని పసిగట్టాలని సూచించింది. ప్రధాని నరేంద్ర మోడీ సహా పలువురు బీజేపీ నేతలు, మంత్రులు తరచుగా తమ ప్రసంగాలలో 'అర్బన్ నక్సల్స్' అనే పదాన్ని వాడుతున్నారు. దేశ భద్రతకు వారు అత్యంత ముప్పుగా పరిణమించారని ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారంలో కూడా 'కాంగ్రెస్‌ను అర్బన్ నక్సల్స్ ముఠా నడిపిస్తోంది' అని మోడీ విమర్శించారు.

కేంద్ర రిజర్వ్ పోలీస్ దళం (సీఆర్‌పీఎఫ్) ప్రధానంగా మావోయిస్టుల ఏరివేతకు ఉద్దేశించింది. జమ్మూకాశ్మీర్, ఈశాన్య ప్రాంతంలో ఉగ్రవాదులతో పోరుకు కూడా అది ఉపయోగపడుతోంది. 'దేశంలోని వివిధ నగరాలలో కార్యకలాపాలు సాగిస్తున్న మావోయిస్టు సంస్థలను గుర్తించాలని హోం శాఖ పారామిలటరీ దళాన్ని ఆదేశించింది. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు వ్యూహకర్తలు, సానుభూతిపరుల ఆచూకీ తెలుసుకోవాలని మమ్మల్ని అడిగింది. రాష్ట్ర పోలీసు దళాలతో కలిసి అర్బన్ నక్సల్స్‌ను ఏరివేయాలని చెప్పింది' అని సీఆర్‌పీఎఫ్ అధికారి ఒకరు తెలిపారు.

మావోయిస్టులకు చెందిన అనేక సంస్థలు ఎన్జీఓలు, పౌర హక్కుల సంఘాల పేరుతో కోల్‌కతా, ఢిల్లీ, ముంబయి, చండీఘర్, రాంచీ, హైదరాబాద్, తిరువనంతపురం, మదురై, నాగపూర్, పూనే నగరాలలో పనిచేస్తున్నాయని ఇంటెలిజెన్స్ నివేదికలు అందించిందని హోం శాఖ వర్గాలు తెలిపాయి. ఈ సంఘాలు అడవులలో సాయుధ పోరాటాలకు వ్యూహాత్మక మద్దతు ఇస్తున్నాయని, మావోయిస్టు ఉద్యమానికి మద్దతుగా విద్యావంతులైన యువతను నియమించుకుంటున్నాయని, సిద్ధాంతవేత్తల పాత్ర పోషిస్తున్నాయని ఆ వర్గాలు వివరించాయి.

మానవి
బుధవారం
25 డిసెంబరు 2024
www.navatelangana.com



డిసెంబర్ నెల ప్రారంభమయ్యిందంటే చాలు క్రిస్మస్ వేడుకలు మొదలవుతాయి. ఇంటిపైన స్టార్ వెలిగించడం, ఇంటి ముందు క్రిస్మస్ ట్రీని పెట్టడం వంటివి చేస్తారు. దీనిని అందంగా అలంకరించి కొవ్వొత్తులు వెలిగిస్తారు. దీనికి కారణమేమిటో ఒకసారి పరిశీలిద్దాం..

క్రిస్మస్ ట్రీ గురించి...

సాధారణంగా క్రిస్మస్ చెట్లను ఏర్పాటు చేసుకొని అందంగా అలంకరించుకోవాలన్న ప్రతిపాదన ఏదీ లేదట. కొన్ని వందల ఏండ్ల క్రితం 'జనరల్ ఫెడరిక్ అడాల్ఫ్ రెడిజిల్' అనే వ్యక్తి సైనికులకు ఇచ్చిన విందులో సైనికులను అబ్బుర పరిచేందుకు ఈ చెట్లను వినియోగించారట. ఆ చెట్లను డెకరేట్ చేయడంతో అది ప్రాచుర్యం పొందింది.

అలాగే 18వ శతాబ్దంలో విక్టోరియా రాణి తన రాజ భవనంలో క్రిస్మస్ వేడుకలో ఈ క్రిస్మస్ చెట్టును అలంకరించారు. దీంతో ఈ సంప్రదాయం ప్రపంచ దేశాలకు విస్తరించింది. రష్యా, ఆస్ట్రేలియా వంటి తదితర దేశాలకు కూడా ఈ సంప్రదాయం పాకింది. అప్పటి నుంచి క్రిస్మస్ వస్తే ఇంటిపైన స్టార్ వెలిగించడం, ఇంటి ముందు క్రిస్మస్ చెట్టు పెట్టుకోవటం పరిపాటిగా మారింది.

ఎందుకు పెడతారంటే?

క్రిస్మస్ చెట్టును ఆనందానికి, పచ్చదనానికి, సిరి సంపదలకు చిహ్నంగా ప్రపంచంలోని దేశాలన్నీ పరిగణిస్తుంటాయి. ఈ చెట్టుకు ఇవ్వడం మినహా తీసుకోవడం వంటివి తెలియదని చెబుతుంటారు. అందుకే ఇవ్వడం, ప్రేమించడం, క్షమించడం ప్రధానాంశాలుగా ఉన్న క్రిస్మస్ పండుగ రోజున క్రిస్మస్ చెట్టుతో ఇంటిని లంకరించుకుంటారు.



అలాగే ఇంటిపై స్టార్‌ను క్రీస్తు జన్మ నక్షత్రమని క్రైస్తవులు చెబుతుంటారు. క్రీస్తు ఈ భూమి మీదకు వస్తున్నారని చెబుతూ, అలాగే రావాలని కాంక్షిస్తూ ఇళ్లపై ఈ స్టార్లను అలంకరిస్తూ ఉంటారు. కొన్ని వందల ఏండ్ల కిందట ప్రారంభమైన ఈ ఆచారాలు నేటికీ కొనసాగుతున్నాయి.

క్రిస్మస్ ఎందుకు జరుపుకుంటారంటే?

డిసెంబర్ 25న యావత్ ప్రపంచం క్రిస్మస్ జరుపుకుంటుంటుంది. మన దేశంలోని క్రైస్తవులతో పాటు ప్రపంచంలోని చాలా దేశాల్లో ఈ పండగను ఘనంగా జరుపుకుంటారు. కొన్ని వేల ఏండ్ల క్రితం మేరీ, జోసెఫ్ దంపతులకు డిసెంబర్ 24వ తేదీన యేసు జన్మించారు. మేరీ కన్యగా ఉన్నప్పుడే దేవదూతలు ఆమెకు యేసును ప్రసాదిస్తారు. అలా ఆమె డిసెంబర్ 24వ తేదీ అర్ధరాత్రి యేసుకు జన్మనిస్తుంది. యేసు జన్మదినాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 25వ తేదీన క్రిస్మస్ జరుపుకుంటారు. ■

నోరూరే క్రిస్మస్ రుచులు

క్రిస్మస్ అంటేనే మనసంతా నిండుతుంది. క్రైస్తవ సోదరుల ముంగిళ్లు నక్షత్ర కాంతులతో మిరిమిట్లు గొలుపుతుంటాయి. అతిథులతో కళకళలాడుతుంటాయి. ఇలా క్రిస్మస్ వేడుక అంటేనే ఓ సంబరం. మరి ఇలాంటి రోజున చేసుకునే వంటకాలూ కాస్త ప్రత్యేకంగా ఉండాలనే కోరుకుంటారు. నోరూరించే వంటకాలతో పండుగ ఆనందాన్ని రెట్టింపు చేయాలనుకుంటారా..! మరి వీటిని ప్రయత్నించండి...

శాంతా కుకీస్

కావల్సిన పదార్థాలు: మైదా - రెండు కప్పులు, పంచదార - పావుకప్పు, పాలు - పావుపకప్పు, ఫుడ్‌కలర్ - కొద్దిగా, బటర్ - రెండు టేబుల్ స్పూన్లు, చాక్లెట్ చిప్స్ - ఐదు.



తయారీ విధానం: ఓవెన్‌ను ముందుగా 180 డిగ్రీల వరకు వేడి చేసి పెట్టుకోవాలి. బటర్‌ను వేడి చేసి దాంట్లో పంచదార, పాలు, ఆ తర్వాత మైదా వేసి కలపాలి. దీంట్లోంచి కప్పు ముద్దను తీసుకుని పక్కన పెట్టుకోవాలి. మిగతా దాంట్లో ఎర్రని ఫుడ్ కలర్ కలపాలి. దీంట్లోని పిండిని తీసుకొని అంగుళం, అర అంగుళం మందాన చిన్న చిన్న ముక్కల్లా చేసుకోవాలి. తెల్లని ముద్దలో నుంచి కొంత భాగాన్ని లడ్డూల్లా చుట్టాలి. ఎర్రని భాగాన్ని శాంతా శరీరంలా తయారు చేయాలి. తెల్లని ముద్దతో చేతులు, కాళ్లు చేయాలి. చాక్లెట్ చిప్స్‌ను కళ్లలా అలంకరించాలి. మూడు చిప్స్‌ను ఒకదాని కింద మరోటి శరీరం మధ్యలో అంటిస్తే అవి బటన్స్‌లా కనిపిస్తాయి. శాంతా సిద్ధం అయిన తర్వాత వీటిని కుకీషీట్ మీద ఉంచి పావుగంట పాటు బేక్ చేయాలి. అంతే శాంతా జుట్టూ, గడ్డంలా తెల్లగా ఉంటుంది.

ప్లమ్ పుడ్డింగ్

కావల్సిన పదార్థాలు: కిస్‌మిస్ - అరకప్పు, చెర్రీలు -అరకప్పు, ఖర్జూర పలుకుల తరుగు, నల్లద్రాక్ష - పావుకప్పు, టూటీఫ్రూటీ - అకరప్పు, కమలాఫలం రసం - కప్పు, జీడిపప్పు, బాదం పలుకులు - ముప్పావుకప్పు చొప్పున, ఎండు ఆప్రికాట్లు - అరకప్పు, బ్రెడ్‌పొడి - కప్పు, మైదా - అరకప్పు, గుడ్లు - రెండు, బేకింగ్‌పౌడర్ - చెంచా, బ్రౌన్‌షుగర్ - కప్పు, చాక్లెట్‌పొడి - రెండు టేబుల్ స్పూన్లు, చల్లని వెన్న - కప్పు, దాల్చిన చెక్కపొడి - చెంచా, జాజికాయపొడి - చెంచా, ఉప్పు - అరచెంచా, వెనిల్లా ఎసెన్స్ - రెండు చెంచాలు.

తయారీ విధానం: ఒక రోజు ముందుగా కమలాపండు రసంలో కిస్‌మిస్, చెర్రీలు, ఖర్జూర తరుగు, నల్లద్రాక్ష, టూటీ ఫ్రూటీ, ఎండు ఆప్రికాట్ ముక్కలు వేసుకుని బాగా కలపాలి. మర్నాడు ఈ మిశ్రమాన్ని మరో గిన్నెలో తీసుకుని అందులో వెన్న తప్ప ఒక్కో పదార్థాన్ని వేసుఉంటూ బాగా కలపాలి. తర్వాత వెన్నను వేసి మరోసారి కలిపి ఈ మిశ్రమాన్ని పుడ్డింగ్ మౌల్డ్‌లో తీసుకుని బిగుతుగా మూత పెట్టాలి. ఇప్పుడు ఈ పాత్రను సిమ్‌లో ఆవిరిమీద నాలుగు గంటలు ఉడికించుకుని తీసుకోవాలి.



డేట్స్ ఆల్మండ్ కేక్

కావల్సిన పదార్థాలు: ఖర్జూర ముక్కలు - కప్పు(నీళ్లతో ముద్దలా చేసుకోవాలి), బాదం పొడి - పావుకప్పు, గోధుమ పిండి - కప్పు, బాదంపాలు - పిండి కలిపేందుకు, ఓట్స్ పొడి - కప్పు, దాల్చిన చెక్కపొడి - అరచెంచా, బేకింగ్ పౌడర్ - చెంచా, యాలకుల పొడి - చెంచా, ఉప్పు - అరచెంచా, వెన్న - అరకప్పు, గుడ్డు - ఒకటి, వెనిల్లా ఎసెన్స్ - అరచెంచా, బాదం పలుకులు - అరకప్పు.



తయారీ విధానం: ఓ గిన్నెలో గోధమపిండి, ఓట్స్‌పొడి, బాదంపొడి, దాల్చినచెక్కపొడి, బేకింగ్ పౌడర్, యాలకులపొడి, ఉప్పు వేసి కలుపుకోవాలి. మరో గిన్నెలో వెన్న, గుడ్డుసొన, వెనిల్లా ఎసెన్స్ వేసుకుని బాగా గిలకొట్టుకోవాలి. ఇందులో గోధుమపిండి మిశ్రమం, ఖర్జూర ముద్ద వేసి బాదంపాలతో కేకు మిశ్రమంలా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని వెన్న రాసిన కేకు ట్రేలో తీసుకుని పైన బాదం పలుకుల్ని అలంకరించి 180 డిగ్రీల ఉష్ణోగ్రతలో ముందే వేడిచేసి పెట్టుకున్న ఓవెన్‌లో పెట్టి ఇరవై అయిదు నిమిషాలు బేక్ చేసుకుని తీసుకోవాలి.

మలబార్ చికెన్ బిర్యానీ

కావల్సిన పదార్థాలు: చికెన్ ముక్కలు పెద్దవి - కేజీ, కారం - రెండు చెంచాలు, పసుపు - అరచెంచా, నిమ్మరసం - చెంచా, ఉప్పు - తగినంత.

మసాలా కోసం: ఉల్లిగడ్డలు - రెండు పెద్దవి, టమాటా - ఒకటి, పెరుగు - కప్పు, కొత్తిమీర, పుదీనా తరుగు - కప్పు చొప్పున, గరంమసాలా - ఒకటిన్నర చెంచా, అల్లం వెల్లులి ముద్ద - రెండు టేబుల్‌స్పూన్లు, పచ్చి మిర్చి - నాలుగు, నెయ్యి - అర కప్పు, బాస్మతీ బియ్యం - మూడు కప్పులు (ముందుగా నానబెట్టుకోవాలి), ఎర్రగా వేయించిన ఉల్లిగడ్డ ముక్కలు - కప్పు, నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ పలుకులు - పావుకప్పు చొప్పున, లవంగాలు - నాలుగు, యాలకులు - రెండు, దాల్చినచెక్క - ఒకటి పెద్దది.

తయారీ విధానం: చికెన్ ముక్కలపైన కారం, పసుపు, తగినంత ఉప్పు, నిమ్మరసం వేసి కలిపి ఫ్రిజ్‌లో పెట్టాలి. స్టౌమీద గిన్నె పెట్టి ముప్పావువంతు నెయ్యి వేసి ఉల్లిగడ్డ ముక్కలు, టామాటా తరుగు వేయించుకుని కొద్దిగా ఉప్పు, అల్లంవెల్లుల్లి ముద్ద, పెరుగు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాలయ్యాక చికెన్ ముక్కలు, పుదీనా, కొత్తిమీర తరుగు, గరంమసాలా, పచ్చిమిర్చి వేసి కలిపి చికెన్ ఉడికిందనుకున్నాక దింపేయాలి. బియ్యాన్ని కడిగి అందులో లవంగాలు, యాలకులు, దాల్చినచెక్క, ఆరుకప్పుల నీళ్లు పోసి అన్నాన్ని ముప్పావువంతు ఉడికించుకుని తీసుకోవాలి. ఇప్పుడు ఓ పెద్ద గిన్నె తీసుకుని అడుగున సగం కూర పరికి దానిపైన సగం అన్నం... వేయించిన ఉల్లిగడ్డ ముక్కలు, సగం జీడిపప్పు, కిస్‌మిస్ పలుకులు వేసి పైన మళ్లీ అదే విధంగా చేసుకోవాలి. దీనిపైన మిగిలిన నెయ్యి వేసి మూత పెట్టి ఇరవై నిమిషాలు దమ్ పద్ధతిలో సన్నని మంటపైన ఉంచి దింపేయాలి. ■



తలతాకట్టు పెట్టైనా...

(మొదటిపేజీ తరువాయి)

నాలుగేండ్లలో 20 లక్షలకు తక్కువ కాకుండా అత్యంత నిరుపేదలకు ఇండ్లు నిర్మిస్తామన్నారు. ఈనెల 23 నాటికి సుమారు 32 లక్షల దరఖాస్తులను పరిశీలించామని తెలిపారు. జనవరి మొదటి వారంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తవుతుందని తెలిపారు. ఆ తర్వాత లబ్దిదారుల ఎంపిక పూర్తి చేసి సంక్రాంతి నాటికి ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత ప్రభుత్వం గృహ నిర్మాణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందనీ, కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని బలోపేతం చేస్తున్నదని వివరించారు. వివిధ విభాగాల్లో పని చేస్తున్న 95 శాతం కార్పొరేషన్ ఉద్యోగులను వెనక్కి తీసుకొచ్చామని చెప్పారు. ఈ ఏడాది నాలుగున్నర లక్షల ఇండ్ల నిర్మాణమే కాకుండా 20లక్షల ఇండ్లు నిర్మించేందుకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుంటున్నామని చెప్పారు. చిన్నచిన్న తప్పులు కూడా జరగకుండా అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక జరుగుతుందని భరోసా ఇచ్చారు.

మొదటి విడతలో వికలాంగులు, వితంతువులకు అవకాశం ఇస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిబంధనల మేరకు కొంత మందిని తిరస్కరించినా రాష్ట్ర ప్రభుత్వం తరపున వారికి ఇండ్లు ఇస్తామన్నారు. కేంద్రం విధించే నిబంధనలను ఆమోదిస్తూ కేంద్ర నిధులనూ తీసుకుంటామని చెప్పారు. ఈ విషయంలో తాము ఎటువంటి బేషజాలకు పోయేదిలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేకున్నా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం విషయంలో తగ్గేదేలేదని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికిగానూ ప్రత్యేక విధివిధానాలను ప్రకటిస్తామన్నారు. వారంరోజుల్లో ప్రత్యేక ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రత్యేక వెబ్‌సైట్, టోల్ ఫ్రీ నెంబర్లు ఇస్తామని చెప్పారు.

రాష్ట్రంలోని ఏ మారుమూల తండా, లేదా గ్రామం నుంచైనా ఫిర్యాదు చేస్తే తక్షణం స్పందించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే గ్రామాల వారీగా రెవెన్యూ అధికారుల నియామకానికి నిర్ణయించారని చెప్పారు. త్వరలో 1200 మంది సర్వేయర్లను నియమిస్తామని వివరించారు. రేషన్‌కార్డులతో సంబంధం లేకుండా సొంత స్థలం ఉన్న వారికి తొలి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. గ్రామాల వారీగా ఇందిరమ్మ కమిటీల్లో లబ్దిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ఇండ్లను కూడా నిర్మిస్తామన్నారు. హైదరాబాద్ నలువైపులా వందేసి ఎకరాలను సమీకరించి హౌసింగ్ బోర్డు నిర్మాణ సారథ్యంలో ఇండ్ల నిర్మాణం చేపడతామని చెప్పారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి బుద్ధ ప్రకాష్, ఎండీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, హరీశ్ నోటీసులపై స్టే

(మొదటిపేజీ తరువాయి)

చీఫ్ ఇంజినీర్ శ్రీధర్, మేఘా నిర్మాణ సంస్థ అధినేత కృష్ణారెడ్డి, ఎల్‌అండ్‌టీ సంస్థలకు గత జులై 10న నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులను కొట్టేయాలంటూ కేసీఆర్, హరీశ్‌రావు వేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ కె.లక్ష్మణ్ విచారించారు. జిల్లా కోర్టు ఇచ్చిన నోటీసులు చట్టపరంగా లేవని పేర్కొన్నారు. ప్రాథమికంగా పరిశీలిస్తే మెజిస్ట్రేట్ ఇచ్చిన ఆర్డర్‌లో జిల్లా జడ్జి జోక్యానికి ఆస్కారం లేదన్నారు. రాజలింగమూర్తికి నోటీసులు ఇచ్చారు. కౌంటర్ వేయాలని ఆదేశించారు. విచారణను జనవరి 7న జరుపుతామన్నారు.

తెలంగాణ తల్లిపై పిల్ వాపస్

రాష్ట్ర వ్యాప్తంగా మార్పు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ జర్నలిస్ట్ జూలూరి గౌరిశంకర్ వేసిన పిల్‌ను వాపస్ తీసుకున్నారు. క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని, రూ.150 కోట్ల ఖర్చు విషయాల గురించి పిల్‌లో లేకపోవడంతో హైకోర్టు అభ్యంతరాన్ని లేపింది. దీంతో పిల్‌లో మార్పులు చేసి తిరిగి వారంలోగా దాఖలు చేస్తామనీ, కాబట్టి పిల్ ఉపసంహరణకు అనుమతి ఇవ్వాలని రచయిత జూలూరి గౌరీశంకర్ న్యాయవాది కోరారు. ఇందుకు చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ మంగళవారం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవాది వినతిని అనుమతిస్తూ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అంబేద్కర్ మాకు ఆరాధ్య దైవం

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్
- ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పేరు బీజేపీ నేతలకు ఫ్యాషన్ అయితే తమకు ఆరాధ్య దైవమని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ టీపీసీసీ ఆధ్వర్యంలో మంగళవారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం నుంచి హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ ప్రయత్నిస్తోందని, మనుస్మతి అమలు చేసేందుకు బీజేపీ, సంఘ్ పరివార్ కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. వెంటనే అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించిన బీజేపీ తీరును ప్రజాస్వామ్య రీతిలో ఎండగడుతున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. నిత్యం రాజ్యాంగాన్ని తప్పుపట్టే బీజేపీ నేతలు ఇప్పుడు అంబేద్కర్‌ను తూలనాడుతున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి బీజేపీపై కాంగ్రెస్ పెద్ద ఎత్తున పోరాడుతుందన్నారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ అంబేద్కర్‌ను కించపరుస్తూ అమిత్ షా మాట్లాడిన మాటలు సిగ్గుచేటన్నారు. వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు మాట్లాడుతూ ఈ విషయంపై దేశం యావత్తు అట్టుడికి పోతుంటే ప్రధాని నరేంద్ర మోడీ బాధ్యతారాహితంగా తన ట్వీట్లతో అంబేద్కర్‌ను కించపరుస్తూ ఎదురుదాడి చేయడం దురదృష్టకరమన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ అమిత్ షాను బీజేపీ నుంచి సస్పెండ్ చేసి ప్రధాని మోడీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. జాతీయ నాయకుడు కొప్పుల రాజు మాట్లాడుతూ అంబేద్కర్ ప్రవేశపెట్టిన రిజర్వేషన్లతో పదవులు అనుభవిస్తున్న అమిత్ షా, ఆయనను కించపరిచేలా మాట్లాడుతూ మనువాద బలోపేతానికి పునాదులు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉద్యమం మరో స్వాతంత్ర ఉద్యమంలా మారకముందే, అంబేద్కర్‌కు క్షమాపణలు చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ పీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

సొమ్మొకడిది... సోకొకడిది

(మొదటిపేజీ తరువాయి)

ఎనిమిది సంవత్సరాల పాలనలో పారు బకాయిలు రూ.72 లక్షల కోట్లకు చేరాయి. ప్రపంచంలోని ఏ గౌరవనీయ దేశం కూడా ఈ గణాంకాలతో సరితూగలేదు.

'దివాలా' సాకుతో బ్యాంకులకు టోపీ

చాలా మంది బడా బాబులు 'దివాలా' తీసినట్లు ప్రకటించి బ్యాంక్ రుణాలు ఎగవేస్తున్నారు. లేదా ఎంతో కొంత విదిల్చి చేతులు దులుపుకుంటున్నారు. ఉదాహరణకు ఆర్థికంగా ఇబ్బందులలో ఉన్న పది కంపెనీలను పారిశ్రామికవేత్త అదానీ కొనుగోలు చేశారు. అవి అప్పటికే బ్యాంకులకు రూ.62,000 కోట్లు బకాయి పడ్డాయి. అయితే వాటిని అదానీ కొనుగోలు చేసిన తర్వాత బ్యాంకులను ఒప్పించి రూ.16,000 కోట్లకు ఒప్పందం కుదిర్చారు. ఈ లావాదేవీలో బ్యాంకులు తమకు రావాల్సిన బకాయిలలో 74 శాతం కోల్పోయాయి. మోడీ పాలనలో ఇలాంటి లావాదేవీలు అనేకం జరిగాయి.

మోడీ స్నేహితుడైన అనిల్ అగర్వాల్ (వేదాంత) వీడియోకాన్‌ను కొనుగోలు చేశారు. వీడియోకాన్ చెల్లించాల్సిన బ్యాంక్ రుణంలో కేవలం 6 శాతం మాత్రమే బ్యాంకులకు చెల్లించి ఒప్పందం కుదుర్చుకున్నారు. అలాగే ఏబీజీ షిప్‌యార్డ్ రూ.22,800 కోట్లు బకాయి పడితే అందులో ఐదు శాతం మాత్రమే చెల్లించడం జరిగింది. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ 53 బ్యాంకులకు రూ.49,000 కోట్ల రుణం చెల్లించాల్సి ఉంది. కానీ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ దానిని కేవలం రూ.455 కోట్లకే 'సెటిల్' చేసింది. మొత్తం రుణంలో ఇది 0.92 శాతం మాత్రమే. దివాలా ప్రక్రియ కారణంగా బ్యాంకులు ఏ విధంగా నష్టపోతున్నాయో తెలిపేందుకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. తాము ఇచ్చిన రుణంలో 5 నుండి 25-30 శాతం మాత్రమే వసూలు చేసుకొని సర్దుకుకోవాలని దివాలా ప్రక్రియ బ్యాంకులపై ఒత్తిడి తెస్తోంది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే ఖాయిలా పడిన ఈ కంపెనీలన్నీ పాలకులకు సన్నిహితులైన వారి చేతిలోకి వెళ తున్నాయి.

మోడీకి ఒకప్పుడు సన్నిహితులైన నీరవ్ మోడీ, మేహుల్ చోక్సీ, నిషాంత్ మోడీ, అమి మోడీ, నిషాల్ మోడీ, లలిత్ మోడీ, జతిన్ మెహతా, చేతన్, నితిన్ సందేశర, గుజరాత్‌కు చెందిన ఏబీజీ షిప్‌యార్డ్...వీరందరూ బ్యాంకులకు పెద్ద మొత్తంలో కుచ్చుటోపీ పెట్టిన వారే. విజయ్ మాల్యా, డీహెచ్‌ఎఫ్ఎల్, యస్ బ్యాంక్, పీఎంసీ బ్యాంక్ సహ పలువురు వ్యక్తులు, సంస్థలు చారిత్రక మోసాలకు పాల్పడ్డాయి.

బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో బన్సల్ భేటీ

- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై ప్రధాన చర్చ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై ప్రధానంగా అందులో చర్చించినట్టు తెలిసింది. బూతుల వారీగా కమిటీలు వేయడం, నూతన కార్యవర్గాల ఎంపిక, స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావడం అంశాలపై ఎక్కువ దృష్టి సారించినట్టు విశ్వసనీయ సమాచారం. ఆ సమావేశంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు, ఎంపీ డీకే అరుణ, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, నగేశ్, ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, రమణారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, తదితర నేతలు పాల్గొన్నారు.

వందేండ్ల పండగకు ముస్తాబైన మెదక్ చర్చి

- నేడు శతజయంతి ఉత్సవాలు
- చర్చి నిర్మాణదాత చార్లేస్ వాకర్ పాస్నెట్ రక్తసంబంధీకుల రాక : ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-మెదక్

తినడానికి తిండిలేక చేద్దామంటే పనిచ్చేవారు లేక ప్రజలు ఆకలితో నకనకలాడి అలమటిస్తున్న రోజులు...ప్లేగు వ్యాధి (గత్తర)తో జనం కుప్పలు తెప్పలుగా చనిపోతున్న దుర్భరమైన పరిస్థితులు పట్టెడంత అన్నం దొరికితే చాలు ఈ పూటకు బతికేస్తుంటిని అంటూ కాలం వెళ్లదీస్తున్న దారుణ పరిస్థితి అది. దేశంకాని దేశం నుండి ఖండతరాలు దాటి వచ్చిన చార్లేస్ వాకర్ పాస్నెట్ పని లేని వారికి పనిచ్చి ఆదుకోవాలనే సంకల్పంతో మెదక్‌లో1914లో చర్చి నిర్మాణ పనులను ప్రారంభించి 1924 డిసెంబర్‌లో పూర్తి చేశారు. నైజాం పాలనలో మెదక్‌ను గుల్సనాబాద్ అని పిలిచేవారు. చర్చి నిర్మించి వంద సంవత్సరాలు పూర్తి అవుతుండడంతో ఈ నెల 25న డయాసిస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించబోతున్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు. చర్చి శతాబ్ది ఉత్సవాలకు చర్చి నిర్మాణదాత చార్లేస్ వాకర్ పాస్నెట్ రక్తసంబంధీకులు కూడా హాజరు కానున్నారు. మెదక్ చర్చిని అందంగా ముస్తాబు చేశారు.

నాలుగు గంటలు.. 50కిపైగా ప్రశ్నలు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారని ప్రశ్నించినట్టు తెలిసింది. పోలీసులు అనుమతి ఇచ్చారని మీకు ఎవరు చెప్పారని, పోలీసులు అనుమతి నిరాకరించి నట్టు మీకు సమాచారం ఇచ్చారా? లేదా?.. తొక్కిసలాటలో రేవతి చనిపోయినట్టు థియేటర్లో ఉన్నప్పుడు తెలిసిందా లేదా అని అడిగినట్టు తెలుస్తోంది. అనుమతి లేకుండా రోడ్డు షో ఎందుకు నిర్వహించారని ప్రశ్నించగా అల్లు అర్జున్ సమాధానం దాటవేశారని తెలిసింది. బౌన్సర్ల గురించి పలుమార్లు ప్రశ్నించినట్టు సమాచారం. సుదీర్ఘంగా విచారించిన అనంతరం మూడు గంటల సమయంలో అల్లు అర్జున్‌ను పోలీసులు పంపించారు. అయితే విచారణ నిమిత్తం అందుబాటులో ఉండాలని ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరు కావాలని పోలీసులు అల్లు అర్జున్‌కు సూచించినట్టు తెలిసింది.

ప్రజావాణికి 370 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 370 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 107, విద్యుత్ శాఖకు సంబంధించి 80, రెవెన్యూ పరమైన సమస్యలపై 65, ప్రవాసి ప్రజావాణి సంబంధించి 4, ఇతర శాఖలవి 114 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

హాజరు మినహాయింపు దరఖాస్తు గడువు 31

- ఇంటర్ బోర్డు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఇంటర్ వార్షిక పరీక్షలకు ప్రయివేటుగా హాజరయ్యే విద్యార్థులకు హాజరు మినహాయింపు దరఖాస్తు గడువును ఈనెల 31 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎస్ కృష్ణ ఆదిత్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.500 జరిమానా విధించామని పేర్కొన్నారు. ఇంటర్ గ్రూప్ మార్పునకు సంబంధించి దరఖాస్తు చేసేందుకూ అవకాశముందని తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఆర్ట్స్/హ్యూమానిటీస్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను
మంత్రివర్గం నుంచి తొలగించాలి



(మొదటిపేజీ తరువాయి)

తేదీ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నామని వివరించారు. ఇతర పార్టీలు, సంస్థలు కూడా ఆందోళనలు చేపడుతున్నాయనీ, వాటన్నింటికీ సీపీఐ(ఎం) మద్దతు తెలుపుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దీనిపై వివరణ ఇచ్చి, క్షమాపణలు చెప్పాలనీ, ప్రధాని మోడీ ఆయన్ని మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన 129వ రాజ్యాంగ సవరణ, కేంద్రపాలిత రాష్ట్రాల సవరణ బిల్లు ఒకే దేశం-ఒకే ఎన్నికను అమలు చేయడం కోసమేనని స్పష్టం చేశారు. ఇది చాలా ప్రమాదకరమైందనీ, 129వ రాజ్యాంగ సవరణలో రాష్ట్రాల అసెంబ్లీలకు ఐదేండ్ల కాలపరిమితి తీరకున్నా, వాటిని రద్దుచేస్తామని పేర్కొంటున్నారనీ, ఇది పూర్తిగా అప్రజాస్వామికమనీ, ఫెడరల్ వ్యవస్థకు తీవ్రమైన నష్టమని చెప్పారు. కేంద్రంలో ప్రభుత్వం మూడేండ్లకే కూలిపోతే, అప్పుడు రాష్ట్రాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం చెప్తున్నట్టు ఎన్నికల ఖర్చు తగ్గించడం దీని ఉద్దేశ్యం కాదనీ, జమిలీ ఎన్నికల వెనుక దురుద్దేశ్యం ఉందని ఆక్షేపించారు. ఫెడరల్ వ్యవస్థను నాశనం చేసి, కేంద్రీకృత పాలనా వ్యవస్థను ఏర్పాటు చేసి, ఆర్ఎస్ఎస్, సంఘపరివార్ కోరుకునే విధంగా ఏకవ్యక్తి పాలనలో రాజరిక వ్యవస్థను తేవాలనే కుట్ర దీనివెనుక ఉందని వివరించారు. దానికోసమే ప్రజాస్వామ్యాన్ని వక్రీకరించి, కుదించి, దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ప్రజా తీర్పుతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికయ్యాక, దాని పాలనా కాలాన్ని కుదించే హక్కు ఎన్నికల కమిషన్‌కు ఇచ్చారన్నారు. దాని సిఫార్సుల ప్రకారం రాష్ట్రపతి నిర్ణయం తీసుకుంటారనీ, కేంద్రం చేతుల్లోకి రాష్ట్రప్రభుత్వాలను అప్పగించి, వ్యవస్థల్ని నాశనం చేసే చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దీన్ని ప్రజలందరూ గమనించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జగన్‌పార్టీలు ఉన్నాయనీ, ప్రాంతీయపార్టీలకు ఇదిగొడ్డలిపెట్టు అవుతుందని హెచ్చరించారు. ప్రాంతీయపార్టీలు ఉనికి లేకుండా పోతాయనీ, దీన్ని స్పష్టంగా అర్థం చేసుకుని, ఆయా పార్టీలు తమ విధాన నిర్ణయాన్ని వెల్లడించాలని కోరారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తాము నిరంతరం ఉద్యమిస్తూనే ఉంటామని చెప్పారు. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు కేంద్ర ప్రభుత్వం కాండాక్ట్ ఆఫ్ ఎలక్షన్ రూల్స్ పేరుతో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనల్ని మారుస్తూ నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన వివరాలైన సీసీ టీవీ ఫుటేజ్, వెబ్‌కాస్టింగ్, ఇతర వివరాలను ఎవరైనా తీసుకోవచ్చని, కానీ తాజాగా ఈ నోటిఫికేషన్‌లో ఆ వివరాలు అందరికీ ఇవ్వాల్సిన అవసరం లేదంటూ, మినహాయింపు ఇస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని వివరించారు. ఎన్నికల అక్రమాలు, అన్యాయాలపై ప్రజలు ప్రశ్నించకుండా, సమాచారం తీసుకునే అవకాశం లేకుండా, ఆ హక్కుల్ని కుదించేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనల్ని ఎన్నికల కమిషన్ చేసిందని కేంద్రం చెప్తున్నదనీ, అయితే గతంలో ఇలాంటి మార్పులు చేయాలంటే, ఎన్నికల కమిషన్ మొదట రాజకీయపార్టీలను పిలిచి వారి అభిప్రాయాలను తీసుకునేవారని చెప్పారు. ఇప్పుడు అలాంటివేం లేవనీ, ప్రతిపాదనలు చేశారో లేదో కూడా తెలీదన్నారు. కేంద్రానికి ఎన్నికల కమిషన్ తొత్తులా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియలో ముఖ్య పాత్రధారులైన రాజకీయపార్టీలను సంప్రదించకుండా ఎలా వ్యవహరిస్తారని ప్రశ్నించారు. ప్రజలకు మరింత ఎక్కువ సమాచారం ఇవ్వాల్సిన ప్రభుత్వం దాన్ని నిరోధిస్తున్నదనీ, దీనిపై దేశవ్యాప్తంగా సీపీఐ(ఎం) క్యాంపెయిన్ చేయాలని నిర్ణయించిందని తెలిపారు. రాజ్యాంగంపై చర్చ జరుపుతూనే, అదే రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే చర్యలకు కేంద్రం పాల్పడుతూ, ప్రజాస్వామిక హక్కుల్ని వక్రీకరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉత్సాహభరితంగా మహాసభల ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

వెయ్యిమందికి వసతులు ఏర్పాటు చేస్తున్నాం. 25న బహిరంగసభ నిర్వహి స్తున్నాం. ముఖ్యవక్తగా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ వస్తున్నారు. రాఘవులు, తమ్మినేని ఇతర ముఖ్యనాయకులు ఉపన్యాసకులుగా ఉంటారు. మహాసభల సందర్భంగా రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపుల్ని గ్రామాలు, పట్టణాల్లో నిర్వహిస్తున్నాం. సెమినార్లు ఏర్పాటు చేస్తున్నాం. వర్తమాన రాజకీయాలు-వామపక్షాల పాత్రపై 3వ తేదీ జరిగే సెమినార్‌లో తమ్మినేని వీరభద్రం మాట్లాడతారు. తొలిసారి సంగారెడ్డిలో మహాసభలు నిర్వహిస్తున్నాం. ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి సహాయ సహకారాలు కోరుతున్నాం".



చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ వచ్చేసింది

- ఫిబ్రవరి 23న భారత్ x పాక్ మ్యాచ్
- ఎనిమిది జట్ల మధ్య 15 మ్యాచ్‌లు

లాహోర్ : క్రీడాభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ విడుదలైంది. ఈ క్రమంలోనే భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య క్రికెట్ మజాకు తేదీ ఖరారైంది. ఇరుజట్ల మధ్య జరిగే లీగ్ మ్యాచ్ ఫిబ్రవరి-23న దుబాయ్ వేదికగా జరగనుంది. వచ్చేఏడాది పాకిస్తాన్ వేదికగా జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) మంగళవారం విడుదల చేసింది. ఫిబ్రవరి 19న కరాచీ వేదికగా పాకిస్తాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో మెగా టోర్నీ ప్రారంభం కానుంది. ఇక పాకిస్తాన్ జట్టు తన చివరి లీగ్ మ్యాచ్‌ను ఫిబ్రవరి 27న బంగ్లాదేశ్‌తో రావల్పిండిలో ఆడుతుంది. ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో ఉన్న జట్ల మధ్య ఈ మెగా టోర్నీ జరగనుంది. గ్రూప్-ఏలో భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ ఉన్నాయి. గ్రూప్-బిలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్థాన్, ఇంగ్లండ్ జట్లు ఉన్నాయి. ఇక భారత జట్టు తన తొలి మ్యాచ్‌ని ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో ఆడనుంది. భారత్ మ్యాచులన్నీ దుబాయి వేదికగా, మిగతా మ్యాచులన్నీ పాక్ వేదికగా జరుగనున్నాయి. మార్చి 4, మార్చి 5న సెమీఫైనల్స్, 9న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. రెండు సెమీ ఫైనల్స్, ఫైనల్‌కు రిజర్వ్ డేను ఐసిసి కేటాయించింది. భారత్ సెమీస్‌కు చేరితే ఆ మ్యాచులు కూడా దుబాయిలోనే జరుగుతాయి. భారత జట్టును పాకిస్తాన్‌లో పర్యటించేందుకు కేంద్రం నిరాకరించడంతో ఐసిసి హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేందుకు పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు(పిసిబి)ని ఒప్పించింది. దీంతో 2024-27వరకు భారత్‌లో జరిగే ఐసిసి ఈవెంట్స్‌ని సైతం హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించాల్సిందేనని పిసిబి పట్టుబట్టగా.. అందుకు ఐసిసి, బిసిసిఐ అంగీకారం తెలిపాయి. దాంతో రాబోయే రోజుల్లో భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే ఐసిసి ఈవెంట్లన్నీ తటస్థ వేదికల్లో తలపడతాయి.

గ్రూప్-ఎ : భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్
గ్రూప్-బి : దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్, ఇంగ్లండ్

షెడ్యూల్...

ఫిబ్రవరి 19(బుధ)	పాకిస్తాన్ x న్యూజిలాండ్
20(గురు)	భారత్ x బంగ్లాదేశ్
21(శుక్ర)	ఆఫ్ఘనిస్తాన్ x దక్షిణాఫ్రికా
22(శని)	ఆస్ట్రేలియా x ఇంగ్లండ్
23(ఆది)	భారత్ x పాకిస్తాన్
24(సోమ)	బంగ్లాదేశ్ x న్యూజిలాండ్
25(మంగళ)	ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా
26(బుధ)	ఆఫ్ఘనిస్తాన్ x ఇంగ్లండ్
27(గురు)	పాకిస్తాన్ x బంగ్లాదేశ్
28(శుక్ర)	ఆఫ్ఘనిస్తాన్ x ఆస్ట్రేలియా
మార్చి 1(శని)	దక్షిణాఫ్రికా x ఇంగ్లండ్
2(ఆది)	భారత్ x న్యూజిలాండ్
4(మంగళ)	సెమీఫైనల్-1
5(బుధ)	సెమీఫైనల్-2
9(ఆది)	ఫైనల్

(నోట్: మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం 2.30గం॥లకు ప్రారంభం)



హర్లీన్ డియోల్ సెంచరీ

- వన్డేల్లో టీమిండియా రికార్డు స్కోరు సమం
- రెండో వన్డేలో వెస్టిండీస్‌పై 115పరుగుల తేడాతో గెలుపు

సిరీస్ 2-0తో కైవసం



వదోదర : వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో హర్లీన్ డియోల్ సెంచరీకి తోడు ఓపెనర్ స్మృతి మంధాన, రావల్, రోడ్రిగ్ అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా మహిళలు 358పరుగుల రికార్డు స్కోర్‌ను నమోదు చేసింది. వెస్టిండీస్‌తో మంగళవారం జరిగిన రెండో వన్డేలో హర్మన్‌ప్రీత్ సేన విండీస్‌పై 115 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 358పరుగుల భారీ స్కోర్‌ను నమోదు చేయగా.. అనంతరం వెస్టిండీస్ కెప్టెన్ మాథ్యూస్(106) సెంచరీతో రాణించినా.. 243పరుగులకే ఆలౌట్ చేసింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ చేజిక్కించుకుంది. హర్లీన్ డియోల్ (115; 103బంతుల్లో 16ఫోర్లు) శతకానికి తోడు ఓపెనర్ స్మృతి మంధాన (53; 47బంతుల్లో 7ఫోర్లు, 2సిక్సర్లు) వరుసగా ఐదో అర్ధసెంచరీ చేసింది. మరో ఓపెనర్ ప్రతీకా రావల్ (76, 86బంతుల్లో 10ఫోర్లు, సిక్సర్) అదరగొట్టింది. జెమీమా రోడ్రిగ్స్ (52; 36బంతుల్లో 6ఫోర్లు, సిక్సర్) కూడా అర్ధ సెంచరీతో మెరిసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(22) పరుగులు చేసింది. వన్డేల్లో భారత్ 350కిపైగా స్కోరు చేయడం ఇది రెండోసారి. 2022లో ఐర్లాండ్‌పై కూడా సరిగ్గా 358/5 స్కోరు చేసింది. దీంతో రికార్డు స్కోర్‌ను భారత్ సమం చేసింది. మంధాన, ప్రతీకా జోడి తొలి వికెట్‌కు 110 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి బలమైన పునాది వేశారు. తర్వాత ప్రతీకా, హర్లీన్ జోరు కొనసాగించారు. 62 బంతుల్లో అర్ధ శతకం అందుకున్న హర్లీన్.. తర్వాత దూకుడు పెంచింది. డాటిన్ వేసిన 45 ఓవర్‌లో మూడు ఫోర్లు బాదేసిన ఆమె 98 బంతుల్లో శతకం పూర్తి చేసుకుంది. జైదా జేమ్స్ వేసిన 46 ఓవర్‌లో జెమీమా నాలుగు బౌండరీలు రాబట్టింది. ఇన్నింగ్స్ ఆఖరి రెండు బంతులకు రిచా ఘోష్ (13లి) ఫోర్లు బాది రికార్డు స్కోరును సమం చేసింది. విండీస్ బౌలర్లలో అఫీ ఫ్లెచర్, జైదా జేమ్స్, క్వినా జోసెఫ్, డాటిన్ తలో వికెట్ తీశారు.

మాథ్యూస్ సెంచరీ :

359 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన విండీస్ మహిళలు పోరాడుతున్నారు. కెప్టెన్ మాథ్యూస్ (106బీ 109 బంతుల్లో 13ఐ4) సెంచరీతో చెలరేగింది. ఓవైపు జోసెఫ్ (15), నెరిస్సా ((13), విలియమ్స్ (0), డాటిన్ (10) తక్కువ స్కోరుకే పెవిలియన్‌కు చేరుతున్నా.. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది. వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ భారత్ బౌలర్లను కాస్త కంగారుపెట్టింది. క్యాంప్ బెల్ (38) మినహా పెద్దగా ఎవరూ రాణించలేకపోయారు. 40 ఓవర్లు ముగిసే సరికి విండీస్ జట్టు 7 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసింది. ఆ తర్వాత భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో విండీస్ జట్టు 46.2ఓవర్లలో ఆలౌటైంది. ప్రియా మిశ్రాకు మూడు, దీప్తి, టిటాస్ సద్దు, రావల్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హర్లిన్ డియోల్‌కు లభించగా.. మూడో, చివరి వన్డే శుక్రవారం జరగనుంది.

స్కోర్‌బోర్డు...

ఇండియా మహిళల ఇన్నింగ్స్ : మంధాన (రనౌట్)రాంహబరాక్/కాంప్‌బెలె 53, ప్రతిక రావల్ (సి)జోసెఫ్ (బి)జేమ్స్ 76, హర్లిన్ డియోల్ (సి)అలియోనే (బి)జోసెఫ్ 115, హర్మన్‌ప్రీత్ (బి)ఫ్లెచర్ 22, రోడ్రిగ్స్ (సి)మాథ్యూస్ (బి)డోటిన్ 52, రీచా ఘోష్ (నాటౌట్) 13, దీప్తి శర్మ (నాటౌట్) 4, అదనం 23. (50ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 358పరుగులు.

వికెట్ల పతనం: 1/110, 2/172, 3/215, 4/331, 5/341

బౌలింగ్ : డోటిన్ 7-0-53-1, కానెల్ 4-0-36-0, మాథ్యూస్ 10-0-60-0, అలియానే 4-0-39-0, కరిష్మా 10-0-46-0, ఫ్లెచర్ 6-0-38-1, జేమ్స్ 7-0-57-1, జోసెఫ్ 2-0-27-1.

వెస్టిండీస్ మహిళల ఇన్నింగ్స్: మాథ్యూస్ (సి)రోడ్రిగ్స్ (బి)రావల్ 106, జోసెఫ్ (సి)రావల్ (బి)దీప్తి శర్మ 15, క్రాటన్ (సి అండ్ బి)టిటాస్ సద్దు 13, విలియమ్స్ (ఎల్‌బి)ప్రియా మిశ్రా 0, డోటిన్ (బి)రేణుక సింగ్ 10, కాంప్‌బెలె (సి)మంధాన (బి)టిటాస్ సద్దు 38, అలియానే (సి) సబ్ మిన్ను మణి (బి)దీప్తి 0, జేమ్స్ (సి)రావల్ (బి)ప్రియా మిశ్రా 25, ఫ్లెచర్ (సి)మంధాన (బి)రావల్ 22, కరిష్మా (సి)హర్లిన్ (బి)ప్రియా మిశ్రా 3, కానెల్ (నాటౌట్) 4, అదనం 7. (46.2ఓవర్లలో ఆలౌట్) 243పరుగులు.

వికెట్ల పతనం : 1/20, 2/36, 3/40, 4/69, 5/181, 6/182, 7/199, 8/227, 9/237, 10/243

బౌలింగ్ : రేణుక సింగ్ 9-1-41-1, దీప్తి శర్మ 9-1-40-2, టిటాస్ సద్దు 10-0-42-2, ప్రియా మిశ్రా 9.2-0-49-3, సైమా ఠాకూర్ 4-0-33-0, ప్రతిక రావల్ 5-0-37-2.



కంటెంటే గెలిపిస్తుంది

వెన్నెల కిషోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. అనన్య నాగళ్ల, రవితేజ మహాదాస్యం, సీయా గౌతమ్ కీలక పాత్రలు పోషించారు. రైటర్ మోహన్ రచన, దర్శకత్వం వహించారు. లాస్యారెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్‌పై వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. 'క, పొలిమేర 2, కమిటీ కుర్రోళ్లు' చిత్రాలతో విజయాలు అందుకున్న వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం నేడు (బుధవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. బ్లాక్ బస్టర్ డైరెక్టర్స్ బాబీ కొల్లి, కళ్యాణ్ కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది.

ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి మాట్లాడుతూ,'మూడు నెలల క్రితం ఈ సినిమా చూశాను. ప్రోడక్ట్ చాలా బాగా వచ్చింది. ఈ సినిమా కంటెంట్‌ని నేను బలంగా నమ్మాను. ఆ కంటెంట్ నన్ను గెలిపిస్తుందని నమ్ముతున్నాను. ఈ ఏడాది 'పుష్ప2' తర్వాత హైయ్యస్ట్ గ్రాసర్ ఈ సినిమానే అవుతుందనే నమ్మకం ఉంది. ఈ సినిమా చూసి నచ్చలేదని ఎవరైనా అంటే నా నెంబర్‌కి సంప్రదించవచ్చు. అంత కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. ఈ సినిమా నా కెరీర్‌ని అలాగే ఇందులో నటించిన నటీనటులు, టెక్నీషియన్స్ కెరీర్‌ని నెక్స్ట్ లెవెల్ తీసుకెళ్తుంది. ఈ సినిమాకి ఎర్లీ బర్డ్ షోస్ వేస్తున్నాను. వర్డ్ ఆఫ్ మౌత్‌తో బాగా స్ప్రెడ్ చేసి, సినిమాని సూపర్ హిట్ నుంచి బ్లాక్ బస్టర్ చేస్తారని కోరుకుంటున్నాను' అని అన్నారు.



సయీ మంజ్రేకర్

ప్రేమ విప్లవం..

నిఖిల్ నటిస్తున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'ది ఇండియా హౌస్'. రామ్ వంశీ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్‌పై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. హీరో రామ్ చరణ్, విక్రమ్ రెడ్డి వి మెగా పిక్చర్స్ ప్రొడక్షన్ పార్టనర్స్‌గా ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా ఫిమేల్ లీడ్ సయీ మంజ్రేకర్ పుట్టినరోజు సందర్భంగా, మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఆమె సతి పాత్రలో అందంగా కనిపించింది. ఈ పీరియడ్ డ్రామా 1905లో ఉంటుంఇ. ఇది ప్రేమ, విప్లవం ఇతివృత్తాలతో తెరకెక్కనుంది. నిఖిల్, సయీ మంజ్రేకర్‌ల ప్రేమకథ బిగ్గెస్ట్ ఎట్రాక్షన్స్‌లో ఒకటి కానుంది. ఈ సినిమాలో అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: మయాంక్ సింఘానియా, ప్రొడక్షన్ డిజైనర్: విశాల్ అబానీ.

నవచిత్రం

త్వరలోనే ఫుల్‌స్టాప్ పెడదాం



దిల్‌రాజు

'జరుగుతున్న పరిణామాల కంటే రేవతి కుటుంబ సభ్యులకు అందరం అండగా ఉండటం ముఖ్యం' అని నిర్మాత, టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు అన్నారు.
సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను మంగళవారం దిల్‌రాజు పరామర్శించారు.
ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'గత కొన్ని రోజులుగా అటు ప్రభుత్వం వైపు, ఇటు ఇండస్ట్రీ వైపు జరుగుతున్న పరిణామాలను చూస్తున్నా. నా 'గేమ్ ఛేంజర్' సినిమా కోసం అమెరికాలో ఉన్నందున ఇన్ని రోజులు రాలేకపోయా. అమెరికా నుంచి రాగానే ముఖమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశాను. రేవతి భర్త భాస్కర్‌కు పరిశ్రమ తరపున ఉపాధి కల్పిస్తానని ఆయనకు చెబితే, మంచిదన్నారు. అలాగే ఎటువంటి సమస్యలు లేకుండా చిత్ర పరిశ్రమకు, ప్రభుత్వానికి వారధిగా ఉండమని చెప్పారు. రేవతి కుటుంబానికి అండగా ప్రభుత్వం కూడా ఉంటుందని సీఎం అన్నారు. ప్రస్తుతం శ్రీతేజ్ పరిస్థితి మెరుగవుతోంది. గత రెండు రోజుల నుంచి వెంటీలేటర్ తీసేశామని డాక్టర్లు చెప్పడం కొంత ఉపశమనం కలిగించింది. త్వరలోనే శ్రీతేజ్ కోలుకోవాలని ఆశిస్తున్నా. అలాగే భాస్కర్ కుమార్తెతోపాటు ఆ కుటుంబానికి అన్ని విధాలుగా నేను అండగా నిలబడతాను.
సంధ్య థియేటర్ ఘటన ఎవ్వరూ కావాలని చేసింది కాదు. ప్రమాదవశాత్తు జరిగింది. ఎన్నో సినిమా వేడుకలు జరుగుతుంటాయి. ఇలాంటివి చాలా అరుదుగా జరుగుతాయి. ఇకపై ఇలాంటివి కూడా జరగకుండా చూసుకునేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం. చిత్ర పరిశ్రమను ప్రభుత్వం దూరం పెడుతోందనేది అవాస్తవం. దుష్ప్రచారం చేస్తున్నారంతే. జరుగుతున్న పరిణామాల దృష్ట్యా సీఎంను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కూడా ఇచ్చారు. ఈ రెండు రోజుల్లోనే ఆయన్ని కలుస్తాం. అలాగే అల్లుఅర్జున్‌ని కూడా కలిస్తా. త్వరలోనే అన్నింటికి ఫుల్‌స్టాప్ పెడదాం' అని తెలిపారు.

మెప్పించే సరికొత్త స్టోరీ టెల్లింగ్



మోహన్ లాల్

మోహన్‌లాల్ టైటిల్ రోల్‌లో నటిస్తూ, స్వీయ దర్శకత్వం వహించిన ఎపిక్ ఫాంటసీ అడ్వంచర్ 'బరోజ్ 3డీ'. ఈ సినిమాని ఆశీర్వాద్ సినిమాస్ పతాకంపై ఆంటోని పెరుంబవూర్ నిర్మించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. క్రిస్మస్ కానుకగా నేడు (బుధవారం) ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు.
హీరో, డైరెక్టర్ మోహన్ లాల్ మాట్లాడుతూ,'గత నాలుగు దశాబ్దాలుగా అద్భుతమైన చిత్ర పరిశ్రమలో భాగం కావడం ఓ గౌరవంగా భావిస్తున్నాను. ఎన్నో కథలు, పాత్రలతో మీకు చేరువయ్యాను. మీ ప్రేమ, ఆదరణకు కృతజ్ఞతలు. ఈ చిత్రానికి దర్శకత్వం వహించానని చెప్పడం చాలా ఆనందంగా ఉంది. ఇది త్రీడీ ఫిల్మ్. నేటివ్ త్రీడీలో తీసిన సినిమా. గత 40 ఏళ్ళుగా ఈ ఫార్మెట్‌లో సినిమాని ఎవరూ ప్రయత్నించలేదు. ఇది చిల్డ్రన్ ఫ్రెండ్లీ ఫిల్మ్. పిల్లలు, పెద్దలు అందరూ చూడాల్సిన సినిమా. చాలా ప్రేమతో తీశాం. మనలోని బాల్యాన్ని సెలబ్రేట్ చేసుకునే సినిమా. స్టోరీ టెల్లింగ్ చాలా కొత్తగా ఉంటుంది. సంతోష్ శివన్ లాంటి బెస్ట్ కెమరామెన్ ఈ సినిమాకి పని చేశారు. ఫస్ట్ త్రీడీ ఫిల్మ్‌కి పని చేసిన నా ఫ్రెండ్ రాజీవ్ కుమార్ ఇందులో పార్ట్ అయ్యారు. బాల మేధావి లిడియన్ నాదస్వరం ఈ సినిమాకి పాటలు సమకూర్చారు. తనలో అమాయకత్వం స్వచ్ఛమైన పాటలని అందించాయి. ఈ సినిమా బీజీఎం చాలా ప్రత్యేకంగా ఉంటుంది. మైత్రీ మూవీ మేకర్స్‌తో అసోసియేట్ అవ్వడం చాలా ఆనందంగా ఉంది. గ్రేట్ విజన్‌తో ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నారు. ప్రపంచం అంతా చూడదగ్గ సినిమా ఇది' అని అన్నారు.



పగ తీర్చుకున్న దెయ్యం

హర్రర్, సస్పెన్స్, కామెడీ కథా చిత్రాలకు ప్రేక్షకులు పట్టం కడుతున్నారు. ఆ కోవలో విభిన్నంగా తెరక్కెక్కించిన చిత్రం 'బ్లడ్'. గతంలో 'డేంజర్ లవ్ స్టోరీ'తో పాటు పలు చిత్రాలను నిర్మించిన అవధూత గోపాల్ దర్శక,నిర్మాతగా తీసిన చిత్రమిది. శ్రీ లక్ష్మీ కనకవర్షిణి క్రియేషన్స్ పతాకంపై గౌరవ్ హీరోగా, గోపాలరావు, నందినీ కపూర్, జబర్దస్త్ వినోదిని, రాకింగ్ రాకేష్, ప్రధాన పాత్రలలో నటించారు. మంగళవారం ఫిలింఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో అతిథులుగా విచ్చేసిన దర్శకులు రేలంగి నరసింహారావు, 'జబర్దస్త్' అప్పారావులతో పాటు నటుడు విజయభాస్కర్ చిత్ర ప్రోమోలను ఒక్కొక్కరు ఒకటి ఆవిష్కరించగా, 'జబర్దస్త్' వినోదిని, 'జబర్దస్త్' చిట్టిబాబు, నటులు కొల్హాపూర్ రామచంద్ర గౌడ్, ఆనందభారతి, కొల్హాపూర్ రామకృష్ణ ఐటమ్ సాంగ్‌ను ఆవిష్కరించారు.
దర్శక, నిర్మాత అవధూత గోపాల్ మాట్లాడుతూ,'ట్రెండ్‌కు అనుగుణంగా తీసిన చిత్రమిది. ఈ నెల 27న చిత్రాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో విడుదల చేయబోతున్నాం. ఓ యువతి హత్యకు గురైన నేపథ్యంలో దెయ్యంగా మారి, తనకు అన్యాయం చేసిన వారిపై ఏ విధంగా పగ తీర్చుకుందన్న అంశాన్ని ఇందులో చాలా ఆసక్తికరంగా చూపించాం. ఊహించలేని ట్విస్టులు, సస్పెన్స్‌తో ఆకట్టుకుంటుంది. ఇందులో నేను ద్విపాత్రాభినయం చేశాను' అని చెప్పారు.

మంచి సందేశమూ ఉంది



ధర్మ

ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో, హీరోయిన్లుగా నటించిన సినిమా 'డ్రింకర్ సాయి'. బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మించారు. కిరణ్ తిరుమలశెట్టి దర్శకుడు. ఈ నెల 27న ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం హీరో ధర్మ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- మాది గుంటూరులోని హనుమాన్ జంక్షన్. మా తాతయ్య ఎగ్జిబిటర్. మా నాన్న కాకాణి బాబు శోభన్ బాబు, సుహాసిని జంటగా 'పుణ్యదంపతులు' సినిమాకు ఒక ప్రొడ్యూసర్‌గా చేశారు. సత్యానంద్ దగ్గర యాక్టింగ్‌లో శిక్షణ తీసుకున్నాను. నేను తొలుత 'సింధూరం' అనే సినిమాలో నటించాను.
- ఈ కథ విన్నప్పుడు ఎగ్జైట్ అయ్యాను. వాస్తవంగా ఒక వ్యక్తి జీవితంలో జరిగిన కథ ఇది. నేను వెళ్లి ఆ వ్యక్తిని కలిశాను. అతని లైఫ్‌లో జరిగిన విషయాలన్నీ తెలుసుకున్నాను. అయితే మా మూవీలో వాస్తవ ఘటనలకు కొంత ఫిక్షన్ కలిపి రూపొందించాం.
- ప్రొడ్యూసర్ బసవరాజు శ్రీనివాస్‌కి చిరంజీవి మిత్రులు. అలా మా మూవీ కథ గురించి చిరంజీవికి చెబితే బాగుంది ప్రొసీడ్ అన్నారు.
- ఈ సినిమాలో కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు మంచి లవ్ స్టోరీ, మెసేజ్ కూడా ఉంటుంది. అయితే ఆడియెన్స్‌ను థియేటర్స్‌కు రప్పించడం కోసం కోసం ట్రైలర్, టీజర్‌లో యూత్ ఫుల్ కంటెంట్ చూపించాం. ఈ సినిమా చూసి మా నాన్న అప్రిషియేట్ చేశారు. సినిమా ఇండస్ట్రీకి వద్దన్న నాన్న ఇక్కడ సక్సెస్ అవుతావు అంటూ ఆశీర్వదించారు. ఇదే నా తొలి సక్సెస్.

అరుదైన కోర్ట్ రూమ్ డ్రామా



వీర్ రెడ్డి

వీర్ రెడ్డి, దయానంద్ రెడ్డి, ఢిల్లీ గణేశన్, గిరిధర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లీగల్లీ వీర్'. రవి గోగుల దర్శకత్వంలో సిల్వర్ కాస్ట్ బ్యానర్ పై శాంతమ్మ మలికిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సోమవారం ఈ సినిమా ప్రీరిలీజ్ వేడుకను ప్రసాద్‌ల్యాబ్‌లో వైభవంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా హీరో వీర్ రెడ్డి మాట్లాడుతూ, 'నాకు ఎటువంటి సినీ బ్యాక్ గ్రౌండ్ లేదు. కరోనా టైమ్‌లో పాడ్ కాస్ట్ చేయాలనే ఆలోచన వచ్చింది. ఆ సమయంలో సినిమా వాళ్ళతో పరిచయం ఏర్పడింది. ఓ మంచి సినిమా చేద్దాం అనుకుని, లీగల్ లాయర్‌ను కాబట్టి నాకు ఈ పాత్ర చేయడం సులభంగా అనిపించింది. ఇంత వరకు మన దగ్గర లీగల్ థ్రిల్లర్ సినిమాలు అంతగా రాలేదు. రియల్ కోర్టు డ్రామా ఎలా ఉంటుందో చూపించాలని అనుకున్నాం' అని తెలిపారు. 'వీర్ నాకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నానని అనిపించింది. ఇదొక అరుదైన సబ్జెక్ట్. మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి' అని దర్శకుడు రవి చెప్పారు. డిస్ట్రిబ్యూటర్ విశ్వనాథ్ చౌదరి మాట్లాడుతూ,'టీజర్‌కు మంచి బజ్ వచ్చింది. ఈ సినిమాను మేం 70 థియేటర్లలో విడుదల చేస్తున్నాం' అని తెలిపారు.
ప్రొడ్యూసర్ శాంతమ్మ మలికిరెడ్డి మాట్లాడుతూ, 'ప్రజాస్వామ్య దేశంలో న్యాయ వ్యవస్థ ఎంతో కీలకం. లా సబ్జెక్ట్‌పై అరుదైన సినిమా తీసుకు వస్తున్నాం. ఈ నెల 27న విడుదలయ్యే మా సినిమాను అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాం' అని అన్నారు.
ఈ చిత్రానికి సంభాషణలు - స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: రవి గోగుల, సంగీతం: శంకర్ తమిరి, సినిమాటోగ్రాఫర్: జాక్సన్ జాన్సన్, అనూష్ గోరక్, ఎడిటర్: ఉద్ధవ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: శివ చైతన్య.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886